www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

డబుల్ సమ్మర్!

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలతో సుదీర్ఘ వేసవి 14

వాతావరణ నిపుణుల అంచనా

నైరుతి సీజన్‌లో ఎల్‌నినో రాదు: ఐఎండీ

నేడు రాయలసీమ, కోస్తాకు వర్షసూచన



గురువారం | 3-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 348 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: షష్ఠి రా.9.42 తదుపరి సప్తమి, నక్షత్రం: రోహిణి ఉ.7.02, మృగశిర తె. 5.51 వరకు, వర్జ్యం: మ.12.21-మ.1.52, దుర్ముహూర్తం: ఉ.10.16-ఉ.11.05, మ.3.09-మ.3.58, అమృతఘడియలు: రా.9.29-రా.11.00, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం:6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఓకే

288-232 ఓట్లతో ఆమోదించిన సభ



లోక్‌సభలో కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు

వక్ఫ్ బిల్లు పేరును 'ఉమీద్'గా మార్చిన కేంద్రం

ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 40 అత్యంత క్రూరమైనది

దాంతో ఏ భూమినైనా తమదేనని వక్ఫ్ బోర్డు ప్రకటించవచ్చు

అలాంటి దారుణమైన సెక్షన్‌ను రద్దు చేశాం

లేదంటే పార్లమెంటు కూడా వక్ఫ్ ఆస్తే అంటారు!

జేపీసీ చేసిన అనేక సిఫారసులను పొందుపర్చాం

పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను వినియోగించాలి

ముస్లిం ప్రతినిధులే సవరణ బిల్లును ఆమోదించారు

సవరణ బిల్లుపై విపక్షాల అసత్య ప్రచారం

బిల్లుపై చర్చలో మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు

బిల్లు రాజ్యాంగ విరుద్ధం: కాంగ్రెస్

ముస్లింలకు న్యాయం చేసేందుకే బిల్లు: అమిత్ షా

బిల్లు ప్రతులను చించివేసిన మజ్లిస్ ఎంపీ ఒవైసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: వక్ఫ్ సవరణ బిల్లు-2024ను లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగాయి. వారి నిరసనల నడుమ బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వక్ఫ్ బిల్లు పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ-ఉమీద్)'గా మార్చినట్లు వెల్లడించారు. సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ) చేసిన అనేక సిఫారసులను కూడా బిల్లులో పొందుపర్చినట్లు తెలిపారు. జేపీసీ సిఫారసులను బిల్లులో చేర్చలేదన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని

మిగతా 2వ పేజీలో...

వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే ప్రాధాన్యం 2

అన్య మతస్థులకు చోటు కల్పించం

టీడీపీ విధానాన్ని స్పష్టం చేసిన బాబు

పార్టీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్



కనిగిరి నియోజకవర్గం దివాకరపల్లి వద్ద రిలయన్స్ సీబీజీ ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి, ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

సీబీజీ ప్లాంట్లతో వలసలకు చెక్

కనిగిరిని ఆ ప్లాంట్ల హబ్‌గా మారుస్తాం

రాష్ట్రంలో 65 వేల కోట్లతో 500 ప్లాంట్లు

వాటి ద్వారా 2.50 లక్షల మందికి ఉద్యోగాలు

మొత్తం 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

వైసీపీ పాలనలో పరిశ్రమలను వెళ్లగొట్టారు

అభివృద్ధిపై ఇప్పటికీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు

మానుకోకపోతే రెడ్ బుక్‌లోకి ఎక్కిస్తా: లోకేశ్

రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ

ఒంగోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పనే తన ఏకైక లక్ష్యమని, అందుకోసం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే కృషి ప్రారంభించానని రాష్ట్ర మానవ వనరులశాఖ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గడిచిన ఎనిమిది మాసాల కాలంలో రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పనకు సంబంధించి ఒప్పందాలు వివిధ సంస్థలతో జరిగాయన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని

మిగతా 12వ పేజీలో...

'తిరుమల' ఎంత భద్రం?



కొండపై వరుస ఘటనలతో ఆందోళన

అలిపిరి టోల్‌గేటు వద్ద తనిఖీల్లో డొల్లతనం

తిరుమలకు చేరుతున్న నిషేధిత వస్తువులు


టీటీడీ భద్రతా విభాగం పనితీరు ప్రశ్నార్థకం

చేతిలో లాఠీ కూడా లేకుండా విధుల్లో సిబ్బంది

ఇక్కడే ఏళ్ల తరబడి పాతుకుపోతున్న పోలీసులు

ఉన్నతాధికారులకు దర్శనాల్లో తలమునకలు

తక్షణమే విజిలెన్స్ ప్రక్షాళనకు భక్తుల వినతి



(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల భద్రతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొండ మీద వరుసగా జరుగుతున్న ఘటనలు పోలీసు శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్ పనితీరును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. సోమవారం ఓ యువకుడు ముస్లింలు ధరించే టోపీతో అలిపిరిలో ఆపినా ఆగకుండా దూసుకుపోయాడు. వినాయకుడి గుడి దగ్గర గార్డు ఆపేందుకు ప్రయత్నించినా ఆగలేదు. ఏకధాటిగా 22 కిలోమీటర్లు ప్రయాణించి తిరుమల జీఎన్సీ టోల్‌గేట్‌ను చేరుకోగలిగాడు. టాస్క్‌ఫోర్స్ అప్రమత్తంగా ఉండి ఉంటే మార్గమధ్యంలోనే అతడిని నిరోధించగలిగేవారు. అతని మానసిక స్థితి సరిగా లేదు కాబట్టి సరిపోయింది గానీ, అవాంఛనీయ శక్తులు అయివుంటే పరిస్థితి ఏమిటన్నదే ప్రశ్న. ఈ నేపథ్యంలో భద్రతకు సంబంధించిన అంశం మరోసారి తెర మీదకు తెచ్చింది. ప్రస్తుతం అనుసరిస్తున్న తనిఖీలు, భద్రతా చర్యలు ఏ మాత్రం

మిగతా 12వ పేజీలో...

కలిసి పనిచేయలేరా?

నేను చెప్పినవి అమలు చేయకపోతే ఎలా?

ఉమ్మడిగా చర్చించి నిర్ణయాలు తీసుకోలేరా?

టీటీడీలో వంద శాతం ప్రక్షాళన జరగాలి 12

భక్తుల మనోభావాలు, పవిత్రతకు పెద్దపీట

పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

దేవాలయానికి మనం ధర్మకర్తలం మాత్రమే

రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు

అధికారులు ఇష్టారీతిన ఖర్చు పెట్టొద్దు: సీఎం

3 గంటలపాటు ముఖ్యమంత్రి బాబు సమీక్ష



14

వంశీ ఆదేశాలతోనే టీడీపీ కార్యాలయంపై దాడి

పట్టాభి వస్తారన్న సమాచారంతోనే దాడికి సన్నద్ధం

ముందుగా నియోజకవర్గ వైసీపీ శ్రేణులకు పిలుపు

వంశీ కార్యాలయంలో సమావేశం

ఆయనతో మాట్లాడాక రోడ్లపైకి

సీఐడీ విచారణలో వివరించిన వంశీ అనుచరుడు రంగా



14

కాకాణి దాగుడుమూతలు!

హైదరాబాద్‌లో పోలీసులకు దొరక్కుండా మాయం

దీంతో సమీప బంధువుకు నోటీసులు అందజేత

నేడు నెల్లూరులో విచారణకు రావాలని ఆదేశం

ఇప్పటికే 2 సార్లు డుమ్మా!

పోలీసులు సీరియస్



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌పై సచివాలయంలో సీఎంతో భేటీ అయిన పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు

నూతన ఆవిష్కరణల హబ్‌గా ఏపీ

అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా చేయడమే లక్ష్యం

రాష్ట్రం నుంచి కొత్త పారిశ్రామికవేత్తలు రావాలి

స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్ హబ్‌లకు టాటా పేరు

ఇన్నోవేషన్ కేంద్రాలతో భాగస్వామ్యం అవ్వండి

ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్ సంకల్పం నిజం చేయండి

ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లతో లక్ష ఉద్యోగాలు

రాష్ట్రంలో 10 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి

పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కండి

పారిశ్రామికవేత్తలు, మేధావులకు సీఎం పిలుపు

సచివాలయంలో ఇన్నోవేషన్ హబ్‌లపై భేటీ

వీసీ ద్వారా పాల్గొన్న టాటా గ్రూప్ చైర్మన్

వయో వృద్ధుల కోసం 'పీఎంజేఏవై'

70 ఏళ్లు దాటిన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఆవిష్కరణలకు వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా చేసినట్లుగానే.. నేడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా మార్చడమే తన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను తీర్చిదిద్దేందుకు, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామికవేత్తలు రావాలని.. నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు. అందరిలోనూ స్ఫూర్తిని నింపేందుకే ఇన్నోవేషన్ హబ్‌లకు రతన్‌టాటా వంటి గొప్పవ్యక్తి పేరు పెట్టామని వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం పలువురు పారిశ్రామికవేత్తలు,

మిగతా 3వ పేజీలో...

అమరావతికి నిధులొచ్చాయ్!

రూ.3,535 కోట్లు విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు

రాష్ట్ర ఖాతాలో జమ అయిన తొలి విడత రుణం

త్వరలో ఏడీబీ నుంచి నిధుల విడుదలకు అవకాశం

2018 నుంచి అమరావతిని వెంటాడుతున్న జగన్

రాజధానికి అప్పు వద్దంటూ ప్రపంచబ్యాంకుకు లేఖలు

అన్నీ పరిశీలించాకే నిధులు విడుదల చేసిన బ్యాంకు

రాజధానికి పెద్దసంఖ్యలో తరలివస్తున్న కార్మికులు

పని ప్రదేశాల్లో సిబ్బంది కోసం భారీగా షెడ్ల నిర్మాణం



13

గ్యాప్-1 డిజైన్లకు జలసంఘం ఓకే



నేటి నుంచే పనులు ప్రారంభం 3

ఈసీఆర్‌ఎఫ్ డ్యాంలో భాగంగా

చేపడుతున్న పోలవరం అధికారులు

వచ్చేనెలలో అంతర్జాతీయ నిపుణుల రాక



నక్కా లక్ష్మి



దీపిక



నిందితుడు నవీన్

విశాఖలో ఉన్మాది ఘాతుకం

పెళ్లికి నిరాకరించిందని యువతితోపాటు ఆమె తల్లిపై కత్తితోదాడి

తల్లి మృతి.. తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన యువతి

బైక్‌పై నిందితుడు పరార్.. చేజ్ చేసి పట్టుకున్న సిక్కోలు పోలీసులు

ఘటనపై స్పందించిన సీఎం, హోంమంత్రి 14



విచారణ అనంతరం బుధవారం రాత్రి గుంటూరు ఏసీబీ కార్యాలయం నుంచి బయటికి వస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రాతిపదికేంటి?

జగన్ పత్రికపై ప్రేమ.. ఇతర పత్రికలపై వివక్ష ఎందుకు?

ఏబీసీ మార్గదర్శకాలను ఎందుకు విస్మరించారు?

ఎవరు ఒత్తిడి చేశారు.. అలా ఎందుకిచ్చారు?

ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్‌కు ఏసీబీ ప్రశ్నలు

పొంతనలేని జవాబులిచ్చిన విజయ్‌కుమార్‌రెడ్డి

గుంటూరులో 8 గంటలపాటు సుదీర్ఘ విచారణ

నేడు మళ్లీ రావాలని ఏసీబీ అధికారుల స్పష్టీకరణ

అమరావతి/గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పత్రికలకు జారీచేసే ప్రకటనలకు ప్రాతిపదిక ఏంటి.? పత్రికలకు ఏబీసీ మార్గదర్శకాలు ఉంటాయి కదా.. వాటిని ఎందుకు విస్మరించారు.? జగన్ పత్రిక, టీవీపై ప్రేమ చూపించి.. ఇతర పత్రికలు, మీడియాపై వివక్ష ఎందుకు చూపించారు.? ఎవరు మీపై ఒత్తిడి చేశారు.. ఇలా ఏకపక్షంగా ప్రకటనలు ఎందుకు జారీ చేయాల్సి వచ్చింది.. అని సమాచార, పౌరసంబంధాల (ఐ అండ్ పీఆర్) మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏసీబీ ప్రశ్నల వర్షం

మిగతా 14వ పేజీలో...



శాంతి చర్చలకు మేం సిద్ధం!

ఆపరేషన్ కగార్ నిలిపేస్తే కాల్పుల విరమణ

కగార్ ఓ నరమేధం.. 400 మంది హత్య

అమానుషంగా చిత్రహింసలు పెట్టి, మహిళలపై గ్యాంగ్‌రేప్ చేసి చంపుతున్నారు

కార్పొరేట్లకు వనరుల అప్పగింత, దోపిడీ సుస్థిరం.. ఇదే 'హిందూరాష్ట్ర' లక్ష్యం

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు కేంద్రం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలే దోషులు 2

మావోయిస్టు పార్టీ బహిరంగ ప్రకటన

ముందు తుపాకులు వీడండి

నక్సలైట్ల ప్రకటనపై ఛత్తీస్‌గఢ్ స్పందన

ప్రభుత్వ దర్యాప్తుపై పూర్తి నమ్మకముంది!



కిరణ్



[illegible]

అత్యుత్సాహంతో చేసే 'సొంత దర్యాప్తు'లు ఆపండి

ప్రవీణ్ మృతిని రాజకీయాలకు వాడుకోకండి

మత సామరస్యాన్ని దెబ్బతీయకండి 14

పాస్టర్ ప్రవీణ్ సోదరుడు, సతీమణి వినతి

పడుతూ.. లేస్తూ.. వరుస ప్రమాదాలకు గురైన పాస్టర్ ప్రవీణ్

చిల్లకల్లు టోల్‌గేట్‌కు ముందే మరో ప్రమాదం.. తాజాగా వెలుగులోకి

రైల్లో దొంగలు పడ్డారు!

తొలుత తప్పించుకున్న హౌరా-బెంగళూరు రైలు

తర్వాత వచ్చిన చండీగఢ్-మదురై ఎక్స్‌ప్రెస్

సిగ్నల్ లేక రైలు ఆగగానే దొంగల బీభత్సం

ముందే ప్రయాణికుల్లా ఎక్కిన ఇద్దరు దొంగలు

కిందే సిగ్నల్‌ను ట్యాంపర్ చేసిన మరో ముగ్గురు

2 బంగారు గొలుసుల లాక్కున్న దుండగులు

ప్రయాణికులు తిరగబడటంతో పరార్

సిగ్నల్ ట్యాంపర్ చేసి పక్కాగా పథకం

నెల్లూరు జిల్లా అల్లూరు రోడ్ వద్ద స్కెచ్

(చిట్టమూరు/నెల్లూరు క్రైం-ఆంధ్రజ్యోతి)

అర్ధరాత్రి కావస్తోంది! చండీగఢ్-మదురై సూపర్‌ఫాస్ట్ రైలు పరుగులు తీస్తోంది. కొందరు ప్రయాణికులు అప్పటికే నిద్రలోకి జారుకున్నారు. మరికొందరు.. నిద్రపోవడానికి సిద్ధమవుతున్నారు. అంతలోనే.. రైలు ఒక్కసారిగా ఆగింది. క్షణాల్లోనే దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. హల్‌చల్

మిగతా 11వ పేజీలో...



ట్రాక్ డ్రాప్ చేసిన పట్టా



కట్ చేసిన సిగ్నల్ వైర్లు

వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే ప్రాధాన్యం

» అన్య మతస్థులకు చోటు కల్పించం

» టీడీపీ విధానాన్ని స్పష్టం చేసిన చంద్రబాబు

» వక్ఫ్ బిల్లుపై పార్టీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే ప్రాధాన్యం ఉంటుందని, అన్య మతస్థులకు చోటు కల్పించే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుపై టీడీపీ ఎంపీలతో ఆయన బుధవారం ఉదయం వారితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మత సంబంధ కమిటీల్లో ఆ మతస్థులకే ప్రాతినిధ్యం కల్పించాలన్నది టీడీపీ విధానమని, అన్యమతస్థులకు అవకాశం ఇచ్చే ప్రసక్తే లేదని, వక్ఫ్ బిల్లులో రాష్ట్రాలకు ఆ వెసులుబాటు ఉందని సీఎం వివరించారు. వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే ప్రాతినిధ్యం కల్పించాలన్న పార్టీ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, నవ్యాంధ్రలో గానీ ముస్లింలకు టీడీపీ హయాంలో జరిగిన మంచిని, వారికి కల్పించిన ప్రయోజనాలను వివరించాలని ఎంపీలకు సూచించారు. వక్ఫ్ బిల్లుకు వైసీపీ ఒక్క సవరణ కూడా చెప్పలేదని, టీడీపీ మూడు సవరణలను సూచించిందని ఎంపీలు పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని సీఎంకు తెలిపారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం: మిథున్‌రెడ్డి, వైసీపీ

"వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉంది. ముస్లింల ఆందోళనలను విస్మరించింది. పలు ముస్లిం సంఘాలతో పాటు వైసీపీ కూడా తన అభ్యంతరాలను జేపీసీకి సమర్పించింది. కానీ దురదృష్టవశాత్తూ వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ముస్లిమేతరులను బోర్డులోకి ఎలా తీసుకుంటారు? మైనారిటీలను చంద్రబాబు మోసం చేశారు. టీడీపీ వైఖరిని రాష్ట్రప్రజలు గమనించాలి" అని వైసీపీ సభ్యుడు మిథున్‌రెడ్డి అన్నారు.

పాలన చేయాల్సింది కోర్టులు కాదు.. కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే

» పార్లమెంటుకు, ప్రజలకు అదే జవాబుదారీ: ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యంలో పరిపాలన చేయాల్సింది కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమేనని.. న్యాయస్థానాలు కాదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. పార్లమెంటుకు, ప్రజలకు కార్యనిర్వాహక వ్యవస్థే జవాబుదారీగా పేర్కొన్నారు. బుధవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్)ను వికేంద్రీకరించాలంటూ డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్‌వీఎన్ సోము చేసిన డిమాండ్‌పై కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఇది డీఎంకే భాగస్వామిగా ఉన్న యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానమని.. నీట్‌ను కేంద్రీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జోక్యం చేసుకున్నారు. 'ప్రభుత్వమే ఫైనల్. ప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాన్ని కోర్టుతో కలిసి పంచుకోగలదా? ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే పాలన చేయాలి. ఎందుకంటే అదే పార్లమెంటుకు, ప్రజలకు జవాబుదారీ. దేశాన్ని పాలించేందుకు ప్రజలు దానిని ఎన్నుకుంటారు. అందుచేత ఈ అంశంపై దృష్టి సారించండి' అని సూచించారు.

అంగన్వాడీల వేతనాన్ని రెట్టింపు చేయండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం రెట్టింపు చేయాలని, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసు చేసింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ అధ్యక్షతన విద్య, మహిళలు, శిశు, యువజన, క్రీడల స్థాయీ సంఘం ఈ మేరకు ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖకు ఈ నివేదిక సమర్పించినట్టు కమిటీ ఛైర్మన్ దిగ్విజయ్ సింగ్ బుధవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఈ ఏడాది చివరినాటికి అంగన్వాడీలలో ఖాళీగా ఉన్న దాదాపు 2.13 లక్షల పోస్టులను భర్తీ చేయాలి' అని కమిటీ సూచించినట్టు దిగ్విజయ్ వెల్లడించారు.

ఎస్సీ, ఓబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పెంచండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: షెడ్యూలు కులాలు, ఓబీసీ, ఈబీసీ కులాలకు చెందిన విద్యార్థులకు మంజూరు చేసే ఉపకార వేతనాన్ని పెంచాలని పార్లమెంటరీ స్థాయి సంఘం ఒకటి కేంద్రానికి సూచించింది. ఉపకార వేతన పథకాలనూ సమీక్షించాలని కోరింది. సామాజిక న్యాయం, సాధికారతపై పార్లమెంటరీ స్థాయి సంఘం ఈ మేరకు సూచనలు చేసింది. ఉపకార వేతనాల మంజూరులో ఆలస్యాన్ని నివారించాలని తెలిపింది.

నిత్యానంద క్షేమం..'కైలాస' వెబ్‌సైట్ వెల్లడి

చెన్నై, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు స్వామి నిత్యానంద జీవించే ఉన్నారని ఆయన అధికారిక వెబ్‌సైట్ కైలాస' ప్రకటించింది. మార్చి 30వ తేదీన ఆయన ఉగాది వేడుకలు కూడా జరుపుకొన్నట్టు పేర్కొంది. నిత్యానంద సజీవ సమాధి అయ్యారంటూ ఆయన మేనల్లుడు సుందరేశ్వరన్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రకటనను కైలాస వెబ్‌సైట్ తీవ్రంగా ఖండించింది. నిత్యానందను అపఖ్యాతి పాల్జేసేందుకు, దురుద్దేశపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న నిత్యానంద 2020లో దేశం నుంచి పారిపోయి పసిఫిక్ దీవుల్లో 'కైలాస' పేరుతో ఓ దీవిని దేశంగా ప్రకటించుకున్న విషయం తెలిసిందే.

ముగ్గురు పిల్లల్ని చంపిన తల్లి

ప్రియుడి మోజులోపడి ఘాతుకం.. సంగారెడ్డి జిల్లాలో దారుణం



నిందితురాలు రజిత

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు రాత్రి నిద్రపోయినవారు నిద్రపోయినట్లుగా ప్రాణాలొదలడం.. పక్కనే నిద్రించిన తల్లి అర్ధరాత్రి తర్వాత కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటన గుర్తుందా? వారం క్రితం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనలో ఆ పిల్లల కన్న తల్లే కసాయి అని తేలింది. కేసు వివరాలను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లికి చెందిన అవురిచింతల చెన్నయ్య(50) మొదటి భార్య చనిపోయింది. కొన్నాళ్లకు తనకన్నా 20 ఏళ్ల వయసులో చిన్నదైన రజిత(30) అలియాస్ లావణ్యను చెన్నయ్య 2005లో రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయికృష్ణ(12), మధుప్రియ(10) గౌతమ్(8) పిల్లలు. అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని రాఘవేంద్ర కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ఈ కుటుంబం ఉంటోంది. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. రజిత స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. రజిత ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న చెన్నయ్య తరచూ ఆమెతో గొడవ పడేవాడు. అతడి వేధింపులు భరించలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చజెప్పడంతో తిరిగి భర్త చెంతకు వచ్చింది. గత నెల 27వ తేదీన రాత్రి 8 గంటలకు పిల్లలతో కలిసి చెన్నయ్య, రజిత భోజనం చేశారు. రజిత, పిల్లలు పెరుగన్నం తినగా చెన్నయ్య పప్పన్నం తిని విధులకు వెళ్లిపోయి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికొచ్చాడు. తెల్లవారుజామున మూడు గంటలకు రజిత తనకు కడుపునొప్పి అంటూ బిగ్గరగా రోదించడంతో స్థానికుల సాయంతో భర్త చెన్నయ్య ఆమెను ఆస్పత్రికి తరలించాడు. తర్వాతే ముగ్గురు పిల్లలు మృతిచెందినట్లుగా గుర్తించారు. కాగా, తన చిన్ననాటి స్నేహితుడు శివకుమార్(30)తో రజితకు వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్త చెన్నయ్యను వదిలేసి వస్తానని, తనను పెళ్లి చేసుకోవాలని శివను కోరింది. నీకు ముగ్గురు పిల్లలు ఉన్నారు కదా.. కుదరదు అని అతడు చెబితే.. వారిని అడ్డుతొలగించుకొని వస్తానని రజిత అతడికి చెప్పింది. దీనికి అతడు సరేనన్నాడు. ఘటన రోజే శివకు ఫోన్ చేసిన రజిత తాను పిల్లలను చంపబోతున్నట్లు చెప్పింది. ఆ రోజు రాత్రి భర్త, పిల్లలతో కలిసి భోజనం చేశాక చిన్నారులను పడుకోబెట్టింది. భర్త విధులకు వెళ్లిపోయాక నిద్రలో ఉన్న పిల్లలను చంపేసింది. ఈ కేసులో నిందితులు రజిత, ఆమె ప్రియుడైన శివను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు గుప్పించారు. బిల్లుపై అర్ధరాత్రి వరకూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అనంతరం బిల్లుపై ఓటింగ్ నిర్వహించగా... అనుకూలంగా 226, వ్యతిరేకంగా 163 ఓట్లు పడ్డాయి. వెరసి... లోక్‌సభ 'ఉమీద్' బిల్లు ఆమోదం పొందింది. బిల్లుపై చర్చ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లు మతానికి సంబంధించినది కాదని, కేవలం ఆస్తుల విషయాలకు సంబంధించినదేనని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లులోని అత్యంత క్రూరమైన సెక్షన్ 40 రద్దు కానుందన్నారు. ఈ సెక్షన్ కారణంగా ఏ భూమినైనా తమదేనని ప్రకటించుకునే హక్కు వక్ఫ్ బోర్డు, ట్రిబ్యునల్‌కు ఉందని.. దీన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన సెక్షన్‌ను తాము తొలగించామని చెప్పారు. కొందరు ప్రతిపక్ష నేతలు చెబుతున్నట్లుగా ముస్లిం వర్గాలకు చెందిన ఏ భూమినీ తాము లాగేసుకోబోమని స్పష్టం చేశారు. "పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి అధికారి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టం చేశారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. తాజా బిల్లును పరిశీలించిన జేపీసీకి అభినందనలు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ అన్నారు. దానికి స్పందనగానే రిజిజు లోక్‌సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకునేందుకు ఈ బిల్లు తోడ్పడుతుందని, వక్ఫ్ ఆస్తులన్నీ డిజిటల్ పోర్టల్‌లో ఉంటాయని, ఎవరూ ఆక్రమించేందుకు ఆస్కారం ఉండదని రిజిజు చెప్పారు. బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

దౌర్జన్యపూరితం: కాంగ్రెస్

వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బిల్లును వ్యతిరేకించారు. కేంద్రం దౌర్జన్యపూరితంగా బిల్లును తెస్తోందని ఆరోపించారు. సభలో ప్రవేశపెట్టే బిల్లుకు సవరణలు ప్రతిపాదించే హక్కు సభ్యులకు ఉంటుందన్నారు. సవరణలకు కనీస సమయం ఇవ్వకుండా హడావుడిగా ప్రవేశపెట్టారని ఆక్షేపించారు. మోదీ సర్కారు ఆరెస్సెస్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. బిల్లు కేవలం పాలనాపరమైన మార్పులకు సంబంధించినది కాదని.. మైనారిటీ వర్గాలను అవమానించడం, భారత సమాజాన్ని విభజించడమేనని చెప్పారు. అసలు ఈ బిల్లును మైనారిటీ వ్యవహారాల శాఖ రూపొందించిందా? లేక మరో శాఖ తయారు చేసిందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. "జేపీసీ వేయాలన్నదే మీరు. కమిటీ సూచించిన మార్పులుచేర్పులను అంగీకరించకపోతే జేపీసీని ఎందుకు ఏర్పాటు చేయమన్నారు" అని ప్రశ్నించారు. వక్ఫ్ భూముల విషయంలో అవినీతిని అడ్డుకొని, పేద ముస్లింల భూమిని కాపాడడమే ఈ బిల్లు ఉద్దేశమని తెలిపారు. వక్ఫ్ అంటే అరబిక్‌లో అల్లా పేరుతో దానం అని అర్థమని, అది దాతృత్వ కార్యక్రమని చెప్పారు. మీది కాని భూమిని దానం చేయడాన్ని దాతృత్వమని అనరని గుర్తుచేశారు.

అమిత్ షా,అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు

వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. "ప్రపంచంలో అతిపెద్ద పార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోంది" అని బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. "అఖిలేశ్ నవ్వుతూ ఓ విషయం చెప్పారు. నేను కూడా అలాగే సమాధానం ఇస్తా. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది. వారి నుంచే అధ్యక్షుడిని నియమించుకుంటారు. కానీ, మేం 12-13 కోట్ల మంది పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు అలాంటిదేం అక్కర్లేదు. ఎందుకంటే మరో 25 ఏళ్లు మీరే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారు" అని అమిత్ షా దీటుగా బదులిచ్చారు



వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా యూపీలోని మీరట్‌లో సున్నితమైన ప్రాంతాల్లో పోలీసుల కవాతు

దేశంలో వక్ఫ్ బోర్డు నిర్వహణలోని స్థిరాస్తులు మొత్తం: 8,72,324

వాటిలో ముఖ్యమైన ఆస్తుల వివరాలు

1) శ్మశానాలు	1,50,569
2) దుకాణాలు	1,13,193
3) వ్యవసాయ భూములు	1,40,803
4) మసీదులు	1,19,280
5) ఇళ్లు	92,517
6) ప్లాట్లు	64,975
7) దర్గాలు	33,502

ముస్లింలపై యుద్ధం ప్రారంభించిన మోదీ సర్కారు: ఒవైసీ

వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును ముస్లింలపై దాడిగా అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం మసీదులు, దర్గాలు, మదర్సాలు, ముస్లింల స్వేచ్ఛపై యుద్ధాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని విమర్శించారు. వక్ఫ్ బిల్లు రాజ్యాంగంలోని 14వ అధికరణాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఆక్రమణదారులే యజమానులు అయిపోతారని, ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డు పాలనలో భాగస్వాములవుతారని ఆరోపించారు. ఆలయాలు, మసీదుల పేరిట బీజేపీ దేశంలో వివాదాలు సృష్టించాలని చూస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన బిల్లు ప్రతులను చించివేశారు.

లోకం తీరు



కోర్టులో సవాలు చేస్తాం

» ముస్లిం పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: వక్ఫ్ సవరణ బిల్లును కోర్టులో సవాలు చేస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) ప్రకటించింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ఏఐఎంపీఎల్‌బీ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు ఎండీ అబీద్ మాట్లాడుతూ ఆ 'నల్ల చట్టానికి' వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ బిల్లును ముస్లింల ఆస్తులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంగా అభివర్ణించారు. 'ఈ పోరాటంలో మనం ఓడిపోయామని భావించొద్దు. మనం ఇప్పుడే ప్రారంభించాం. ఇది దేశాన్ని కాపాడేందుకు చేస్తున్న పోరాటం. ఎందుకంటే భారత దేశ మౌలిక స్వభావానికే ముప్పుగా ప్రతిపాదిత చట్టం ఉంది' అన్నారు. మనస్సాక్షిగల పౌరులందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. బిల్లును ఉపసంహరించుకునే వరకూ విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు. రైతులు చేసినట్టే తామూ దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని, అవసరమైతే రోడ్లను దిగ్బంధిస్తామని ఏఐఎంపీఎల్‌బీ ఉపాధ్యక్షుడు అలీ మొహిసిన్ చెప్పారు.

ఉపసంహరించుకోండి: స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. "మైనారిటీల హక్కుల పరిరక్షణలో తమిళనాడు ముందంజలో ఉంది. ప్రతి పౌరుడికీ తమ మతాన్ని అనుసరించే హక్కును భారత రాజ్యాంగం ప్రసాదించింది. ఈ హక్కును కాపాడడం, పరిరక్షించడం ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వాల విధి. అయితే, ప్రస్తుత వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉంది" అన్నారు. డీలిమిటేషన్ చుట్టూ అలముకున్న ఆందోళనలపై మెమొరాండం సమర్పించేందుకు, వివిధ పార్టీలకు చెందిన ఎంపీలతో సహా తాను కూడా వచ్చి చర్చించేందుకు అనువుగా అవకాశం ఇవ్వాలని స్టాలిన్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు.



సింధు, మౌల్య, జ్యోతి (ఫైల్)

అత్త, మరదలు, కూతురును కాల్చి చంపి వ్యక్తి ఆత్మహత్య

» వదిలేసి వెళ్లిన భార్య గురించి ప్రశ్నిస్తుండడంతో మనస్తాపం

» కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరులో దారుణం



రత్నాకర్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భార్య వదిలేసి వెళ్లిన విషయాన్ని గ్రామస్థులు తరచూ ప్రస్తావించడం, పాఠశాలలో కూతురుని 'మీ అమ్మ ఏమైంది..?' అని తోటివిద్యార్థులు ప్రశ్నిస్తుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ వ్యక్తి కూతురు, అత్త, మరదలుని తుపాకీతో కాల్చి చంపేశాడు. ఆ తరువాత అదే తుపాకీతో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో మరదలి భర్త బుల్లెట్ గాయాలతో బతికి బయటపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరు జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రత్నాకర్(40) అనే వ్యక్తి కడబగెరెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా రెండేళ్ల క్రితం అయనను భార్య వదిలి వెళ్లిపోయింది. రత్నాకర్, అతని కూతురు మౌల్యతో పాటు అతని అత్త జ్యోతి కూడా ఉంటున్నారు. కాగా, భార్య వెళ్లిపోయిన విషయం గురించి ఇటీవల గ్రామస్థులు తరచూ రత్నాకర్ వద్ద ప్రస్తావించారు. రత్నాకర్ తట్టుకోలేకపోయాడు. తనను మోసగించారని అత్త, మరదలు, ఆమె భర్తతో మంగళవారం రాత్రి గొడవపడ్డాడు. నాటు తుపాకీతో అత్త జ్యోతి(50), కూతురు మౌల్య(6), మరదలు సింధు(24)ను కాల్చి చంపాడు. తర్వాత అదే తుపాకీతో రత్నాకర్ కాల్చేసుకున్నాడు.

అమెరికా ఉత్పత్తులపై ఇజ్రాయెల్ సుంకం రద్దు

జెరూసలేం, ఏప్రిల్ 2: ప్రతీకార సుంకాల విధింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారిక ప్రకటన చేయనున్న వేళ ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి తమ దేశానికి అయ్యే అన్ని దిగుమతులపై వసూలు చేసే సుంకాలను పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని, ఆర్థిక శాఖ కార్యాలయాలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. ఈ నిర్ణయం ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, ఇజ్రాయెల్ పౌరుల ఖర్చులను తగ్గిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. నిజానికి, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తుల్లో 99% వాటిపై ఇజ్రాయెల్ ఇప్పటికే ఎలాంటి సుంకాలు వసూలు చేయడం లేదు. కేవలం వ్యవసాయ ఉత్పత్తులపై మాత్రమే సుంకాలు విధిస్తోంది.

శాంతి చర్చలకు మేం సిద్ధం!

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేస్తే తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తాం

» ప్రభుత్వాలకు మావోయిస్టు పార్టీ ప్రతిపాదన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ
తేది: 28.3.2025.

శాంతి చర్చలపై మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగిస్తున్న నరమేధాన్ని నిలిపివేస్తే.. శాంతిచర్చలకు, కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రకటించింది. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను నిలిపివేయాలని, బస్తర్‌లోని సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని, కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట గత నెల 28వ తేదీన విడుదల చేసిన బహిరంగ ప్రకటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మార్చి 24వ తేదీన హైదరాబాద్‌లో 'కేంద్ర ప్రభుత్వం- మావోయిస్టు పార్టీ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతిచర్చలు జరపాలి' అన్న అంశంపై 'శాంతిచర్చల కమిటీ' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని స్వాగతిస్తున్నామని అభయ్ పేర్కొన్నారు. శాంతి చర్చలకు తాము తొలి నుంచీ సిద్ధంగా ఉన్నామన్నారు. 'గత ఏడాది జనవరిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం, విప్లవోద్యమం ఉనికిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆపరేషన్ కగార్ పేరిట ప్రజలపై ప్రతీఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయి. ప్రజలను మోసగించడానికి ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ.. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. దీనిపై మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ స్పందిస్తూ.. చర్చలకు తాము కూడా సిద్ధమని రెండుసార్లు తెలిపారు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. పైగా, గత 15 నెలలుగా కగార్ పేరిట ఆదివాసీలపై, ప్రజలపై యుద్ధం చేస్తున్నాయి' అని అభయ్ వివరించారు. చత్తీస్‌గడ్‌లో జరుపుతున్న నరమేధం కారణంగా.. ఇప్పటివరకూ మావోయిస్టు పార్టీకి చెందిన 400 మందికి పైగా వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు హత్యకు గురయ్యాయరని తెలిపారు. వీరిలో మూడొంతుల మంది ఆదివాసీలేనన్నారు. తమ పార్టీకి చెందిన వేలాదిమందిని అరెస్టు చేశారన్నారు.

పథకం ప్రకారమే నరమేధం

'కార్డన్ అండ్ కిల్' (చుట్టుముట్టడం, చంపివేయటం) అనే పద్ధతి ప్రకారం మారణహోమం జరుపుతున్నారని, పట్టుబడిన వారిని అత్యంత అమానుష పద్ధతుల్లో చిత్రహింసలు పెట్టి చంపుతున్నారని, మహిళా కామ్రేడ్స్‌పై సామూహిక అత్యాచారాలు జరిపి హత్య చేస్తున్నారని అభయ్ పేర్కొన్నారు. అందుకే ఈ యుద్ధాన్ని తాము నరమేధంగా చెబుతున్నామన్నారు. ఈ యుద్ధంలో భద్రతా బలగాలు పాల్గొంటున్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాస్తవానికి భారతసైన్యాన్ని మోహరించారని తెలిపారు. ఆ పోరాటాన్ని అణచివేసి.. భూమిని, ప్రకృతి వనరులను కార్పొరేట్ కంపెనీల అధిపతులకు కట్టబెట్టటం కోసం ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ జరుపుతున్నాయని పేర్కొన్నారు.

నియంతృత్వమే 'హిందూరాష్ట్ర' లక్ష్యం

సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీని సుస్థిరం చేయటమే 'హిందూరాష్ట్రం' లక్ష్యమన్నారు. భూముల్ని, వనరుల్ని, ప్రభుత్వరంగ సంస్థల్ని కార్పొరేట్లకు అప్పగించటం, మతమైనారిటీలపై వివక్షను రాజ్యాంగబద్ధం చేయటం, సమాఖ్య వ్యవస్థను నిర్మూలించి నియంతృత్వ ప్రభుత్వాన్ని నెలకొల్పటం కోసమే ఆపరేషన్ కగార్ జరుపుతున్నారని అభయ్ ఆరోపించారు. శాంతిచర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతిచర్చల కమిటీకి, ప్రజామేధావులకు, హక్కుల సంఘాలకు అభయ్ విజ్ఞప్తి చేశారు.

తుపాకులు వీడాలన్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

చింతూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేస్తూ మావోయిస్టులు రాసిన లేఖపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పందించింది. మావోయిస్టులు తుపాకులను వీడాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ ఓ ప్రకటన చేశారు. ఇప్పటికే లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తుపాకులు వీడితేనే చర్చలకు అర్థముంటుందని అభిప్రాయపడ్డారు. అంతేకానీ, సమాంతర పాలన చేయాలనుకుంటే చర్చలకు ఫలితం ఉండదన్నారు. ఇందుకు మావోయిస్టులు సిద్ధంగా ఉంటే.. ఓ కమిటీని ఏర్పాటు చేసుకుని, వివరాలను అందజేయాలని సూచించారు.

దేశాలు, రంగాలవారీగా సుంకాలు!

» ప్రతీకార సుంకాలపై వైట్‌హౌస్ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: తమదేశంపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలన్నింటిపైనా ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నెలరోజులుగా హెచ్చరిస్తూ వస్తున్న నేపథ్యంలో.. ప్రపంచదేశాలన్నీ బుధవారం ఆయన చేసే ప్రకటన కోసం మునివేళ్లపై ఎదురుచూశాయి! మొత్తం అన్ని దేశాల దిగుమతులపైనా గంపగుత్తగా 20% సుంకం విధించే అవకాశం ఉందని కొన్ని కథనాలు రాగా.. తాము విధించబోయే సుంకాలు దేశాలు, రంగాలవారీగా ఉంటాయని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించినట్లు అమెరికన్ వార్తా సంస్థ 'స్కై న్యూస్' ఒక కథనంలో వెల్లడించింది. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో) వైట్‌హౌస్‌లోని రోజ్‌గార్డెన్‌లో నిర్వహించే ఒక కార్యక్రమంలో.. ట్రంప్ ప్రతీకార సుంకాలపై ప్రకటన చేస్తారని, ఆ క్షణం నుంచే అవి అమల్లోకి వస్తాయని ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతీకార సుంకాల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో.. వాటిపై పర్యవేక్షణకు, ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని, ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారతదేశం ఒక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇతరదేశాలపై ఈ సుంకాల ప్రభావం.. వాటివల్ల భారత్‌కు ఏవైనా ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందా అనే అంశాలను కూడా అధికారులు అక్కడి నుంచి అంచనా వేయనున్నారు.

అరెస్టుల్లో పోలీసులు హద్దులు దాటొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అరెస్టుల విషయంలో పోలీసులు హద్దులు దాటొద్దని సుప్రీంకోర్టు మరోమారు హెచ్చరించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు నిందితులకు ఉంటాయని, అరెస్టు విషయంలోనూ గౌరవమర్యాదలను పాటించాలని హితవు పలికింది. హరియాణాలో.. వరకట్న వేధింపుల కేసులో అరెస్టయిన ఓ బాధితుడి పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హరియాణా పోలీసులు తనను అరెస్టు చేసే సమయంలో.. పోలీస్‌స్టేషన్‌లో తనపై దాడి చేశారని బాధితుడు పేర్కొన్నారు. "అరెస్టు సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఈ కోర్టు ఎన్నో సందర్భాల్లో జారీ చేసింది. దాన్ని కింది స్థాయి అధికారులకు వివరించాల్సిన బాధ్యత డీజీపీదే" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్నేశ్‌కుమార్, తదితర కేసుల తీర్పులను తాజాగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు పంపింది.

వయో వృద్ధుల కోసం 'పీఎంజేఏవై'

- 70 ఏళ్లు దాటిన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డెబ్బై ఏళ్లు దాటిన వయో వృద్ధులకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకం కింద రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం రాష్ట్రంలో కూడా అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బీపీఎల్ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ కల్పిస్తోంది. అందులో వయో వృద్ధులు కూడా ఉన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వీరికి 3,257 రకాల శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు. ఆధార్ కార్డుల్లో 70 ఏళ్లు పైబడి ఉన్న వారికి ఈ పథకం కింద ఉచిత వైద్యం అందిస్తారు. వయో వృద్ధులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల్లో దేన్ని ఉపయోగించుకుంటారో వారే నిర్ణయించుకోవాలి. ఆయుష్మాన్ యాప్ ద్వారా సినియర్ సిటీజన్లు ఈ స్కీమ్‌లో చేరవచ్చు. అర్హత కలిగిన సీనియర్ సిటిజన్లకు జిల్లాల్లో ప్రత్యేక కార్డులు అందిస్తారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో దీనిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్యాప్-1 డిజైన్లకు జలసంఘం ఓకే

- నేటి నుంచే పనులు ప్రారంభం
- ఈసీఆర్ఎఫ్ డ్యాంలో భాగంగా చేపడుతున్న పోలవరం అధికారులు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టిన ఇంజనీరింగ్ అధికారులు.. గురువారం నుంచి గ్యాప్-1 పనులు మొదలుపెడుతున్నారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంలో (ఈసీఆర్ఎఫ్)లో భాగంగా చేపడుతున్న ఈ గ్యాప్-1 పనుల డిజైన్లకు కేంద్ర జల సంఘం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ప్రాజెక్టులో ఒకవైపు ఉన్న కొండ పక్కగా మట్టి, రాతి కట్టడం పనులు మొదలుపెడుతున్నారు. ఈ కట్టడం ఎత్తు 28 మీటర్లు. 2027 డిసెంబరునాటికి ఈసీఆర్ఎఫ్ డ్యాంను పూర్తి చేసేందుకు ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైంది. డయాఫ్రం వాల్ పొడవు 1,356.60 మీటర్లు కాగా.. ఇప్పటికి 89.48 మీటర్లు పూర్తయింది. డిసెంబరుకల్లా వాల్ పూర్తవుతుందని అంటున్నారు. కుడి, ఎడమ కనెక్టివిటీలను 2027 జూలై నాటికే పూర్తి చేస్తామని జల వనరుల శాఖ చెబుతోంది. కాగా.. అంతర్జాతీయ నిపుణులు వచ్చే నెలలో మరోసారి ప్రాజెక్టును సందర్శించనున్నారు.



పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయంలో జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

శివయ్య సేవలో జస్టిస్ జ్యోతిర్మయి

పెదకాకాని, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ జ్యోతిర్మయి దంపతులను వేదపండితులు ఆశీర్వదించి, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఆకాశ్ అంబానీ



తిరుమల ఆలయం ముందు ఆకాశ్ అంబానీ

తిరుమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ పెద్ద కుమారుడు, జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పంచె కట్టు, నుదుట బొట్టుతో ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 క్యూలైన్ ద్వారా ఆయన ఆలయంలోకి వెళ్లారు. శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానంతరం ఆకాశ్ అంబానీకి వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుమలలోని గోశాలను సందర్శించిన ఆకాశ్ అంబానీ గోపూజలో పాల్గొన్నారు. శ్రీవారి వాహన సేవల్లో పాల్గొనే గజరాజుల(ఏనుగుల) ఆశీర్వాదం పొందారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆకాశ్ అంబానీ తిరుమల పర్యటన సాగింది.

హంద్రీనీవాతోనే కరువు రహిత రాష్ట్రం: నిమ్మల

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే కార్యక్రమం హంద్రీ-నీవాతోనే ఆరంభమవుతుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. విజయవాడలో బుధవారం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుతో కలసి రాయలసీమ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి నిమ్మల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జూన్‌కల్లా హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇంజనీర్లు చురుగ్గా పనిచేయాలని చెప్పారు. హంద్రీనీవా పూర్తి కాకపోవడానికి జగనే కారణమని మంత్రి చెప్పారు. ప్రాజెక్టు పరిధిలో ఆనాడు చంద్రబాబు ఏర్పాటు చేసిన 3,850 క్యూసెక్కుల సామర్థ్యంగల మోటార్లను నిర్వహించడం కూడా జగన్‌కు చేతకాలేదన్నారు. హంద్రీనీవా కరెంటు బిల్లులనూ జగన్ కట్టలేదని ఆరోపించారు.

ముస్లింలకు నూతన ఉచిత విద్యా పథకం

- వక్ఫ్ భూముల అభివృద్ధికి టెండర్లు: అబ్దుల్ అజీజ్

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు నిర్ణయించింది. పదో తరగతి ఉత్తీర్ణులైన ముస్లిం విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ఇంటర్‌లో పూర్తిస్థాయిలో ఉచిత విద్య అందించాలని యోచిస్తోంది. దీనికి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాల్సి ఉంది. విజయవాడలో బుధవారం చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ఏపీ వక్ఫ్‌బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడుతూ ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు నూతన పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల అద్దెల సవరణకు కమిటీని నియమించామన్నారు. డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న 933 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లీజుకు ఇస్తామన్నారు. వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడే వక్ఫ్ భూములను అభివృద్ధి చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తదితరులున సమావేశంలో పాల్గొన్నారు.

సత్యవేడుకు కొత్త ఇన్‌చార్జిని నియమించండి

- వైసీపీ వాళ్లకే ఎమ్మెల్యే ఆదిమూలం పెద్దపీట
- రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీడీపీ నాయకులను, కార్యకర్తలను విస్మరిస్తున్నారని.. వైసీపీ వాళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఫిర్యాదుచేశారు. తమకు కొత్త ఇన్‌చార్జిని నియమించాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. 200 మందికిపైగా నేతలు బుధవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి ఆయన్ను కలిశారు. ఎమ్మెల్యే కొడుకు సుమన్ వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారని, ఎమ్మెల్యే సైతం ఆ పార్టీ వారికే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థాయి నాయకుల నుంచి మండల స్థాయి నాయకుల వరకు ఎవరినీ ఎమ్మెల్యే కలుపుకొని వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము టీడీపీలో ఉన్నామో, వైసీపీలో ఉన్నామో అర్థం కావడం లేదన్నారు.

డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు మాత్రలు అమ్మొద్దు

- డ్రగ్ డీలర్లకు 'ఈగల్' ఐజీ రవికృష్ణ నిర్దేశం
- తాము ఆపితే.. యువత ఆన్‌లైన్‌లో తెప్పించుకొంటున్నారన్న డీలర్లు
- ఆ మందులు అవసరమైన రోగులు ఇబ్బంది పడుతున్నారని వ్యాఖ్య

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్(మత్తు మాత్రలు) విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, డాక్టర్ చీటీ లేకుండా అటువంటి మందులు ఇవ్వొద్దని డ్రగ్ డీలర్లకు 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, మందుల విక్రయ డీలర్లు, విజిలెన్స్ అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో మత్తు మహమ్మారిని తరిమేసే యజ్ఞంలో భాగంగా పోలీసులతో కలిసి గంజాయిని బాగా కట్టడి చేశామని చెప్పారు. మత్తుకు అలవాటు పడ్డ యువత మెడికల్ షాపుల్లో ఎన్ఆర్ఎక్స్ మందులు కొని విచ్చలవిడిగా వినియోగిస్తుండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అందుకని ఆ రకమైన మందులు డాక్టర్ సిఫారసు చీటీ లేకుండా ఎవ్వరూ విక్రయించవద్దని ఆదేశించారు. ఇటీవల 'ఆపరేషన్ గరుడ' పేరుతో ఈగల్, డ్రగ్ కంట్రోల్, విజిలెన్స్ విభాగాలు ఉమ్మడిగా నిర్వహించిన సోదాల్లో 158 మెడికల్ షాపుల్లో పలు అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా నిషేధిత మందులు విక్రయిస్తే ప్రజల్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే, ఈగల్ ఐజీ చర్యల వల్ల రాష్ట్రంలో ఎన్ఆర్ఎక్స్ మందులు తప్పనిసరిగా వాడాల్సిన రోగులు ఇబ్బంది పడుతున్నారని వాటి విక్రయదారులు చెబుతున్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రేతల్ని అరెస్టు చేసి మత్తును అదుపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 'ఈగల్' విభాగాన్ని ఏర్పాటు చేస్తే, మెడికల్ స్టోర్లపై పడటం విచిత్రంగా ఉందంటున్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ విక్రయాలను తాము పూర్తిగా ఆపేశామని, అయితే, యువత ఆన్‌లైన్‌లో వాటిని బెంగళూరు, హైదరాబాద్ నుంచి తెప్పించుకొంటున్నారని చెబుతున్నారు. మందుల షాపుల తనిఖీలకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, తప్పు చేస్తే లైసెన్స్ రద్దు చేసేందుకు ఏడీలు, ఉత్పత్తుల్లో నాణ్యత లేకుంటే చర్య తీసుకోవడానికి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఈగల్ విభాగం చర్యలు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ లేదు: దామోదర్‌నాయుడు

రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడా బర్డ్ ఫ్లూ ఉనికిలో లేదని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు స్పష్టం చేశారు. 'రెండు నెలల క్రితం రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో కోళ్లలో బర్డ్‌ఫ్లూ సోకింది. ప్రభుత్వం, కోళ్ల పెంపకందారులు సంయుక్తంగా సరైన చర్యలు తీసుకోవడంతో బర్డ్‌ఫ్లూని నియంత్రించాం. మార్చి నెలలో రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ నమోదు కాలేదు. గతంలో సూచించిన విధంగా పూర్తిగా ఉడికించిన గుడ్లు, మాంసం తినడం సురక్షితం. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహ చెందాల్సిన అవసరం లేదు' అని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

నూతన ఆవిష్కరణల హబ్‌గా ఏపీ



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌పై సమావేశంలో పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు

(మొదటి పేజీ తరువాయి)

విద్యావంతులతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.

నాటి సంస్కరణలతో సత్ఫలితాలు

భారతీయులు దేశ విదేశాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, విదేశీయుల కంటే ఎక్కువగా ఆర్జిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆ ఎంటర్‌ప్రెన్యూర్లలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణలే కారణమని అన్నారు. ఆ సంస్కరణలు ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. సీఐఐ సమావేశాలు నిర్వహించడం, ఇంజనీరింగ్ కాలేజీలు విస్తరించడం, మైక్రోసాఫ్ట్ సహా ఇతర ప్రముఖ కంపెనీలను రప్పించడం ద్వారా హైదరాబాద్ నగర రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీ -వన్ ఐటీ ప్రొఫెషనల్ అని గతంలో తాను చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తుచేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా ఆయా ప్రాంతాలను, అక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రతిభతో రాణిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా దూరం సమస్య కానేకాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేస్తున్నామని అన్నారు.

పేదరికాన్ని రూపుమాపడానికే పీ4

గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన పీ3 కార్యక్రమంతో చాలా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని చంద్రబాబు చెప్పారు. ఈసారి పూర్తిగా పేదరికం నిర్మూలనకు పీ4 కార్యక్రమానికి పిలుపు ఇచ్చామన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు అట్టడుగున ఉన్న పేదలకు అండగా నిలవడమే పీ4 లక్ష్యమని చెప్పారు. అంబేడ్కర్, అబ్దుల్ కలాం వంటి వారు ఇతరుల సహాయంతోనే పైకి వచ్చారని వివరించారు. సమాజంలోని అసమానతలను తొలగించి.. పేదరికాన్ని నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని పారిశ్రామికవేత్తలను సీఎం కోరారు.

వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు

వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20,000 స్టార్టప్‌లు ఏర్పాటు అయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వీటితో ఒక లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో 10 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు వస్తాయన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుందని, గ్రూప్ లీడరుగా టాటా గ్రూప్ ఉంటుందని వివరించారు. ఎల్ అండ్ టి, ఎఎంఎస్ఎస్ పార్టనర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. అమరావతి హబ్‌కు రాష్ట్రంలో ఐదు స్పోక్స్ అనుబంధంగా ఉంటాయని చెప్పారు. స్పోక్స్ లీడ్ పార్టనర్లుగా అనంతపురానికి జేఎస్‌డబ్ల్యూ, తిరుపతికి అదానీ గ్రూప్, విజయవాడకు మేఘా ఇంజనీరింగ్, రాజమహేంద్రవరానికి గ్రీన్‌కో, విశాఖపట్నానికి జీఎంఆర్ స్పోక్స్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయని తెలిపారు.

చంద్రబాబు ఆలోచనలు ఉన్నతమైనవి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలను పలువురు పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్, జీరో పావర్టీకి పీ4 కార్యక్రమాలు ఎంతో ఉన్నతమైనవని చెప్పారు. వచ్చే ఏడాదికల్లా అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ఏర్పాటు చేసి ఫస్ట్ బ్యాచ్‌కు అడ్మిషన్లు చేపడతామని బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ వి.రామగోపాలరావు చెప్పారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో కూడా తాము భాగస్వాములం కావాలనుకుంటున్నామని వెల్లడించారు. విశాఖలో జీఎంఆర్ ఐటీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఆ సంస్థల అధినేత జీఎంఆర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూప్, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ ఉద్యోగులకు ఉగాది పురస్కారాలు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో వివిధ హోదాల్లోని 61 మంది ఉద్యోగులకు ఆ శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు ఉగాది పురస్కారాలను అందజేశారు. బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కార గ్రహీతలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను డైరెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆకాంక్షల మేరకు స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు కృషి చేయాలని కోరారు.

మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకెళ్లి, ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లా మంచినీళ్లపేటకు చెందిన ధనరాజు, కృష్ణ అనే మత్స్యకారులు సముద్రంలో బోటు తిరగబడి మృతి చెందారు. ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.5 లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్టు మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం తెలిపారు.



అధికారులను విచారిస్తున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

గేట్లు ఒక్కసారిగా ఎందుకు తీశారు?

- ఎవరు చెబితే భక్తులను పార్కులోకి పంపారు?
- 'తొక్కిసలాట' ఘటనలో సస్పెండైన డీఎస్పీపై కమిషన్ ప్రశ్నల వర్షం

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులను బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కులోకి పంపాలని ఎవరు ఆదేశించారు?. ఆ నిర్ణయం టీటీడీదా లేదా పోలీసు శాఖదా? అక్కడ విధుల్లో ఉన్నది మీరేగా.. అప్పుడేం జరిగిందో చెప్పండి' అని 'తొక్కిసలాట' ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్‌ను విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. జనవరి 8న జరిగిన తొక్కిసలాట ఘటనపై కలెక్టరేట్ వేదికగా బుధవారం నాలుగో దశ విచారణ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 'అంతమంది భక్తులు పార్కులో ఉన్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఒక్కసారిగా గేట్లు ఎందుకు తెరిచారు?. తెరవాల్సిన అవసరం ఏమొచ్చింది' అని జస్టిస్ సత్యనారాయణమూర్తి అప్పటి డీఎస్పీని ప్రశ్నించారు. భక్తులను పార్కులోకి అనుమతించింది తాను కాదని ఆయన చెప్పారు. దీంతో టీటీడీ తరఫు లాయర్లు.. ఆనాటి ఘటనకు సంబంధించిన వీడియో చూపిస్తూ.. 'ఇందులో గేటు వద్ద ఉన్నది మీరే కదా?' అని ప్రశ్నించారు. ఓ భక్తురాలు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గేటు తీయాల్సి వచ్చిందని రమణకుమార్ చెప్పారు. సుమారు రెండు గంటలపాటు రమణకుమార్‌ను కమిషన్ విచారించగా, న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఘటనకు సంబంధించిన రికార్డులు ఇవ్వడానికి టీటీడీ గడువు కోరడంతో తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు. ఈ విచారణలో పూర్వపు సీవీఎస్వో శ్రీధర్, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు. బుధవారంతో నాలుగో దశ విచారణ ముగించుకుని కమిషన్ చైర్మన్ సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్లారు.

విషాదాన్ని మిగిల్చిన విహారయాత్ర

తుంగభద్రలో తండ్రి, ఇద్దరు కుమారులు మృతి.. కర్నూలు జిల్లా సుంకేసుల డ్యామ్ వద్ద ఘటన



సులేమాన్



ఫర్హాన్



ఫైజాన్

గూడూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆనందంగా సాగుతున్న విహారయాత్ర ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని విగిల్చింది. కర్నూలు లక్ష్మీనగర్‌కు చెందిన సులేమాన్ రాజ్ విహార్ సమీపంలో ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. భార్య నస్రీనా బేగం శకుంతల కల్యాణ మండపం వద్ద మరో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె సోఫియా, ఇద్దరు కొడుకులు ఫర్హాన్, ఫైజాన్ ఉన్నారు. సోఫియా పదో తరగతి పరీక్షలు రాసింది. పెద్ద కొడుకు ఫర్హాన్ 7వ తరగతి చదవుతుండగా రెండో కుమారుడు ఫైజాన్ 2వ తరగతి చదువుతున్నాడు. రంజాన్ పర్వదినం ముగియడం, కుమార్తె పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో సులేమాన్ (47), నస్రీన్ బేగం పిల్లలతో కలిసి సుంకేసుల డ్యాం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. అప్పటికే డ్యాం వద్ద వీరి బంధువులు కూడా ఉన్నారు. సులేమాన్ తన కుమారులు ఫర్హాన్ (13), ఫైజాన్ (9)తో కలిసి ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. లోతు గమనించకపోవడంతో ముగ్గురూ మునిగిపోయారు. స్థానికులు అప్రమత్తమై వారిని రక్షించేందుకు ప్రయత్నించినా అప్పటికే గల్లంతయ్యారు. గంటపాటు గాలింపు అనంతరం తండ్రీ కుమారుల మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్రం రాజోలి పోలీసులు, కర్నూలు జిల్లా గూడూరు మండల పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాజోలి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఏలేరులో మునిగి నలుగురి మృతి

ఏలేశ్వరం/జగ్గంపేట/పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఏలేరు కాల్వల్లో మునిగి నలుగురు మృతి చెందారు. జగ్గంపేట గ్రామానికి చెందిన దేవర జీవన్‌కుమార్ (19), మెల్లి వీర వెంకట దుర్గ అలియాస్ తరుణ్(19) మిత్రులతో కలిసి బుధవారం ఏలేశ్వరం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఏలేరు కాల్వలో ఈతకు దిగారు. ఈ క్రమంలో జీవన్‌కుమార్, తరుణ్ కాల్వలో మునిగి మృతి చెందారు. కాగా.. పెద్దాపురం మండలం కాండ్రకోటలో నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఈ నెల 1న యానాంకు చెందిన కొప్పాడ సత్తిబాబు, తిరమూడి రాజు కుటుంబాలు వచ్చాయి. దర్శనం అనంతరం సమీపంలోని ఓ తోటలో అందరూ భోజనాలు చేశారు. కొప్పాడ బాలు(20), అతని మేనల్లుడు తిరుమాడి నాగవిశాల్ వర్మ (8) అక్కడ ఏలేరు కాల్వలో స్నానానికి వెళ్లారు. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబీకులు వారి ఆచూకీ కోసం గాలించారు. బుధవారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి.

వైసీపీ కార్యకర్తలను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాం

- ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు
- హైకోర్టుకు నివేదించిన ఎస్‌జీపీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సత్తెనపల్లి పెద్ద సైదా, చింతపల్లి అల్లాభక్షులను పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ బుధవారం హైకోర్టుకు నివేదించారు. మెజిస్ట్రేట్ జ్యుడీషియల్ రిమాండ్ విధించారని, ప్రస్తుతం వారిరువురూ గురజాల సబ్‌జైల్లో ఉన్నారని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం రిమాండ్ ఉత్తర్వులపై ఆరా తీసింది. తదుపరి విచారణలో ఉత్తర్వులను తమ ముందు ఉంచాలని ఎస్‌జీపీ, నిందితుల తరఫు న్యాయవాదిని ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. తన కుమారుడు సత్తెనపల్లి పెద్ద సైదా, తన మేనల్లుడు చింతపల్లి అల్లాభక్షును పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారిని కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ పిన్నెల్లికి చెందిన షేక్ చింతపల్లి నన్నే, గుంటూరు జానీ బాషా వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించా రు. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది రామ్‌లక్ష్మణ్ వాదనలు వినిపిస్తూ.. నిందితుల విషయంలో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించలేదన్నారు. నిందితులను తీవ్రంగా కొట్టారని, ఈ విషయాన్ని బయటకు చెబితే కుటుంబ సభ్యులపై గంజాయి కేసు పెడతామని బెదిరించారని వివరించారు.

అంబటి ఫిర్యాదుపై 4 కేసుల నమోదు

- మరో కేసు నమోదు చేయకపోవడానికి కారణాలున్నాయి
- పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం: హైకోర్టులో ఏజీపీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి రాంబాబు ఇచ్చిన ఐదు ఫిర్యాదులకు సంబంధించి పోలీసులు ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేశారని, మరో కేసు నమోదు చేయకపోవడానికి కారణాలు ఉన్నాయని, వాటిని వివరిస్తూ కౌంటర్ వేస్తామని పోలీసుల తరఫున ఏజీపీ బుధవారం హైకోర్టుకు నివేదించారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. తమ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డితో పాటు తనను, తన కుటుంబ సభ్యుల ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని తానిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ నేత అంబటి రాంబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ రాంబాబు నేరుగా వాదనలు వినిపించారు. తానిచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారని, మరొక ఫిర్యాదులో కూడా బాధ్యులపై కేసు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్–చైనా దౌత్యసంబంధాలకు డెబ్బైఏళ్ళు పూర్తయిన సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఏనుగు–డ్రాగన్ తరహాలో ఇరుదేశాల సంబంధాలు ఎదగాలనీ, బలోపేతం కావాలని అనడమే కాక, శాంతియుతంగా ఉండేందుకు మార్గాలను అన్వేషించుకోవాలని, సంప్రదింపులను, సమన్వయాన్ని పెంచుకోవాలని, కలసి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. రెండుదేశాలూ పురాతన నాగరికతలనీ, అభివృద్ధిచెందుతున్నవనీ, ఆధునికీకరణలో కీలకదశలో ఉన్నాయని ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి కూడా సానుకూల వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్రపతి, ప్రధాని సైతం తమ సందేశాల్లో సత్సంబంధాలను ఆకాంక్షించారు. పరస్పర విశ్వాసాన్ని కలిగించే చర్యలు, నమ్మకమైన నడవడిక సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. భారత్–చైనా బంధం కేవలం ఈ రెండుదేశాల సుస్థిరాభివృద్ధికి మాత్రమే కాక, మిగతా ప్రపంచం క్షేమానికీ, సంక్షేమానికీ అవసరమని ఉభయదేశాల నేతలు ఈ సందేశాల్లో అభిప్రాయపడ్డారు. ఈ డెబ్బైఏళ్ళ సందర్భాన్ని ఒక అవకాశంగా, ఆధారంగా స్వీకరించి, ఉజ్వల భవిష్యత్ నిర్మాణానికి పునరంకితం కావాలని, పరస్పరం సహకరించుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కాస్తంత తేడాలు ఉండవచ్చును కానీ, సందర్భానుసారం ఈ మంచిమాటలు చెప్పుకోవడంలో భారత్–చైనా నాయకులు ఒకరికొకరు తీసిపోలేదు.

చైనా కాన్సుల్ జనరల్ కోల్‌కతాలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత్ ఆర్థికప్రగతిని మెచ్చుకున్న విషయం మీడియా ప్రముఖంగా ప్రస్తావించింది. హిందీ చీనీ భాయ్‌భాయ్ అంటూ ఆయన భారత్ సాధించిన విజయాలను ప్రస్తావించి మెచ్చుకున్నారు. గతంలోనూ చైనా ప్రశంసలు కురిపించడం, ఆ తరువాత పూర్తిభిన్నంగా దుశ్చర్యలకు పాల్పడటం తెలిసిందే. చైనాను నమ్మలేం, ఓ కన్నువేసి ఉంచాల్సిందే అన్న హెచ్చరిక విశ్లేషకుల నుంచి వినిపిస్తూనే ఉంటుంది. ఉభయ-

చైనాతో మైత్రి

దేశాల దౌత్యసంబంధాలకు డెబ్బయ్ ఏళ్లయిన సందర్భంలో 2020 ఏప్రిల్ 1న ఇలాగే అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చైనా అధ్యక్షుడితో శుభాకాంక్షలు పంచుకోవడం, సత్సంబంధాలు కాంక్షించడం, ఉభయులూ సంకల్పాలు చెప్పుకోవడం, ఆ తరువాత, వరుస సరిహద్దు చొరబాట్లు, గాల్వాన్ తరహా ఘాతుకాలతో సంబంధాలు పూర్తిగా అడుగంటిపోవడం తెలిసిందే. ఐదేళ్ళ తరువాత ఇరుదేశాల నాయకులు మళ్ళీ ఈ ఏప్రిల్ 1 సందర్భాన్ని గుర్తుచేసుకోవడం విశేషం. 1950 ఏప్రిల్ 1న కమ్యూనిస్టుపార్టీ నేతృత్వంలోని పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాతో దౌత్యసంబంధాలు నెలకొల్పుకున్న దాదాపు దశాబ్దం వరకూ వ్యవహారం భాయిభాయిగానే ఉంది. కానీ, సరిహద్దులు సరిగ్గాలేని ఈ రెండుదేశాల మధ్యా 1962లో జరిగిన యుద్ధం పరిస్థితులను ఒక్కసారిగా తలకిందులు చేసింది. అనంతరకాలంలో అవిశ్వాసం ఎంత హెచ్చినా, ఏవో కొన్ని ఒప్పందాలో, అవగాహనలో, అవసరాలో కారణంగా దశాబ్దాల పాటు సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నదీ నిజమే. అయితే, ఇటీవలి కాలంలో అమెరికాతో మన సాన్నిహిత్యం ఆయుధాల కొనుగోలు దాటి ఆలింగనాల వరకూ హెచ్చడంతో సరిహద్దుల్లో చైనా చొరబడటమూ, అడపాదడపా మనలను కవ్వించడమూ పెరిగింది. ఎవరి ఏలుబడిలో చైనా మన భూభాగాన్ని ఎక్కువగా దురాక్రమించిందన్న విమర్శలనూ, వాదోపవాదాలను రాజకీయపక్షాలకు వదిలేస్తే, మొన్నటివరకూ ఉన్న ఉద్రిక్తపరిస్థితి ఇప్పుడు కాస్తంత కరిగి గాడినపడుతున్న వాతావరణమైతే కనిపిస్తోంది.


భారత్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని, వాణిజ్యం పెంచుకుంటామని, అన్ని రంగాల్లో సహకరిస్తామని చైనా దౌత్యప్రతినిధులు ప్రస్తుత సందర్భంలో హామీలు కురిపిస్తున్నారు. భారతీయ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. ఈ అమిత ప్రేమ వెనుక ట్రంప్ టారిఫ్ కత్తి ప్రధానంగా పనిచేస్తుండవచ్చు. సుంకాల ప్రతీకారాలు ఉధృతమవుతున్న తరుణంలో ఇలా కొన్ని మంచి మాటలు వినబడటం సహజం. చైనా విషయంలో ట్రంప్ వాణిజ్యయుద్ధానికి మాత్రమే పరిమితం కాబోరనీ, యూరప్‌తో తెగదెంపులు చేసుకొని, రష్యాతో చేయికలిపి, చైనాను ఢీకొట్టేందుకు ఆయన వేగంగా అడుగులువేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. చైనా దూకుడుకు కళ్ళెం వేయడానికి ఈ ప్రాంతంలో అమెరికా పక్షాన వ్యవహరించాల్సి వచ్చినప్పటికీ, ట్రంప్‌ను పూర్తిగా నమ్మి, చైనాతో సంబంధాలు సమూలంగా నాశనం చేసుకోవాల్సిన అవసరమైతే లేదు. పరిస్థితులు కాస్తంత గాడినపడుతున్న తరుణంలో

ఎన్‌జేఏసీ పునరుద్ధరణ డిమాండ్ సరైనదేనా?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల సంచులు బయటపడడంతో న్యాయవ్యవస్థ భ్రష్టుపట్టిపోతున్నదనే ఆందోళన అంతటా వ్యక్తమైంది. ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు నియమించిన ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ పరిణామాన్ని ఆసరా చేసుకుని ఉన్నత న్యాయమూర్తుల నియామకాలపై పార్లమెంటు నెలకొల్పిన ఎన్‌జేఏసీ జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను 2015లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయకుండా ఉంటే బాగుండేదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈయన, అప్పటి న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు కలిసి కొలీజియం పైన, న్యాయమూర్తుల నియామకాల్లో సుప్రీంకోర్టు పెత్తనం మీద తరచూ విరుచుకుపడుతూ ఉండేవారు. అందులో గౌరవహీన పదజాలాన్ని కూడా ఉపయోగించేవారు. కొందరు రిటైర్డ్ జడ్జీలు ఇండియా వ్యతిరేక గ్యాంగ్‌గా కూడి భారత న్యాయవ్యవస్థ ప్రతిపక్షంగా వ్యవహరించేలా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా రిజిజు అన్నారు. కేంద్రన్యాయ శాఖ మంత్రి ఒకరు న్యాయవ్యవస్థ మీదకు ఇంతటి సూది మొన రాయిని విసరడం ఎప్పుడూ చూడలేదు. న్యాయవ్యవస్థపై రిజిజు ప్రేలాపనలు జుగుప్సాకరంగా ఉండడంతో ఆయనను ఆ శాఖ నుంచి తప్పించారు. జగదీప్ ధన్‌ఖడ్ అయితే వీలైనప్పుడల్లా న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటు ఉన్నతమైనదని అంటూ, పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఎన్‌జేఏసీని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయడాన్ని ఇప్పటికీ తప్పుపడుతున్నారు.

ఎన్‌జేఏసీ బిల్లుకు 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటు ఆమోదం పొందింది. రాజ్యాంగంలో 124ఎ(3) అనే కొత్త సెక్షన్ చేర్చడం ద్వారా ఈ బిల్లును పార్లమెంటు చట్టంగా చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కూడా ఉండే ఆరుగురు సభ్యుల కమిటీని ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం ఈ చట్టం అవతరించింది. అయితే ఇద్దరు బయటి ప్రముఖులను కూడా ఈ కమిటీలో చేర్చడం వివాదాస్పదమయింది. న్యాయమూర్తుల నియామకంలో న్యాయ వ్యవస్థ పాత్రను నామమాత్రం చేస్తున్నదనే కారణంపై ఎన్‌జేఏసీ చట్టాన్ని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీం కోర్టు ధర్మాసనం 4:1 మెజారిటీ తీర్పుతో 2015 అక్టోబర్ 6న రద్దు చేసింది.

రాష్ట్రపతి సీజేఐని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించాలని రాజ్యాంగ అధికరణ 124(2) స్పష్టం చేస్తున్నది. ఎన్‌జేఏసీలో ఇందుకు బొత్తిగా సందు లేకుండా చేశారు. సీజేఐని సంప్రదించడమంటే కేవలం వారికి తెలియజేయడం కాదని, వారి సమ్మతిని తీసుకోవడం కిందికి వస్తుందనే నిర్వచనం వెల్లడయింది. జస్టిస్ వర్మ ఇంటిలో నోట్ల కట్టల ఉదంతాన్ని సాకుగా చేసుకొని



> నోట్ల కట్టల ఘటనపై రాజ్యసభలోని వివిధ పార్టీల సభా నేతలతో సమావేశానికి ముందే జగదీప్ ధన్‌ఖడ్ ఎన్‌జేఏసీ ప్రస్తావన చేయడం ఆయన బీజేపీ పక్షపాతాన్నే చాటింది. కొలీజియంలో లోపాలు ఉన్నమాట వాస్తవం. అందుచేత పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన ఎన్‌జేఏసీ గొప్పదనడం విజ్ఞతాయుతం కానే కాదు.

వెనువెంటనే ఉపరాష్ట్రపతి ఎన్‌జేఏసీ ప్రస్తావన తేవడం సమంజసంగా లేదు. నోట్ల కట్టల ఘటనపై రాజ్యసభలోని వివిధ పార్టీల సభా నేతలతో సమావేశానికి ముందే ధన్‌ఖడ్ ఎన్‌జేఏసీ ప్రస్తావన చేయడం ఆయన బీజేపీ పక్షపాతాన్నే చాటింది. అరుదుగా ఏ స్థాయిలోని వ్యక్తి అయినా అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడే అవకాశం లేకపోలేదు. దేశంలో ఇటువంటివి మామూలు అయిపోలేదు గాని ప్రముఖులను అప్రతిష్ఠపాలు చేసిన ఘటనలు జరగకపోలేదు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1971 మే లో ఆమె, ఆమె సెక్రటరీ పి.ఎన్. హక్సర్ స్వయంగా ఫోన్లో ఆదేశించారనుకుని ఢిల్లీ పార్లమెంటు ది స్టేట్ బ్యాంకు చీఫ్ క్యాషియర్ వి.పి. మల్హోత్రా బ్యాంకు నగదు నుంచి 60 లక్షల రూపాయల కట్టలు తీసి రుస్తుం సోహ్రాబ్ నగర్వాలా అనే ఆయనకు ఇచ్చాడు. ఆ మొత్తానికి చెక్కు కోసం ప్రధాని ఇంటికి వెళ్లి ఆయన భంగపడడం, పోలీసులు దర్యాప్తు చేసి నగర్వాలా నుంచి 6 వేల రూపాయలు మినహా మిగతా బ్యాంకు సొమ్మును వసూలు చేయడం సంచలనం సృష్టించింది,

ప్రధాని మోదీ స్వయంగా ఆదానీ వాణిజ్య ప్రయోజనాలకు తోడ్పడుతూ ఆయనకు ఉక్కు కవచంలా ఉపయోగపడుతున్నారనే విమర్శ తెలిసిందే. దీనిలోని నిజానిజాలను ఆయన పార్లమెంటుకు తెలియజేయాలన్న డిమాండు నిష్ఫలం అయిపోయిన సంగతీ ఎరుకే. కింది స్థాయి న్యాయ వ్యవస్థలో ఒకటీ అరా అప్రతిష్ఠాకర ఘటనలు చోటుచేసున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బెయిల్ మంజూరుకు లంచం తీసుకుని నగుబాటై ఆత్మహత్యకు పాల్పడిన మేజిస్ట్రేట్ ఉదంతం జ్ఞాపకాల తెర మీదినుంచి ఇంకా తొలగిపోలేదు. అతిజుగుప్సాకరమైన గుజరాత్ మారణహోమ దోషులను ఆ రాష్ట్ర ప్రభుత్వమే ముందస్తుగా విడుదల చేయడం, వారికి బయట బ్రహ్మాండమైన స్వాగతం లభించడం తెలిసిందే.

వ్యక్తులు సమష్టి మేలు కోసం ఏర్పరచుకున్నవే వ్యవస్థలు. అందులోని మెజారిటీ సభ్యులు గాని, వాటి నిష్పాక్షికతను కాపాడవలసిన వాటి పాలకులు గాని స్వార్థం కోసం వాటిని బలి తీసుకోనంతకాలం అవి వాటి విధిని సవ్యంగా నిర్వర్తిస్తూనే ఉంటాయి. ఆందోళన చెందవలసిన పని లేదు. దేశ రాజ్యాంగం పైన బొత్తిగా గౌరవం లేని కాషాయ పాలకుల హయాంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన స్వతంత్ర సంస్థల వెన్నెముకలు విరిగిపోయాయన్న అభిప్రాయం గట్టిపడింది. ముఖ్య నిర్ణయాలు తీసుకునే పదవుల్లోనివారు రిటైర్ అయిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే నజరానాలకు ఆశపడకుండా ఉండడం ఒకప్పటి నీతిగా ఉండేది. ఇప్పుడా నీతి ఊరూ పేరూ లేకుండా కొట్టుకుపోయింది.

ఇక్కడ ఒక తాజా వార్తను ప్రస్తావించుకోవాలి. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలతో సహా ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేకమంది మీద మనీ లాండరింగ్ వ్యతిరేక కేసులు బిగించి వేధించిన చరిత్ర కలిగి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన సంజయ్ కుమార్ మిశ్రా (65)ను ప్రభుత్వ కార్యదర్శి హోదాలో ప్రధాని ఆర్థిక సలహా మండలి పూర్తికాల సభ్యునిగా ఇటీవలే నియమించారు. ఈడీగా ఈయన పదవీ కాలాన్ని అనేకసార్లు పొడిగించారు. 2018లో పదవీస్వీకారం చేసిన మిశ్రా పదవీ కాలాన్ని అదే పనిగా పొడిగిస్తూ పోవడాన్ని ప్రతిపక్షాలు సవాలు చేస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పదవీ కాలాన్ని ఇంకా పొడిగించడానికి సుప్రీంకోర్టు అనుమతించకపోవడంతో 2023 సెప్టెంబర్‌లో మిశ్రా ఆ పదవి నుంచి తప్పుకోక తప్పలేదు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని లేకుండా చేసి కేంద్ర ఎన్నికల సంఘం చేత మోదీ ప్రభుత్వం ఊడిగం చేయించుకుంటున్నదనే విమర్శ తెలిసిందే. అత్యంత ముఖ్యమైన అయోధ్య వివాదం విచారణకు, రాఫెల్ యుద్ధ విమానాల కేసుకు సారథ్యం వహించి తీర్పులు ప్రకటించిన సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యులయ్యారు. రంజన్ లైంగికంగా వేధించారని సుప్రీంకోర్టులో పని చేసిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన కేసు విచారణను తిన్నగా నడవనీయకుండా చేసి గొగోయ్ అందులో నుంచి బయటపడ్డారని అనుకున్నారు.

ఇటువంటి ఉదంతాలను ప్రస్తావించి జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల ఉదంతాన్ని చిన్నదిగా చేసి చూపడం, అటువంటివి మామూలే అనిపించేలా చేయడం ఈ వ్యాసకర్త ఉద్దేశం ఎంత మాత్రం కాదు. కొలీజియంలో లోపాలు ఉన్నమాట వాస్తవం. అందుచేత పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన ఎన్‌జేఏసీ గొప్పదనడం విజ్ఞతాయుతం కానే కాదు. ఎన్‌జేఏసీ ద్వారా కేంద్రంలోని బీజేపీ పాలకులు తమకు విధేయులైన, హిందుత్వ, ఆర్ఎస్ఎస్ అనుకూలురైన వారిని న్యాయమూర్తులుగా నియమింప జేసుకోవాలని సంకల్పించారు. న్యాయవ్యవస్థ విషయంలో రాజ్యాంగం, దాని మౌలిక స్వరూపం మీద తమకు గల సమగ్ర అవహగాహన వల్ల కొలీజియం విధానమే ఉత్తమమైందని సుప్రీంకోర్టు భావిస్తున్నది. ఎన్‌జేఏసీ రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాలరాస్తుందని భావించింది. ఇండియాలో పౌర సమాజం పరిణత స్థాయికి చేరుకోనందున న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ఇతర ప్రభుత్వ అంగాల జోక్యానికి అతీతంగా ఉంచడం ద్వారా మాత్రమే దేశ పౌరుల హక్కులను కాపాడగలమని ఎన్‌జేఏసీపై విచారణ జరిపి రాజ్యాంగం 99వ సవరణను కొట్టివేసిన అయిదుగురు జడ్జీల ధర్మాసనానికి అధ్యక్షత వహించిన జస్టిస్ కేహార్ అభిప్రాయపడ్డారు.

జడ్జీలే జడ్జీలను నియమించే కొలీజియం విధానం కూడా లోపరహితమైనది కాదని ధర్మాసనం చేసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గమనించాలి. అందుచేత న్యాయ నియామకాల విధానాన్ని మెరుగుపరచవలసిన అవసరం ఉందని కూడా ఈ ధర్మాసనం తేల్చి చెప్పింది. న్యాయవ్యవస్థ, ప్రభుత్వం కలిసి కూర్చుని రాజ్యాంగ మౌలికతకు, దాని పరిపూర్ణ స్ఫూర్తికి అనుగుణమైన కొత్త వ్యవస్థను నెలకొల్పుకోవాల్సిన గట్టి అవసరం ఉంది. సంకుచితమైన స్వార్థ దృష్టికి అతీతంగా ఈ పని జరగాలి.

■ గార శ్రీరామమూర్తి

ఎదురీది గెలిచిన విజేత

ఈ దేశంలో బహుజనులకు జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఏ రంగంలోనైనా ఎదురీత తప్పదు. అలాంటి ఎన్నో అడ్డంకులను ఎదురీది గెలిచిన విజేత ఆచార్య తుమ్మల రామకృష్ణ. వెనుకబడిన కులాల్లో మరింత వెనుకబడిన మంగలి కులంలో పుట్టిన ఆణిముత్యం. జీవితంలో ఊహించడానికి కూడా సాధ్యపడని ఎన్నో మైలురాళ్లను అవలీలగా సాధించి చూపిన ధీశాలి. కథా రచయితగా, సాహితీవేత్తగా, ఆచార్యుడిగా అసామాన్యమైన పాత్రను పోషించారు. భారతీయ సామాజిక స్వరూపం తెలిసిన రచయితగా సాహిత్యంలో అస్తిత్వ పరివేదనను వినిపించాడు.

రాయలసీమలోని చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామంలో జన్మించారు తుమ్మల. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న నాదస్వర కళను తన కుటుంబం కూడా అందిపుచ్చుకుంది. దానిని కాదనుకొని తుమ్మల మాత్రం చదువుల బాట పట్టి, చదువే లోకంగా ఎదిగి వచ్చారు. 1988లో వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య జి.ఎస్.రెడ్డి పర్యవేక్షణలో 'తెలుగులో హాస్య నవలలు' అంశంపై పీహెచ్‌డీ పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1989లో కర్నూలు పీజీ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టారు. సాధారణంగా అట్టడుగు సమూహాల నుండి వచ్చిన వారిలో ఎక్కువమంది ఒక భద్రజీవితం లభించాక మూలాలను మరిచిపోతారు. తుమ్మల అలా కాదు. అందుకు ఆయన జీవితాచరణే సాక్ష్యం. రాప్తాడు గోపాలకృష్ణ, శ్రీనివాసమూర్తితో కలిసి 'పల్లెమంగలి కథలు', 'ఫ్యాక్షన్ కథలు' వెలువరించారు. అప్పట్లో ఈ పల్లెమంగలి కథలు పెను సంచలనాన్నే రేపాయి. రాయలసీమ ప్రాంతం నుంచి కులవృత్తికి సంబంధించిన తొలి కథా సంపుటిగా పల్లెమంగలి కథలు నిలిచిపోయాయి.

నివాళి



> తుమ్మల రామకృష్ణకు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని నిలబడే ధైర్యం తన నేపథ్యమే నేర్పింది. సామాజికంగా ఆయన అనేక అగ్రవర్ణ కుల అహంకారాలను దాటుకొని వచ్చారు. తనను తక్కువ చూపు చూసిన సమాజం చేత శెభాష్ అనిపించుకునే స్థాయికి ఎదిగారు. జీవితపు ప్రతీ మలుపులోను ఆటుపోట్లను తట్టుకొని నిలబడ్డారు.

తాను రాసిన పలు కథల్ని 'మట్టి పొయ్యి కథలు'గా ప్రచురించారు తుమ్మల. గ్లోబలైజేషన్ విధ్వంసం వల్ల పల్లెల్లో వచ్చిన మార్పులు, మనుషుల సంఘర్షణనే ఈ కథలకు ఇతివృత్తం. మరోవైపు కర్నూలు కేంద్రంగా 'కథా సమయం' వంటి వేదికలు నిర్వహిస్తూ నిరంతరం సాహితీ చర్చలు కొనసాగించారు. తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న అనేకమంది రచనలను లోతుగా అధ్యయనం చేశారు తుమ్మల. రష్యన్ కథా రచయితల రచనలనూ విస్తృతంగా చదివారు. ముఖ్యంగా వచన కవిత్వం, వచన రచనల పట్ల ఆయనకు అమితమైన అభిమానం. తన ఉపన్యాసాల్లో గురజాడ, చాసో, కొడవటిగంటి కుటుంబరావు, చలం, కేతు విశ్వనాథరెడ్డి, కొలకలూరి ఇనాక్, అల్లం రాజయ్య, బీఎస్ రాములు వంటి రచయితల రచనలను అలవోకగా ప్రస్తావించేవారు. తోటి రచయితలతో గాఢమైన స్నేహానుబంధాన్ని పెంపొందించుకునేవారు. అందుకే, యావత్ తెలుగు నేలమీద తుమ్మలకు ఎందరో సాహితీ ఆత్మీయులు అనతికాలంలోనే ఏర్పడ్డారు. అట్లా ఆయన కర్నూలు సాహితీ మిత్రులతో కలిసి 'కథా సమయం', 'హైంద్రావతి కథలు' కూడా ప్రచురించారు. ఆ తరువాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఆచార్యుడిగా వచ్చారు.

తెలుగు శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే రచనా వ్యాసాంగాన్ని కొనసాగించారు. ముఖ్యంగా శాఖాధ్యక్షుడిగా ఉన్న కాలంలో 'పరిచయం', 'బహుముఖం', 'అభిముఖం', 'అవగాహన' వంటి విలువైన సాహిత్య సంకలనాలను తీసుకొచ్చారు. ఇక రచయితగా చాలా విరామం తరువాత 'తెల్లకాకులు' కథను రచించారు. దీనిపై పదుల సంఖ్యలో స్పందనలు, సమీక్షలు వెలువడ్డాయి. వాటిని 'ఎక్కడివి తెల్లకాకులు?' పేరుతో ఆయన విద్యార్థులు పుస్తకంగా సంకలనం చేశారు. ఆచార్య తుమ్మల వద్ద యాభైమందికి పైగా విద్యార్థులు పరిశోధనలు చేశారు. అందులో 20మంది పీహెచ్‌డీ పరిశోధకులు, మరో 34మంది ఎంఫిల్ స్కాలర్లు ఉన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ధిక్కార గొంతుకల్ని వినిపించిన అస్తిత్వవాదాలపై ఆచార్య తుమ్మల విలువైన పరిశోధనలు చేయించారు. ఇక వృత్తికథలపై మరోసారి 'అడపం', 'రేవు' వంటి చారిత్రిక కథా సంకలనాలను వెలువరించారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలకు పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా సేవలను అందించారు. తరగతి వెలుపల సైతం ఒక మంచి టీచర్‌గా జీవించారు. పాఠం ప్రిపేర్ కాకుండా ఏనాడు ఆయన క్లాస్‌కు వచ్చిందే లేదు. హాస్యచతురతతో విద్యార్థులతో స్నేహంగా మెలగడం ఆయనలోని మరో మంచి లక్షణం. తరువాత తాను పుట్టిన చిత్తూరు జిల్లాలోని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ఎంపికయ్యారు. ఇట్లా ఆయన అకడమిక్స్‌లో అత్యున్నత పదవిని అందిపుచ్చుకోవడం వెనకాల ఆయన మహాసంకల్పమే కారణం.

కర్నూలు నుండి సెంట్రల్ యూనివర్సిటీకి మారే క్రమంలో రోడ్డు ప్రమాదంలో సహచరిని కోల్పోయినప్పుడు ఆయన ఎంతో మానసిక సంఘర్షణ ఎదుర్కొన్నారు. తుమ్మలకు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని నిలబడే ధైర్యం తన నేపథ్యమే నేర్పింది. సామాజికంగా ఆయన అనేక అగ్రవర్ణ కుల అహంకారాలను దాటుకొని వచ్చారు. తనను తక్కువ చూపు చూసిన సమాజం చేత శెభాష్ అనిపించుకునే స్థాయికి ఎదిగి చూపించారు. జీవితపు ప్రతీ మలుపులోను ఆటుపోట్లను తట్టుకొని సార్థక జీవితాన్ని జీవించి చూపించారు.

రైతు వ్యతిరేక విధానాలను వీడని కేంద్రం

రైతు వ్యతిరేకత, కార్పొరేట్లకు దాసోహం అనే విధానాలను కేంద్ర ప్రభుత్వం వదులుకోలేదు. గతంలో ప్రధాని మోదీ తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా 383 రోజులు సాగిన ఆందోళనలకు తలొగ్గి వాటిని ఉపసంహరించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 2024లో నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్; నేషనల్ కో ఆపరేటివ్ పాలసీ; డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్‌ల పేర్లతో మూడు పథకాలను తెచ్చింది. నాటి రైతు వ్యతిరేక నల్లచట్టాలకు ప్రతి రూపమే ఈ పథకాలు. భారత వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించేందుకు, మార్కెట్ సదుపాయాలను విస్తరించేందుకు, డిజిటలైజేషన్ ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చేందుకనే అందమైన మాటలు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో ఇవి రైతుల బతుకును చిన్నాభిన్నం చేస్తాయనే విమర్శలున్నాయి.

ఈ పాలసీలు రైతుల కంటే కార్పొరేట్ సంస్థలకు ఎక్కువ ప్రయోజనం కలిగిస్తాయి. ప్రభుత్వ మార్కెట్ యార్డులను బలహీనపరచడం, ప్రైవేట్ సంస్థలకు మరింత అధికారం కల్పించడం వల్ల కార్పొరేట్లకు అవకాశాలు పెరిగి, చిన్న రైతులు తక్కువ ధరలకు తమ ఉత్పత్తులు విక్రయించాల్సిన పరిస్థితి వస్తుంది. అలాగే సహకార సంఘాలపై కేంద్ర ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని పెంచుతోంది. కార్పొరేట్ సంస్థలు సహకార సంఘాల్లో 20శాతం వాటాను పొందడమే కాకుండా, అదే స్థాయిలో ఓటింగ్ హక్కును కూడా సాధించగలవు. ఇది రైతుల స్వయం నిర్ణయాధికారాన్ని దెబ్బతీసేలా ఉంది. ఇకపోతే డిజిటల్ వ్యవసాయ మిషన్ వల్ల రైతుల వ్యక్తిగత డేటా ప్రైవేట్ కంపెనీల చేతికి వెళ్లే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు వెనుకబడిపోతారు. గ్రామాల్లో తగినంత ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం కూడా మరో సమస్య.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రం రూ.16లక్షల కోట్లకు పైగా బకాయిలు రద్దు చేసింది. మరో పక్క రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల స్థానంలో తెచ్చే పథకాలు రైతుల పాలిట శాపంగా మారనున్నాయి. ఇవి చట్టరూపం దాల్చకముందే రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని అన్ని రైతు సంఘాలు కలిసివున్న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. అఖిల భారత కిసాన్‌సభ జాతీయ మహాసభలు ఏప్రిల్ 15, 16, 17 తేదీలలో తమిళనాడులోని నాగపట్నంలో జరుగుతున్నాయి. ఈ ప్రమాదకర చట్టాల పట్ల రైతులను చైతన్యపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజయవాడలో ఏప్రిల్ మూడున, కర్నూల్లో నాలుగున, ఎనిమిదవ తేదీన అనంతపురంలోనూ సదస్సులు జరపనుంది. కేంద్రం తెచ్చిన ఈ విధానాలవల్ల సరైన భద్రత, న్యాయమైన ధరలు, స్వేచ్ఛ లేకుండా రైతులు వ్యవసాయ రంగంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ చట్టాలు రైతులకు మేలు కలిగించేలా మారాలంటే, ప్రభుత్వం నేరుగా రైతులను పరిరక్షించే చర్యలు తీసుకోవాలి.

– -కాగితాల రాజశేఖర్

(నేడు విజయవాడలో రైతు సదస్సు)

జమిలి ఎన్నికలు.. గొప్ప సంస్కరణ

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు) దేశ చరిత్రలో వినూత్న మార్పులు తీసుకురానున్నది. దీనివల్ల పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. దాంతో ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వ సిబ్బందికి శ్రమ తగ్గుతుంది. ప్రజలకు ఇబ్బందులు దూరం అవుతాయి. ఇవన్నీ దేశానికి ఒనగూడే ప్రయోజనాలే. దేశ రాజకీయాలే కాదు అభివృద్ధి దిశగా కూడా జరిగే గొప్ప సంస్కరణ ఇది. జమిలి ఎన్నికల ప్రతిపాదన వచ్చినప్పటి నుంచి దేశంలో పెద్ద చర్చ జరుగుతూనే ఉంది. అభివృద్ధిని కాంక్షించేవారంతా దీనిని స్వాగతిస్తుండగా, విపక్షాలు మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. కుల, మత, ప్రాంతీయ, వేర్పాటువాదాలను ప్రేరేపించి ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలుస్తున్న పార్టీలకు జమిలి ఎన్నికల గురించి ఆందోళన ప్రారంభమైంది. ఎన్నికల్లో అభివృద్ధి, సుస్థిర, పారదర్శక పాలన అందించే పార్టీలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆందోళన చెందాల్సిన పనిలేదు.

> ఏకకాల ఎన్నికలు సరైన కాలంలో సరైన చర్య. అయితే అదే సమయంలో మన దేశంలో ప్రజాస్వామ్యం నాణ్యతను మెరుగుపరచడానికి ఇతర కీలకమైన రాజకీయ సంస్కరణలు కూడా అవసరం.

ఒకప్పుడు ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధిగా, తమ తరఫున వాదించేవారుగా చూసేవారు. కానీ ఇప్పుడు ప్రజలు వారిని దళారులుగా చూస్తున్నారు. కారణం వారు దళారీ పనులు చేయడం, లేదా వ్యక్తిగత లాభాల కోసం పనిచేయడం. ఇలాంటి వారికి రాజకీయాల్లో అవకాశాలు కల్పించేవి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రాజకీయ పార్టీలు. ఇవి అసంఘటిత స్వభావం, పారదర్శకతా లోపం, సైద్ధాంతిక పునాదులు లేకుండా కేవలం డబ్బు, పదవుల కోసం రాజకీయం చేస్తున్నాయి. పైగా అన్నిటికంటే ముఖ్యంగా పార్టీలలో కుటుంబాల ప్రాబల్యం తీవ్ర అవినీతికి దారితీస్తోంది. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ ఈ కోవలోకి పోగా, ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన తృణమూల్, వైసీపీ వంటి ప్రాంతీయ పార్టీలు అవినీతికి కొత్త అర్థం చెప్పాయి. అయితే ఈ దుర్మార్గాన్ని రూపుమాపే అవకాశం ఆదర్శపాలన కోరే ఓటర్లకు జమిలి ఎన్నికలతో రానున్నది.

ప్రస్తుత పరిస్థితి కొనసాగితేనే తమకు ప్రయోజనకరమని అనేక ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నందున అవి రాజకీయ సంస్కరణలను వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే పలు పాలనా సంస్కరణలతో బీజేపీ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకుంది. పేదలకు జీరో ఖాతాలు తెరిపించి సంక్షేమ పథకాల్లో భాగంగా వాటిలోకి నగదు బదిలీ నేరుగా చేపట్టడం పలు రాజకీయ పార్టీలకు మింగుడుపడలేదు. అందువల్లే ఈ పార్టీలు మోదీ ప్రభుత్వం చేసే సంస్కరణలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయినా పార్టీలు అనుసరించే విధాన లోపాలను ఎత్తి చూపడానికి, రాజకీయ సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి 'ఒకే దేశం–ఒకే ఎన్నికల' బిల్లు అవకాశం కల్పిస్తుంది.

ఎన్నికల సంస్కరణపై ప్రధాని మోదీ చూపిన చొరవ.. ఒకే దేశం–ఒకే ఎన్నికలు విధానానికి దారితీసింది. దీని సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి 2023 సెప్టెంబర్ 2న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. 191 రోజులపాటు విస్తృతంగా రాజకీయ



పార్టీలు, న్యాయ నిపుణులు నిపుణులతో సంప్రదింపులు జరిపిన ఈ కమిటీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదికను సమర్పించింది. కోవింద్ ప్యానెల్ చేసిన సిఫారసులకు కేంద్ర మంత్రివర్గం 2024, సెప్టెంబర్ 18న ఆమోదం తెలిపింది. జమిలి ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే.. 2024, 2028 మధ్య ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వాల కాలవ్యవధి 2029 లోక్‌సభ ఎన్నికల వరకు ఉంటుంది. ఆ తర్వాత లోక్‌సభతోపాటు అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టగా, ఈ బిల్లుకు సంబంధించి రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను జేపీసీకి పంపించాలని లోక్‌సభ నిర్ణయించింది. గరిష్ఠంగా 39 మందితో సంయుక్త పార్లమెంటరీ కమిటీని రూపొందించారు.

జమిలితో ఎన్నికల వ్యయం తగ్గుతుంది; తరచూ ఎన్నికలతో పథకాల అమలు నిలిచిపోతుంది. ప్రభుత్వం దృష్టి అభివృద్ధి కార్యక్రమాల నుంచి ఎన్నికల ప్రచారం పైకి మళ్లుతుంది. జమిలితో ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించవచ్చు; తరచూ ఎన్నికల వేళ రాజకీయ నాయకుల మధ్య అధిక పోటీ, ప్రతిస్పందనల వల్ల ప్రజాస్వామ్యానికి చేటు కలుగుతోంది. ఈ పరిస్థితిని నివారించవచ్చు; ఎన్నికల నిర్వహణలో లక్షలాది ప్రభుత్వ సిబ్బంది, భద్రతా దళాలు పాల్గొంటాయి. తరచూ జరిగే ఎన్నికలు వీరిపై ఒత్తిడిని పెంచుతాయి. జమిలితో ఈ ఒత్తిడి కొంత తగ్గుతుంది; ప్రజలు అనేక ఎన్నికల కారణంగా తరచూ ఓటింగ్ కేంద్రాలకు వెళ్ళవలసి ఉంటుంది. జమిలి ప్రజలకు సౌలభ్యం కలిగిస్తుంది.

ఏకకాల ఎన్నికలు సరైన సమయంలో తీసుకున్న సరైన చర్య అయితే అదే సమయంలో మన దేశంలో ప్రజాస్వామ్యం నాణ్యతను మెరుగుపరచడానికి ఇతర కీలకమైన రాజకీయ సంస్కరణలు కూడా అవసరం. దేశంలోని పార్టీల కార్యకలాపాలను నిర్దేశించడానికి, వాటిలో క్రమశిక్షణను ప్రవేశపెట్టడానికి, వాటి కార్యకలాపాలను మరింత పారదర్శకంగా, జవాబుదారీగా చేయడానికి ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలి. రాజకీయ పార్టీలలో కుటుంబ సభ్యులు లేదా రక్తసంబంధీకులు నిర్వహణ బృందంలో సభ్యులుగా ఉండరాదు. దేశంలో చాలావరకు అస్తిత్వంలో లేని, లేదా కేవలం నామమాత్రంగా కొనసాగుతున్న పార్టీలున్నాయి. ఎన్నికల సమయంలో ఇవి పొత్తులు పెట్టుకుని గెలుస్తున్నాయి. ఇలా చిత్తశుద్ధి లేని రాజకీయ పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకు రాకుండా కట్టుదిట్టం చేయాలి. ప్రతి రాజకీయ పార్టీ తమ కార్యకలాపాలపై వార్షిక నివేదికను ప్రచురించాలి. ఏడాది కాలంలో తాము చేసిన పనులను, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ ప్రజాప్రతినిధులు ఒక నివేదికను తప్పనిసరిగా సమర్పించాలి. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలను ఎంత మేరకు అమలు చేశాయో వివరించే నివేదికను తప్పనిసరిగా విడుదల చేయాలి. ఓడిపోయిన పార్టీలు కూడా తాము చేసిన ఎన్నికల వాగ్దానాల అమలుకు ఏమేమి ప్రణాళికలు రూపొందించిందీ తెలియజేయాలి. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తన నియోజకవర్గానికి సంబంధించి ఒక ఎన్నికల ప్రణాళికను, అలాగే దాని అమలుకు తీసుకున్న చర్యలపై ఒక వార్షిక నివేదికను తప్పనిసరిగా విడుదల చేయాలి. రాజకీయ సంస్కరణల విస్తృతిని చర్చించేటప్పుడు ప్రజాప్రతినిధులు సభల్లో పనిచేసే తీరును గురించి కూడా చర్చించాలి.

ఏదేమైనా ఒకే దేశం–ఒకే ఎన్నిక దేశాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆర్థిక, రాజ్యాంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో ఒక ఆదర్శ ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తోంది. జమిలి అమలైతే భారతదేశం ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.

◆ వల్లూరు జయప్రకాష్ నారాయణ

కనీస నిల్వ చార్జీలు తీసెయ్యాలి

బ్యాంకులను జాతీయం చేస్తే ప్రజల కోసం పనిచేస్తాయని, ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం వాటిని జాతీయం చేసింది. అప్పుడు ప్రజలందరూ ఆహ్వానించారు. సేవింగ్స్ అకౌంట్‌లో ఉన్న నగదుకు ఆ రోజుల్లో సంవత్సరానికి ఐదో పదో వడ్డీ కింద జమ అయ్యేది. ఇప్పుడు వడ్డీ కింద వచ్చే మొత్తం కన్నా వివిధ రకాల చార్జీల పేరుతో బ్యాంకులు తీసుకునే మొత్తం అధికంగా ఉంటోంది. నగదు తీయాలన్నా వేయాలన్నా కూడా చార్జీలు వేస్తున్నారు. అన్నిటికీ యంత్రాలు పెట్టేశారు. ఏదన్నా అడిగినా బ్యాంకు సిబ్బంది సరిగా సమాధానం కూడా ఇవ్వడం లేదు. ఇప్పుడు ఖాతాలో కనీస నిల్వ ఐదు వేల రూపాయలు ఉండాలంటున్నారు. లేకపోతే జరిమానా వేస్తారట. ఇది అన్ని రకాలుగా ప్రజలని ఇబ్బందులకు గురి చేస్తున్నది. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నది. అలాగే బ్యాంకులను కూడా ప్రైవేటుపరం చేసే విధంగా వ్యవహరిస్తోంది. ప్రజల డబ్బును బ్యాంకుల వాళ్ళు సేవింగ్స్ రూపంలో తీసుకుని ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీ ఇచ్చి, అధిక వడ్డీలకి పెట్టుబడిదారులకు ఇస్తున్నారు. బ్యాంకు వాళ్ల ప్రజల సొమ్ము మీద మనుగడ సాగిస్తున్నారు. కాబట్టి కనీస నిల్వ లేకపోతే చార్జీలు విధించడాన్ని బ్యాంకులు మానుకోవాలి.

గత వైసీపీ పాలనలో ఒక్క విజయవాడ రూరల్ మండలంలోనే రూ.2 వేల కోట్ల భూ దోపిడీ జరిగిందని విమర్శలు వచ్చాయి. కొండలు, దిబ్బలు, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరిగింది. వైసీపీ నాయకులు నందిగం సురేష్, అంబటి రాంబాబు, వల్లభనేని వంశీ అనుచరులమంటూ కొందరు రెచ్చిపోయారు. అటవీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలను గుప్పెట్లో పెట్టుకుని హద్దు అదుపు లేకుండా అక్రమాలకు తెగబడ్డారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చర్యలకు ఆదేశించినా అక్రమార్కులపై కేసులు కట్టలేదు. కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందాలు పోలవరం కాలువ గట్టు తవ్వకంపై దృష్టి సారించింది. దాని పక్కనే అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ప్రాంతం వైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే విజిలెన్స్ అధికారులు ఈ రూ.2 వేల కోట్ల అవినీతిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



నందిగం సురేష్ అనుచరుడు పావులూరి వాగేశ్వరరావు క్వారీ(ఫైల్)

రూ. 2 వేల కోట్ల భూ దోపిడీ!

గత వైసీపీ ప్రభుత్వంలో కొండలు, దిబ్బలు మాయం

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్

- నందిగం సురేష్, అంబటి రాంబాబు, వల్లభనేని వంశీ అనుచరుల నిర్వాకం
- ఎన్‌జీటీ ఆదేశించినా.. అక్రమార్కులపై నాడు కేసుల్లేవు
- అటవీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలకు మాఫియా నుంచి వాటాలు!
- కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- నాటి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలికితీత
- ప్రధానమైన విజయవాడ రూరల్ మండలాన్ని వదిలేయడంపై విమర్శలు
- వెంటనే విచారణ చేపట్టాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడ రూరల్ మండలంలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సాగించిన అక్రమ మైనింగ్‌కు మరేదీ సాటిరాదు. కళ్లు తిరిగేలా అక్రమ మైనింగ్ ఇక్కడ జరిగింది. జక్కంపూడి, వేమవరం, కొత్తూరు, తాడేపల్లి, జీ కొండూరు మండలం వెలగలేరు గ్రామాల్లో అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. అడవులు, అసైన్డ్ భూములు, కొండలు, గుట్టలను వదలకుండా కరిగించేశారు. కొత్తూరులో 227 సర్వే నంబర్, తాడేపల్లిలో 260 సర్వే నంబర్‌లోని వసంతరాయలు తిప్ప, తాడేపల్లిలోనే 244 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి, మరో సర్వే నంబర్ 248లోని భూమి, ఇంకో సర్వే నంబర్ 247లోని దొండ తిప్ప, జక్కంపూడిలో సర్వే నంబర్ 147 సమీపంలో అడ్డగోలుగా లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను వైసీపీ మైనింగ్ మాఫియా దోచుకుపోయింది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదులు

మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరులుగా చెప్పుకుని మరీ విచ్చలవిడిగా దోపిడీ చేశారు. అటవీ భూములను కూడా చెరబట్టి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. పర్యావరణాన్ని దెబ్బతీసేలా మట్టి తవ్వకాలు జరిపారు. ఆఖరుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి కూడా వీరిపై ఫిర్యాదు చేయటం జరిగింది. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అప్పటి సబ్ కలెక్టర్ తనిఖీలకు వస్తున్నారన్న సమాచారంతో.. వాహనం ముందుకు కదలకుండా ఉండటానికి వీలుగా మైనింగ్ మాఫియా ఏకంగా దారికి గండిని కొట్టించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు కూడా ఈ మైనింగ్ మాఫియాకు సహకరించాయని విమర్శలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్ శాఖల అధికారులు కూడా అప్పట్లో మైనింగ్ మాఫియా కనుసన్నల్లో పనిచేశారన్నది బహిరంగ రహస్యమే. వ్యవస్థలకు కూడా అప్పట్లో తమ అక్రమ మైనింగ్‌లో వాటాలు ఇవ్వటంతో అక్రమాలను అడ్డుకునే వారే కరువయ్యారు. దాదాపుగా నాలుగేళ్ల పాటు నిరంతరాయంగా అక్రమ క్వారీయింగ్ జరిపారు. ఈ అక్రమ క్వారీయింగ్ విలువ రూ.2 వేల కోట్లుగా ఉంటుందన్నది అంచనాగా ఉంది.

కేసులు నమోదు చేయమన్నా..

ఎన్‌జీటీ కేసులు నమోదు చేయమని నాటి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. అప్పటి జిల్లా యంత్రాంగం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిందిగా అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణాకు లేఖ కూడా రాశారు. అయినా కూడా చర్యలు తీసుకోలేదు. అటవీ శాఖాధికారులు కూడా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదు. మైనింగ్ మిగతా 6లో..



ల్యాంకో విద్యుత్ లైన్

జగడం!

రాధా వర్సెస్ ఎంసీఎం.. ఎంసీఎం వర్సెస్ రైతులు

తమ భూభాగంలో కొనుగోలు చేసిన ల్యాంకో యూనిట్‌ను ఖాళీ చేయలేదని..

- నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాలని ఎంసీఎంపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన రాధా
- తమ పొలాల్లో టవర్లు, లైన్‌లను కొనుగోలు చేసి ఖాళీ చేయలేదని..
- రూ.520 కోట్లు చెల్లించాలని ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీకి వెళ్లబోతున్న రైతులు
- ఎంసీఎం, ల్యాంకో లిక్విడేటర్లకు ముందుగా నోటీసులు ఇవ్వాలని నిర్ణయం

కొండపల్లి ల్యాంకో పవర్ ప్లాంట్ వ్యవహారంలో రోజుకో కొత్త వివాదం తెరపైకి వస్తోంది. ఆక్షన్‌లో ఒక యూనిట్‌తో పాటు ప్లాంట్ భూభాగాన్ని కొనుగోలు చేసిన రాధా సంస్థ మరో యూనిట్ కొనుగోలు చేసిన మయన్మార్ దేశానికి చెందిన ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేసింది. తమ భూమిలోని యూనిట్‌ను ఖాళీ చేయకుండా ఉన్నందుకు తమకు నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇదే సందర్భంలో తమ పొలాల్లో టవర్లు, లైన్‌లను కొనుగోలు చేసి ఖాళీ చేయలేదని.. తమకు నెలకు రూ.16 కోట్ల చొప్పున 38 నెలల కాలానికి రూ.520 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీ ఆశ్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొండపల్లి ల్యాంకో వివాదం సరికొత్త మలుపు తిరిగింది. ల్యాంకో పవర్ ప్లాంట్‌ను ఆక్షన్‌లో కొనుగోలు చేసిన రాధా, ఎంసీఎం కంపెనీల మధ్యన జగడం తలెత్తింది. ఈ రెండు సంస్థల మధ్యన నెలకొన్న వివాదం కాస్తా.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి చేరింది. మయన్మార్ దేశానికి చెందిన ఎంసీఎం కంపెనీపై రాధా సంస్థ కేసు వేసింది. కొండపల్లి ల్యాంకో పవర్ ప్రాజెక్టును ఎన్‌సీఎల్‌టీ నియమించిన లిక్విడేటర్ ఆక్షన్ వేయగా.. ఈ రెండు సంస్థలు మిగతా 6లో..



NATIONAL COMPANY LAW TRIBUNAL

ORDER

ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయిస్తూ పిటిషన్ వేసిన రాధా డాక్యుమెంట్ కాపీలు

ఫలించిన యార్లగడ్డ కృషి

కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగుల పదోన్నతులు పునరుద్ధరణ

గత జనవరిలో పదోన్నతుల రద్దుపై ఆందోళన చేసిన ఉద్యోగులు

- మచిలీపట్నం వెళ్లి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన గన్నవరం ఎమ్మెల్యే
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి
- నేడు చీఫ్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించిన కేడీసీసీ బ్యాంక్ సీఈవో
- ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కేడీసీసీ ఉద్యోగులు



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి సన్మానిస్తున్న కేడీసీసీ ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ (కేడీసీసీ) బ్యాంక్‌లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ- సీ కేటగిరీల ఉద్యోగులకు పదోన్నతుల్లో జరిగిన అన్యాయంపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపించారు. వివరాల్లోకి వెళితే... చీఫ్ మేనేజర్లుగా పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి వెంటనే వాటిని రద్దు చేయటంపై గత జనవరిలో మచిలీపట్నంలోని కేడీసీసీ బ్యాంకు ఎదుట పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బలహీన వర్గాలు, దళిత ఉద్యోగులకు అన్యాయం చేసే విధంగా అధికారులు వ్యవహరించారని నిరసన తెలిపారు. బ్యాంకు ఎదుటే బైఠాయించి దీక్ష చేపట్టిన విషయాన్ని కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలుసుకున్నారు. వెంటనే మచిలీపట్నం వెళ్లి ఆందోళన చేస్తున్న ఉద్యోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్లి తప్పకుండా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో యార్లగడ్డ వెంకట్రావుపై నమ్మకంతో ఉద్యోగులు కూడా ఆందోళన విరమించారు. ఆ తర్వాత కేడీసీసీ బ్యాంక్ దళిత, బీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి యార్లగడ్డ ప్రత్యేకంగా తీసుకు వెళ్లారు. దీంతో ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. దళిత, బీసీ ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులను రద్దు చేయవద్దని ఆదేశించింది. దీంతో కేడీసీసీ బ్యాంక్ సీఈవో వారి పదోన్నతులను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ పదోన్నతులకు ముఖ్య కారణమైన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కేడీసీసీ బ్యాంకు అభివృద్ధికి దోహదపడాలని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవటానికి తాను సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా తనను కలిసిన ఉద్యోగులతో యార్లగడ్డ అన్నారు.

ఏమార్చి..!

ఆర్‌డబ్ల్యూఎస్‌లో మిగులు ఉద్యోగుల ఘనకార్యం

అక్రమంగా ఆర్థిక ప్రయోజనాలు

ప్రభుత్వాన్ని ఏమార్చి అక్రమంగా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని మిగులు ఉద్యోగులు. సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్‌కి రిపోర్టు చేయాలని నాడు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా నేటి వరకు పట్టించుకోలేదు. పదవీ విరమణ వయస్సు దాటిపోయినా ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. ఈ విషయం ఎక్కడ బయటకు వచ్చి తాము ఇబ్బందుల్లో పడతామోనని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆందోళన చెందుతున్నారు.

- ఎస్‌ఎంపీసీకి రిపోర్టు చెయ్యకుండా తాత్సారం
- హైకోర్టు ఆదేశించినా కదలని సదరు ఉద్యోగులు
- పదవీ విరమణ వయస్సు దాటినా కొనసాగుతున్న వైనం
- ఆందోళనలో ఆ శాఖ ఉన్నతాధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు వివిధ శాఖల తరఫున ఉద్యోగులు వచ్చారు. ఆ క్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు కూడా అప్పట్లో ఉద్యోగులు పలువురు వచ్చారు. వివిధ శాఖల్లో అదనంగా పనిచేస్తున్న 58 మందిని జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీరిని అప్పట్లో జిల్లా ఉపాధి కల్పనా శాఖ నేతృత్వంలో పనిచేసే సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్ (ఎస్‌ఎంపీసీ)కి బదలాయింపు చేసింది. ఈ ఉద్యోగులను ఆ తర్వాత వివిధ శాఖలకు కేటాయించింది. అనంతరం అప్పటి ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టర్ జరిగిన పొరపాటును గుర్తించి వారిని తిరిగి సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్ (ఎస్‌ఎంపీసీ)కు వచ్చేయాలని ఆదేశాలు మిగతా 6లో..

అవినీతిలో సహకారం

పీఏసీఎస్‌ల్లో భారీగా నగదు గోల్‌మాల్!

రైతులు చెల్లించిన రుణాలు పక్కదారి

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పాలన గాడితప్పింది. రైతు రుణాలను సెక్రటరీలు, సిబ్బంది, పర్సన్ ఇన్‌చార్జిలు దారి మళ్లించారు. లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. ఈ విషయాలన్నీ పీఏసీఎస్‌ల్లో ఇటీవల చేపట్టిన కంప్యూటరీకరణతో వెలుగుచూస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు ఇస్తున్నా.. విచారణ మాత్రం నత్తనడకనే సాగుతోందని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలువురు సెక్రటరీలు తమ పలుకుబడిని ఉపయోగించి విచారణ జరగకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంతమంది పెద్దలు కేడీసీసీబీ, సహకారశాఖ అధికారులతో మంతనాలు జరిపి విచారణను అడ్డుకుంటున్నారని విమర్శలు కూడా వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో త్రీమెన్ కమిటీల నేతృత్వంలో నడిచిన పీఏసీఎస్‌ల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నాయి.

- తాజాగా గోకవరం పీఏసీఎస్‌పై విచారణకు ఆదేశం
- తరకటూరు, ముచ్చర్ల, ముక్కొల్లులోనూ ఇదే పరిస్థితి
- నాగాయలంక పీఏసీఎస్‌లో ఎరువులు మాయం
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న విచారణలు
- నిందితులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో రైతులు తీసుకున్న రుణాలు చెల్లించారు. రైతులు రుణాలు చెల్లించినట్లు పీఏసీఎస్ రికార్డుల్లో చూపారు. కానీ కేడీసీసీ బ్రాంచ్‌లో రుణాలు ఇంకా చెల్లించనట్లుగా చూపుతోంది. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఈ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై సహకారశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. అధికారుల ప్రాథమిక విచారణలో రూ.55 లక్షల వరకు నగదు పక్కదారి పట్టినట్లు తెలిసింది. ఇంతా జరిగినా ఈ పీఏసీఎస్‌పై 51 విచారణకు ఆదేశించలేదు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మిగతా 6లో..



మచిలీపట్నం మండలం గోకవరం పీఏసీఎస్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీఎం పర్యటన నేపథ్యంలోఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

8లో

నగర ప్రజలను మళ్లీ మురిపించనున్న..

విజ్ఞాన వినోదం

- ఎగ్జిబిషన్ సొసైటీపై ఆడిటింగ్‌కు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం
- ఎగ్జిబిషన్ల నిర్వహణ దిశగా అడుగులు
- కలెక్టర్ చొరవతో పూర్వ వైభవం
- గత అనుభవాల దృష్ట్యా పారదర్శకత అవసరం

6లో

నిశీధిలో నరకం

- పేరుకు మాత్రమే హైవే పెట్రోలింగ్
- వాహనాలు ఆగినా పట్టించుకోని దుస్థితి
- అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు

8లో

ఆర్‌పీఎఫ్ సేవలు అద్వితీయం

- వార్షిక నివేదికను వెల్లడించిన డివిజనల్ రైల్వే అధికారులు

మందార కుసుమ ప్రియ..



దుర్గగుడిలో మందార, కలువలతో పుష్పార్చన

- దుర్గమ్మకు ఎర్రకలువలు, మందారాలతో అర్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రుల క్రమంలో నాలుగవ రోజైన బుధవారం దుర్గమ్మకు మందారాలు, కలువపూలతో అర్చన చేశారు. లలితా సహస్రనామ పారాయణ అనుసంధానం



చేస్తూ భక్తి కైంకర్యం సమర్పిస్తూ పుష్పాలను సమర్పించారు. ప్రతిరోజూ పుష్పాలతో అమ్మవారిని అర్చించటం జరుగుతుంది. రోజుకొక రకం పుష్పం ఎంపికలో ఒక క్రమ విధానాన్ని అనుసరిస్తారు. ఆయా వారాలను బట్టి పూలను ఎంపిక చేస్తారు. బుధవారం అమ్మవారికి మందారాలు, కలువపూలను సమర్పించటంలో ఎంతో వైవిధ్యం ఉంది. అమ్మవారిని మందార కుసుమ ప్రియ అని అర్చిస్తుంటారు. చైత్రమాస వసంత నవరాత్రుల్లో అమ్మవారికి పూలతో పూజ చేయటం వల్ల సుఖశాంతులు ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మిక.

దుర్గగుడి డిప్యూటీ ఈవో రత్నరాజు బదిలీ

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లోని జనరల్ విభాగం డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో పరిపాలనా సౌలభ్యం కోసం ఆయనను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నూతిపాడు వద్ద సాగర్ జలాలను పరిశీలిస్తున్న కోట వీరబాబు

15 వరకు సాగర్ జలాలను విడుదల చేయండి

- తెలంగాణ సర్కారుకు ఎన్ఎస్‌పీ చైర్మన్ వినతి

విస్సన్నపేట/రెడ్డిగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సాగర్ మూడోజోన్‌కు ఏప్రిల్ 15 వరకు సాగు నీరు విడుదల చేయాలని ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావులు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నూతిపాడు 101 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్ద, రామచంద్రాపురం 117 వద్ద నీటి విడుదలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కోట వీరబాబు మాట్లాడుతూ, 101 నుంచి దిగువకు 1500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారని, ఎడమ కాలువలో ఉన్న 3.2 లక్షల ఆయకట్టుకు 32 టీఎంసీల వాటా ఉండగా తెలంగాణ ప్రభుత్వం కేవలం 22 టీఎంసీలు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఏప్రిల్ 15 వరకు నీటిని ఏపీలోని దిగువ ప్రాంతాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. లేకుంటే ఆరుతడి పంటలు మొత్తం ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మూడో జోన్‌కు ఇస్తున్న 1580 క్యూసెక్కుల నీటి డిచార్జిని 2 వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. 1400 టీఎంసీ అధికార వాటా ఉన్నప్పటికీ 4.56 టీఎంసీలు మాత్రమే విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబవుతున్న పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల

వజ్రోత్సవ వేడుకకు ముస్తాబు

- 5న పోలవరపు శేషయ్య జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థుల కలయిక

కూచిపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామం భట్లపెనుమర్రులో పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల స్థాపించి 75 వసంతాలైన సందర్భంగా వజ్రోత్సవ (డైమండ్ జూబ్లీ) వేడుకలకు ముస్తాబవుతోంది. ఏప్రిల్ 5న వేడుకకు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. ఎన్నారైల ఆర్థిక సహకారంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. 1949-50 సంవత్సరంలో పూరిపాకలో ప్రారంభమైన పాఠశాల.. గ్రామానికి చెందిన పోలవరపు శేషయ్య రూ.25 వేలఆర్థిక సహకారంతో 1958వ సంవత్సరంలో పక్కా భవనంలోకి మారింది. నాటి నుంచి పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాలగా కొనసాగుతోంది. పాఠశాలలో విద్య నేర్చిన ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఏప్రిల్ 5న పూర్వ విద్యార్థుల కలయికలో భాగంగా డైమండ్ జూబ్లీ వేడుకల్లో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, పాఠశాల నిర్మాణ దాత పోలవరపు శేషయ్య విగ్రహాలను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 75 సంవత్సరాల పైలాన్ ఆవిష్కరించి గురువులను సత్కరించనున్నారు.

నగర ప్రజలను మళ్లీ మురిపించనున్న..

విజ్ఞానం వినోదం

ఎగ్జిబిషన్ సొసైటీపై ఆడిటింగ్‌కు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



- ఎగ్జిబిషన్ల నిర్వహణ దిశగా అడుగులు
- కలెక్టర్ చొరవతో పూర్వ వైభవం
- గత అనుభవాల దృష్ట్యా పారదర్శకత అవసరం

అవినీతి ఆరోపణలతో ప్రాభవం కోల్పోయిన ఎగ్జిబిషన్ సొసైటీని తిరిగి గాడిన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దశాబ్దంన్నర క్రితం ఆర్థిక అవకతవకలతో అట్టుడికిన ఎగ్జిబిషన్ సొసైటీ ఆ తర్వాత జిల్లా యంత్రాంగం ప్రోత్సాహకానికి దూరమై ఎగ్జిబిషన్ నిర్వహణ చేపట్టలేక ఇన్నేళ్లు ప్రాభవం కోల్పోయింది. గత కలెక్టర్లు ఎగ్జిబిషన్ సొసైటీపై ఉక్కుపాదం మోపారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాల ఆడిటింగ్‌కు ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాల ఆడిటింగ్‌కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు వీలుగా ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిషన్ల పునరుద్ధరణకు కలెక్టర్ లక్ష్మీశ చొరవ మంచిదే అయినప్పటికీ గతంలో ఆర్థిక అవకతవకల నేపథ్యంలో, సొసైటీ ఆర్థిక వ్యవహారాలు పకడ్బందీగా, పారదర్శకంగా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది.

పాతికేళ్లగా ప్రతీ ఏడాది బెజవాడలో వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్ నిర్వహణ జరిగేది. దీనికోసం నగరంలోని స్వరాజ్యమైదానాన్ని సుదీర్ఘ కాలం లీజుకు తీసుకున్న 'కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ' పాతికేళ్ల పాటు ఘనమైన సేవలు అందించింది. అనంతరం అనూహ్యంగా ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలతో జిల్లా యంత్రాంగం వేటుకు గురికావాల్సి వచ్చింది. సుమారు దశాబ్దంన్నర కాలంగా ఎగ్జిబిషన్ల నిర్వహణ జరగలేదు. ఇన్నాళ్లకు ఎగ్జిబిషన్ సొసైటీని తిరిగి గుర్తించే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు చాల కాలంగా ప్రయత్నాలు చేస్తున్నా జిల్లా యంత్రాంగం నుంచి సానుకూల స్పందన రాకపోవటంతో సొసైటీ గుర్తింపునకు నోచుకో లేదు. పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సొసైటీ పట్ల సానుకూలంగా స్పందించారు. పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా కలెక్టర్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు కలిశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చరిత్ర దాని నేపథ్యం తెలుసుకుని కలెక్టర్ ప్రత్యేకంగా వారితో సమావేశమయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీ గుర్తింపునకు నోచుకోకపోవటానికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఎగ్జిబిషన్లు నిర్వహించటానికి వీలుగా జిల్లా యంత్రాంగం అధ్యయనం చేయాల్సి ఉందన్న విషయాన్ని నిర్వాహకులతో చర్చించారు. ఎగ్జిబిషన్ సొసైటీ బైలాను కూడా ఆయన అధ్యయనం చేయనున్నారు. సొసైటీ స్థిర, చరాస్తులు, వాటి లెక్కలు కూలంకషంగా పరిశీలించిన మీదట ఎగ్జిబిషన్ సొసైటీకి తగిన గుర్తింపు ఇచ్చి ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలన్న దానిపై కలెక్టర్ ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

పదిహేనేళ్లుగా నగర ప్రజలకు విజ్ఞానం, వినోదం దూరం..

పదిహేనేళ్లుగా ఎగ్జిబిషన్లు లేకపోవటంతో.. నగర ప్రజలకు విజ్ఞానం, ఆహ్లాదం కరువైంది. గతంలో విజయవాడలో ఎగ్జిబిషన్ అంటే క్రేజ్ ఉండేది. దేశవ్యాప్తంగా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించటానికి ప్రతిష్ఠాత్మక సంస్థలు పోటీ పడేవి. ఎగ్జిబిషన్లు విజ్ఞానదాయకం, వినోదంగానూ ఉండేవి. ఎగ్జిబిషన్లను ఎగ్జిబిషన్ సొసైటీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేది. అనూహ్యంగా పాతికేళ్ల తర్వాత సొసైటీపై వచ్చిన ఆరోపణలు అప్పట్లో మీడియాలో సంచలనమయ్యాయి. స్టాల్స్ కేటాయింపులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఖర్చులు ఎక్కువగా చూపారని ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పటి కలెక్టర్ బీఆర్ మీనా విచారణకు ఆదేశించి తర్వాత దాని గుర్తింపును రద్దు చేశారు.

అనుమతుల కోసం ఎగ్జిబిషన్ సొసైటీ పోరాటం..

అవినీతి ఆరోపణలతో ఎగ్జిబిషన్ సొసైటీ అతలాకుతలమైంది. తిరిగి రిజ్వీ కలెక్టర్‌గా ఉన్నపుడు మరోమారు ఎగ్జిబిషన్ నిర్వహణకు సొసైటీ నిర్వాహకులు అనుమతులు కోరగా అప్పటి కలెక్టర్ రిజ్వీ విచారణ జరిపి బైలా మార్పులకు సూచించారు. అప్పట్లో ఎగ్జిబిషన్ సొసైటీకి జిల్లా కలెక్టర్ గౌరవ చైర్మన్‌గా ఉండేవారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ పదవులను తొలగించాలని కలెక్టర్ రిజ్వీ సూచించారు. ఎగ్జిబిషన్ల నిర్వహణకు మాత్రం అనుమతులు ఇవ్వలేదు.

కలెక్టర్ లక్ష్మీశ చొరవతో ముందుకు..

తిరిగి ఇన్నాళ్లకు సొసైటీ నిర్వాహకులు ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుమతుల కోరుతూ ముందుకు రావటం.. ప్రస్తుత కలెక్టర్ లక్ష్మీశ సానుకూలంగా స్పందించటంతో కదలిక వచ్చింది. భవిష్యత్తులో ఆర్థిక అవకతవకలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ ఉండేలా, పారదర్శకంగా ఆన్‌లైన్ మానిటరింగ్ చర్యలు తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీనికి అనుగుణంగా కలెక్టర్ లక్ష్మీశ ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలకు సంబంధించి ఆడిటింగ్‌కు ఆదేశించారు. ఈ ఆడిటింగ్ ద్వారా సొసైటీ కార్యకలాపాలపై పూర్తి అవగాహన రానుంది. ఈ మేరకు తదుపరి చర్యలను కలెక్టర్ తీసుకోనున్నారు.

ఏమార్చి..!

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలపై అప్పట్లో సర్‌ప్లస్ ఉద్యోగులంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో వీరికి చుక్కెదురైంది. ఉద్యోగులంతా రిపోర్టు చేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది. అప్పట్లో కలెక్టర్ పొరపాటు జరిగిందన్నదానికి కూడా ఓ పెద్ద కథే ఉంది. కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అప్పటి ఉపాధి కల్పనాశాఖాధికారి అనధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారన్న వివాదం కూడా ఉంది. ఈ విషయం తెలిసి కలెక్టర్ తిరిగి వారిని సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో వాస్తవం ఏదైనా ఆయా శాఖలకు కేటాయించిన సర్‌ప్లస్ ఉద్యోగులందరినీ తిరిగి ఎస్ఎంపీసీకి రిపోర్టు చేయమన్నది మాత్రం వాస్తవం.

కలెక్టర్ ఆదేశాలను దాచిపెట్టి..

అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు వచ్చిన 58 మంది ఉద్యోగులలో సింహభాగం అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు వెనక్కు వచ్చేశారు. సర్‌ప్లస్ మ్యాన్ పవర్ సెల్ (ఎస్ఎంపీసీ)లో రిపోర్టు చేశారు. కొన్ని శాఖల్లో పనిచేసే సిబ్బంది మాత్రం రిపోర్టు చెయ్యటానికి సిద్ధపడలేదు. కలెక్టర్లు మారటంతో ఈ వ్యవహారం మరుగున పడిపోయింది. ఇలా రిపోర్టు చెయ్యని ఉద్యోగుల్లో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలోకి వచ్చిన ఉద్యోగులు కూడా ఉన్నారు. విజయవాడ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులలో ఒకరు కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకుండా దాచారు. దీంతో చాలా ఏళ్లుగా ఈ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా కూడా ఎస్ఎంపీసీకి రిపోర్టు చేయకుండా ఉండి పోయారు. మధ్య మధ్యలో ఎస్ఎంపీల నుంచి రిపోర్టులు కోరినా కూడా అవి కూడా తెలియకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో అనధికారికంగా చాలా కాలంగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో మిగులు ఉద్యోగులు కొనసాగుతూ వస్తున్నారు. ఆ తర్వాత ఉన్నతాధికారులకు తెలిసినా.. అప్పటికే చాలా కాలం నుంచి ఉండటం వల్ల పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవలే సర్‌ప్లస్ ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలుగా హైకోర్టు నిర్దేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సర్‌ప్లస్ ఉద్యోగులంతా కూడా కార్పొరేషన్ల పరిధిలో ఉన్నవారే కావటంతో 58 సంవత్సరాల వయస్సు వర్తిస్తుంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల గుండెల్లో బాంబు పేలినట్టు అయింది. ఎందుకంటే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న వారు ఇప్పటికే పదవీ విరమణ చేయాల్సి ఉంది. పదవీ విరమణ వయస్సు దాటినా ఇంకా కొనసాగుతున్నారు. పదవీ విరమణ చేయాల్సిన ఉద్యోగులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారం ఎక్కడ బయట పడుతుందోనన్న ఉద్దేశ్యంతో ఇప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భయపడుతున్నారు.

ఆక్వాకు ఉజ్వల భవిష్యత్తు

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు
- తెంపల్లిలో బయోమెడ్ ఆక్వా కేర్ ప్రారంభం

గన్నవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రంగానికి మంచి భవిష్యత్ ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. తెంపల్లి గ్రామంలో బయోమెడ్ ఆక్వా కేర్ కంపెనీ ప్రొటెక్షన్ ప్లాంట్, మైక్రోబయాలజీ యూనిట్, మినరల్ బ్యాచింగ్ యూనిట్‌లను బుధవారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, అన్ని వసతులతో బయోలజీ ప్లాంటు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం ప్రాంతంలో కంపెనీని ప్రారంభించి యువతకు ఉపాధి కల్పించటంపై యాజమాన్యానికి ధన్యావాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 7వేలమందికి పైగా ఉపాధి కల్పించినట్టు చెప్పారు. బయోమెడ్ ఎండీ పీవీ కృష్ణంరాజు మాట్లాడుతూ, 2003లో నలుగురు ఉద్యోగులు, రెండు ఉత్పత్తులతో ప్రారంభమైన తమ సంస్థ నేడు 35 ఉత్పత్తులు, 430 మంది డీలర్లు 100 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రైతులు, డీలర్ల మన్ననలు పొందుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు డి.సుబ్బరాజు, వి.నరేంద్ర వర్మ, టెక్నికల్ డైరెక్టర్ ఏవీ దుర్గా ప్రసాద్, మార్కెటింగ్ డైరెక్టర్ పి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



బయోమెడ్ ఆక్వా కేర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ వివరాలు చెప్పండి..

- లోక్‌సభలో కేంద్ర ప్రణాళికా శాఖను కోరిన ఎంపీ కేశినేని చిన్ని



వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ (ఎబిపి)కి సంబంధించి మంజూరు చేసిన, వినియోగించిన నిధులు వివరాలు తెలియపరచాలని లోక్‌సభలో కేంద్ర ప్రణాళికా మంత్రిత్వ శాఖను బుధవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. దీనికి స్పందిస్తూ కేంద్ర గణాంక, ప్రణాళికా అమలు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం తెలిపారు. ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద 7 జిల్లాల్లో 15 బ్లాక్స్ గుర్తించారని, వాటిలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ప్రాంతాల్లో బ్లాక్స్ గుర్తించినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రూ.2.51 కోట్లు విడుదల చేయగా, రూ.48 లక్షలు వినియోగించినట్టు తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా బ్లాక్ స్థాయిలో పాలన మెరుగుపరచడం, పారదర్శకత, అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య వేసవి ప్రత్యేక రైలు

రేల్వేస్టేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణమధ్య రైల్వే చర్లపల్లి-విశాఖపట్నం వన్‌వే ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న 07011 చర్లపల్లి-విశాఖపట్నం రైలు చర్లపల్లిలో రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరునాడు ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో రైలు ఆగుతుంది. 2ఏ, 3ఈ, స్లీపర్ క్లాస్‌తోపాటు జనరల్, సెకండ్ క్లాస్ ఉన్నాయి.

అవినీతిలో సహకారం

(5వ పేజీ తరువాయి)

మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయనే కారణంతో కొందరు పెద్దలు ఈ అంశంలో జోక్యం చేసుకుని తెరవెనుక కథ నడుపుతున్నట్లు సమాచారం. రూ.55 లక్షలు చెల్లిస్తారని, ఈ పీఏసీఎస్‌పై విచారణను నిలిపివేయాలని తెరవెనుక కొందరు మంతనాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే పీఏసీఎస్ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందనే కారణం చూపి రైతులు ఫిర్యాదులు చేయకుండా అడ్డుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పీఏసీఎస్‌లో పెద్ద మొత్తంలోనే అవినీతి జరిగినా, విచారణను ముందుకు సాగనీయకుండా కొన్ని అదృశ్య శక్తులు అడ్డుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పది సంవత్సరాలుగా గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా, పర్సన్ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడు కొనసాగడం గమనార్హం.

ముక్కొల్లు పీఏసీఎస్ సెక్రటరీపై నేటికీ చర్యల్లేవు

గూడూరు మండలం ముక్కొల్లు పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న 25 మందికి పైగా రైతుల నుంచి సంబంధిత పీఏసీఎస్ సెక్రటరీ రుణాలకు సంబంధించిన నగదును వసూలు చేశారు. పీఏసీఎస్‌లో రుణాలు కట్టించుకోకుండా తన ఫోన్‌పే నంబరుకు నగదును సెక్రటరీ జమ చేయించుకున్నారు. సదరు సెక్రటరీపై ఉన్న నమ్మకంతో రైతులు నగదును ఫోన్‌పే రూపంలో చెల్లించారు. కానీ ఈ నగదును రైతుల ఖాతాల్లో రుణాలు చెల్లించినట్లుగా చూపలేదు. రైతులు మళ్లీ రుణం కోసం పీఏసీఎస్‌కు వెళితే రుణాలు చెల్లించనట్లుగా రికార్డులు చూపాయి. దీంతో రైతులు పీఏసీఎస్ సెక్రటరీకి తాము చెల్లించిన నగదు మొత్తాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలు, ఆధారాలతో ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు రూ.45 లక్షల వరకు నగదు పక్కదారి పట్టినట్లుగా నిర్ధారించారు. అధికారుల విచారణలో నిజాలు నిగ్గుదేలడంతో అక్రమాలకు పాల్పడిన పీఏసీఎస్ సెక్రటరీ తప్పించుకుతిరుగుతున్నాడు. నగదును రికవరీ చేయకుండా, సంబంధిత సెక్రటరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా అధికారులు నేటికీ మీనమేషాలు లెక్కించడానికి గల కారణాలపై అనేక అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

నాగాయలంక పీఏసీఎస్‌లో ఎరువులు మాయం

జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లతో పాటే నాగాయలంక పీఏసీఎస్‌ను ఇటీవల కంప్యూటరీకరణ చేశారు. ఈ సమయంలో ఈ పీఏసీఎస్‌కు వచ్చిన ఎరువులు పక్కదారి పట్టిన అంశం, ఎరువుల స్టాకులో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. టి-కొత్తపాలేనికి చెందిన ఇద్దరు రైతులకు రుణాలు ఇచ్చినా రికార్డులు సక్రమంగా లేవని గుర్తించారు. క్యాష్‌బుక్‌లో దిద్దుబాట్లు కూడా ఉన్నాయి. దీంతో ఈ వ్యవహారంపై పలు ఫిర్యాదులు అందాయి. సహకార శాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఎప్పటిలోగా ఈ విచారణను పూర్తి చేస్తారో తెలియనిస్థితి నెలకొంది.

ప్రారంభమేకాని విచారణ

గూడూరు మండలం తరకటూరు పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా సహకారశాఖ అధికారులు విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు ఈ పీఏసీఎస్‌లో ఇంకా విచారణను ప్రారంభించలేదు. ఒకటీ రెండు రోజుల్లో విచార ణ చేస్తామని చెప్పడం గమనార్హం. పెడన మండలం ముచ్చర్ల పీఏసీఎస్‌లోనూ నగదు పక్కదారి పట్టిందనే అంశంపై ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. అక్రమాలపై పూర్తిస్థాయిలో, పారదర్శకంగా విచారణ చేస్తారా లేక మమ అనిపిస్తారా అనేది వేచి చూడాలి. ఈ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై ప్రాథమిక విచారణ జరుగుతోందని, తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు

భూ దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అధికారులు కూడా అక్రమార్కులకు వత్తాసు పలికేలా వ్యవహరించారు. రెవెన్యూ యంత్రాంగమైతే అప్పట్లో మైనింగ్ మాఫియాకు ఏజెంట్ల మాదిరిగా పనిచేసిందనే ఆరోపణలు ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి'తో పాటు అనేక పత్రికల్లో సీరియల్‌గా విజయవాడ మండలంలో జరిగిన అక్రమాలపై కథనాలు ప్రచురితమైన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉన్నతాధికార యంత్రాంగాలు కూడా కళ్లు మూసుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే విజిలెన్స్ రంగంలోకి దిగటంతో ప్రజలు సంతోషించారు. గన్నవరం మండలంలో అక్రమ క్వారీయింగ్‌ను నిగ్గుతేల్చినట్టుగానే విజయవాడ రూరల్ మండలంలో కూడా నిగ్గుతేల్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

జగడం!

(5వ పేజీ తరువాయి)

వేర్వేరు యూనిట్లను కొనుగోలు చేశాయి. రాధా సంస్థ ఒక యూనిట్‌తో పాటు ప్లాంట్ భూభాగాన్ని కొనుగోలు చేసింది. ఎంసీఎం కంపెనీ మరో యూనిట్‌తో పాటు ల్యాంకో విద్యుత్ లైన్‌ను కొనుగోలు చేసింది. ఎంసీఎం కంపెనీ కేవలం స్క్రాప్ కిందనే యూనిట్‌ను కొనుగోలు చేయటం జరిగింది. భూమి మాత్రం కొనలేదు. దీంతో రాధా సంస్థ, ఎంసీఎం కంపెనీపై తమ భూభాగంలో ఉన్న యూనిట్‌ను తరలించనందున నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తూ ఎన్‌సీఎల్‌టీలో కేసు నమోదు చేసింది. ఈ ప్రకారం చూస్తే దాదాపుగా 20 నెలలకు రూ. 50 కోట్ల మేర ఎంసీఎం కంపెనీ చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ తాజా వివాదంతో విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో లైన్ల అలైన్‌మెంట్ మార్పిడి సమస్యకు పరిష్కారం దిశగా అడుగు పడింది. ఈ రెండు సంస్థలు ల్యాంకో పవర్ ప్లాంట్‌ను యూనిట్ల వారీగా కొనుగోలు చేశాయన్నది స్పష్టమవుతోంది. ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్స్ లైన్‌ను ఎంసీఎం కంపెనీ ఊడదీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అలాంటపుడు.. ఇక ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరమే లేదు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఈ విషయాన్ని జాతీయ రహదారుల సంస్థ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాస్తవ పరిస్థితులు నివేదిస్తే సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది.

ఎంసీఎం సంస్థ, ల్యాంకో లిక్విడేటర్‌పై కేసులు వేసేందుకు రైతులు రెడీ

ఎంసీఎం సంస్థపై రాధా సంస్థ కేసు వేసిన నేపథ్యంలో బాధిత ఎన్టీఆర్ జిల్లా రైతాంగం కూడా ఎంసీఎం సంస్థపై ఎన్‌సీఎల్‌టీలో కేసులు వేసేందుకు సిద్ధమైంది. అలాగే ల్యాంకో లిక్విడేటర్‌పైనా ఎన్‌సీఎల్‌టీలో కేసులు వేసేందుకు తాజాగా జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ఎంసీఎం కంపెనీ తమ పొలాల మీదుగా వెళుతున్న లైన్‌ను తొలగించకపోవటం వల్ల తమకు జరిగిన నష్టంపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాలని భావిస్తోంది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ లైన్ల కింద 52 మీటర్లు వెడల్పున 20 కిలోమీటర్లు సాగుతున్న ల్యాంకో ట్రాన్స్‌మిషన్ లైన్ కారణంగా 250 ఎకరాల వరకు రైతులకు నష్టం వాటిల్లుతుందని, నెలకు రూ.16 కోట్ల చొప్పున 38 నెలల కాలానికి రూ.520 కోట్లు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేయాలని నిర్ణయించింది. ముందుగా ఎంసీఎం కంపెనీ, ల్యాంకో లిక్విడేటర్‌లకు నోటీసులు ఇచ్చి 15 రోజుల లోపు సంతృప్తికరంగా సమాధానం ఇవ్వకపోతే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాలని రైతాంగం నిర్ణయించింది.

ఎన్‌సీఎల్‌టీ అసహనం

కొండపల్లిలో మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్‌ను ఆక్షన్ వేసి అప్పుల వాళ్లకు సెటిల్‌మెంట్ చేసేందుకు ఎన్‌సీఎల్‌టీ ఒక లిక్విడేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత లిక్విడేటర్ రంగంలోకి దిగి ల్యాంకో పవర్ ప్లాంట్‌ను యూనిట్ల వారీగా ఆక్షన్ వేయటం జరిగింది. ఒక యూనిట్‌ను మొత్తం భూభాగంతో సహా రాధా సంస్థ కొనుగోలు చేయగా, మరో యూనిట్‌ను రిలయెన్స్ సంస్థ కొనుగోలు చేసింది. మూడో యూనిట్, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్స్‌ను మయన్మార్‌కు చెందిన ఎంసీఎం కంపెనీలకు విక్రయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా .. ఆ తర్వాత సమస్యలు వచ్చాయి. ఒక యూనిట్, ల్యాంకో లైన్స్‌ను కొన్న ఎంసీఎం కంపెనీ పూర్తిగా లిక్విడేటర్‌కు డబ్బులు చెల్లించలేదు. దీంతో వీరిద్దరి మధ్యన వివాదం కూడా ఎన్‌సీఎల్‌టీలో కేసు నడుస్తోంది. ఎన్‌హెచ్ వంటి సంస్థలు ల్యాంకో లిక్విడేటర్‌ను సంప్రదించకుండా రాధా సంస్థతో సంప్రదింపులు జరపటం, అలైన్‌మెంట్ మార్పు వ్యవహారాలు తెరమీదకు రావటం ఇవన్నీ కూడా గందరగోళంగా మారటంతో ఎన్‌సీఎల్‌టీ లిక్విడేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అంపైర్‌గా పనిచేయకుండా గోల్ కీపర్‌లా వ్యవహరించటంపై ఎన్‌సీఎల్‌టీ మండిపడింది. ఈ వ్యవహారంలో సరిగా వ్యవహరించకపోతే లిక్విడేటర్‌ను మార్చాల్సి ఉంటుందని కూడా హెచ్చరించినట్టు తెలుస్తోంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	153,162, 173
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

భారతీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామచంద్ర నగర్ కాలనీలోని శ్రీ రామ ధాన్యమందిరంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న శ్రీ రామనవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు వేదమంత్రాలతో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు స్వామికి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. 7న సాయంత్రం స్వామిని కాలనీ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువస్తామని సభ్యులుపేర్కొన్నారు.

పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా...

- కళకళలాడుతున్న నాల్గో డివిజన్ పరిధిలోని అంతర్గత రోడ్లు
- సాయంకాలం సేదతీరుతున్న పిల్లలు, పెద్దలు



కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు రోడ్డో



కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ 3వ రోడ్డో



డెయిరీ ఆఫీసర్స్ కాలనీ రోడ్డో

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. వేసవి కాలం ప్రారంభంలో అత్యధిక ఉష్ణోగ్రలు నమోదుకావడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఈ వాతావరణ పరిస్థితుల నుంచి పచ్చని చెట్లుకొంత ఊరటనిస్తున్నాయి. నాల్గో డివిజన్ పరిధిలోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్ కాలనీ, డెయిరీ కాలనీ, గురునానక్ కాలనీ, భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీల్లో పలు అంతర్గత రోడ్లో ఉన్న పచ్చని చెట్లతో కాలనీ వాసులు ఆహ్లాదం, ఆనందంగా జీవిస్తున్నారు. కాలనీ ఏర్పాటు చేసిన కొత్తలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఏళ్ల గడిచిపోవడంతో ప్రస్తుతం అవి పెద్దచెట్లు కావడంతో కాలనీలోని రోడ్లు పచ్చదనంతో కళకళలాడుతున్నారు. సాయంత్రం అయితే చాలు కాలనీలోని చిన్నారులు, పెద్దలుఈ రోడ్డులో సరదాగా నడుస్తూ సేదతీరుతున్నారు. ఈ కాలనీలు సమీపంలోని పలు కాలనీలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

-భారతీనగర్, ఆంధ్రజ్యోతి



గురునానక్ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్ రోడ్డులో ఇరువైపులా చెట్లు

ఈ-శ్రమ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల నమోదు

అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులు అందరూ ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, కర్మాగార, బాయిలర్స్, ఇన్సూరెన్సు, మెడికల్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు తెలిపారు. బుధవారం భవానీపురంలోని ఏపీటీడీసీ ధరణి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూర్డ్ పర్సన్స్ రిజిస్ట్రేషన్‌పై సూచనలు ఇస్తూ 10 లేదా ఆపైన కార్మికులు పనిచేస్తున్న, నెల జీతం రూ.21 వేల కంటే తక్కువగా వున్న వారిని నమోదు చేయాలని ఆదేశించారు. కార్మిక శాఖ, ఇతర శాఖల సమన్వయంతో ఈ నమోదు ప్రక్రియను రానున్న రెండు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. గిగ్ వర్కర్స్, ప్లాట్‌ఫాం వర్కర్స్‌ను ఈ - శ్రమ పోర్టల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మాడ్యూల్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వీటిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెలాఖరు లోగా బాల కార్మిక తనిఖీలు విస్తృతంగా నిర్వహించి గుర్తించిన బాల కార్మికులకు చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవావాలని, సంబంధిత యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్మిక, కర్మాగారాల, బాయిలర్స్ ఇన్సూరెన్సు మెడికల్ సర్వీసెస్ శాఖల రాష్ట్రస్థాయి, ఏలూరు జోన్, జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల సవరణ బిల్లుకే టీడీపీ ఆమోదం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



తోపుడు బండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులందరికీ ఆమోద యోగ్యమైన వక్ఫ్ భూముల సవరణ బిల్లుకే టీడీపీ ఆమోదం తెలుపుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం 12వ డివిజన్ సంజయ్‌గాంధీ కాలనీలో ఆయన పర్యటించారు. డివిజన్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన ముగ్గురు పార్టీ కార్యకర్తలకు టిఫిన్ బండి, రెండు తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం కూడా వక్ఫ్‌బోర్డు, వక్ఫ్ ఆస్తుల విషయమై రకరకాలుగా ఆందోళన చెందుతున్నారన్నారు. టీడీపీ పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ యాక్ట్‌పై సుదీర్ఘంగా చర్చించి మైనార్టీ నాయకులతో సైతం మాట్లాడి జాయింగ్ యాక్షన్ కమిటీ ఏర్పాటుకు ఒత్తిడి చేసినట్లు తెలిపారు. జాయింట్ యాక్షన్ కమిటీకి కూడా టీడీపీ 8 సవరణలను సూచించిందని, ఆసవరణలకు ఆమోదం తెలుపుతున్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. బిల్లులోని అంశాలను పరిశీలించి ఆబిల్లును వ్యతిరేకించి అయినా ముస్లిం సోదరులకు సీఎం చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. ముస్లిం సోదరులకు ఆమోదయోగ్యమైన బిల్లు వస్తుందని ఆయన ఆశించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, సాయిన బుజ్జి, మహమ్మద్ ఇబ్రహీం, మేదరమెట్ల నారాయణ, కాలిక్, కరీం తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ సిటీ ప్లానర్‌గా సంజయ్ రత్నకుమార్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్‌గా కె. సంజయ్ రత్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, నగర కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. సంజయ్ రత్నకుమార్ విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ఇన్వెస్టమెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన జీవీజీఎస్వీ ప్రసాద్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)కి మాస్టర్‌ప్లాన్స్ విభాగానికి డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.



మంటలను ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

లబ్బీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు విజయవాడ నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా బందర్ రోడ్డులోని పలు హోటల్స్‌లో అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను తనిఖీ చేశారు. బందర్ రోడ్డులోని వైబ్రాంట్ హోటల్, మినర్వా గ్రాండ్, ఏలూరు రోడ్డులోని పలు హోటల్స్‌లో అగ్ని ప్రమాద పరికరాలు, వాటి పనితీరుని పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిరోధక చర్యలు, నిరోధక పరికరాలు ఉపయోగించే విధానం తదితర అంశాలను హోటల్ సిబ్బందికి డెమో రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజనల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఈఎండీపీపై జిల్లాస్థాయి పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి ఎం.హుస్సేన్

లబ్బీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంట్రప్రెన్యూర్ మైండ్ డవలప్‌మెంట్ (ఈఎండీపీ) ప్రోగ్రాంకు సంబంధించి జిల్లాస్థాయి పోటీలు బిషప్ అజరయ్య బాలికల హైస్కూల్‌లో బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి యువి. సుబ్బారావు ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ప్రజలకు అవసరమైన పరికరాలను, వస్తువులను తయారు చేయడం, వీటిని ఉపయోగించి ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అందుబాటులోకి తేవడం, వాటి నుంచి సంపద సృష్టించుకోవడం, అనేక మందికి సహాయం చేసే విధంగా ఈఎండీపీ ప్రోగ్రాంను రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పది పాఠశాలల విద్యార్థులు హాజరై తమ ప్రాజెక్టు ప్రదర్శించగా వాటిలో మొదటి రెండు స్థానాలకు బహుమతులు అందజేశారు. ఇతర విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయ్య నిర్ణేతలుగా బీసీబీ సెక్రటరీ ఉమరాలి, జిల్లా కోఆర్డినేటర్ భాను, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార కార్యక్రమానికి తిరుపతయ్య యాదవ్ ఆధ్వర్యంలో తరలిన టీడీపీ కార్యకర్తలు

ప్రమాణస్వీకార కార్యక్రమానికి తరలిన టీడీపీ కార్యకర్తలు

రాణిగారితోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీల పార్టీ అని తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిరి తిరుపతయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జి.నరసింహయాదవ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రాణిగారితోట నుంచి తిరుపతయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు పెద్ద పీట వేస్తూ అనేక పదవులతో గౌరవిస్తున్నారని, ఆయనకు, టీడీపీకి బీసీలు ఎప్పుడూ అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గోగుల బ్రదర్స్, జానీ, గండ్ర వెంకటేశ్వర్లు, బలగాని నరసింహులు, బాలు, రవి, కాళి, ఆశోక్, బాల, నరసింహరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో మంత్రి నాదెండ్ల తనిఖీ

పటమట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదార్లకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బజార్లను నిర్వహిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆయన బుధవారం ఆటోనగర్‌లోని ఏపీఐఐసీలో ఉన్న రైతుబజారును తనిఖీ చేశారు. అధికారులతో కలిసి సరుకులను పరిశీలించారు. వినియోగదార్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బియ్యాన్ని పరిశీలించారు. 26 కిలోల ఉన్న 204 బస్తాలను స్వాధీనం చేసుకోవాలని ఎస్టేట్ ఆఫీసర్‌ను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం రైతు బజారుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. రైతు బజార్ల నిర్వహణపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులు పొందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.



వివాహితపై అత్యాచారం

- రక్తస్రావంతో మృతి
- పోలీసుల అదుపులో నిందితుడు?
- కేసును ఛేదించిన పటమట పోలీసులు

విజయవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లోని పాత పీఅండ్‌టీ కాలనీలో మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆమెపై అత్యాచారం జరగడంతోనే ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తించారు. ఉదయం నుంచి ఆమెతో సన్నిహితంగా మెలిగిన పరిచయస్తుడే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు గుర్తించారు. ఆటోనగర్ గేటుకు సమీపాన ఉండే లీడ్‌క్యాప్ సంస్థకు చెంతనే ఉంటున్న చెత్త కాగితాలు ఏరుకునే మహిళ అనుమానాస్పద స్థితిలో మరణించిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. స్థానికులను విచారించి, సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడిని గుర్తించారు. పోలీసులు ఆమెతో పాటు నివసిస్తున్న వారిని విచారించారు. అపార్ట్‌మెంట్ వాసులను ప్రశ్నించారు. ఉదయం నుంచి ఆమెతో పాటు మరో వ్యక్తి ఉన్నాడని, అతని రూపురేఖలను అపార్టుమెంట్‌లో ఉన్న బాలుడు పోలీసులకు వివరించాడు. ఈ రెండు ఆధారాలతో పోలీసులు లీడ్‌క్యాప్‌కి పక్కన గుడారాల్లో నివసిస్తున్న వారిని విచారించారు. అతడి పేరు శివ అని పోలీసులకు తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీసులు అక్కడే ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అందులో ఆమెతోపాటు ఓ వ్యక్తి పక్కన కూర్చున్నట్టు కనిపించింది. ఘటన జరిగిన ప్రదేశానికి పక్కన ఉండే ఖాళీ స్థలంలో తోపుడు బండిపై తాగి అక్కడే నిద్రపోతుంటాడని స్థానికులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివ, మహిళ కలిసే ఉన్నారని కొందరు తెలిపారు. తోపుడుబండి వద్దకు మహిళను తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కారణంగానే రక్తస్రావం జరిగి ఆమె ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధారించారు. వివరాలను త్వరలో పోలీసులు అధికారికంగా ప్రకటించ నున్నారు. నిందితుడు శివను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

దుర్గగుడిలో అన్న వితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పోరంకికి చెందిన కిలారు ఫణిప్రసాద్, తమ కుటుంబ సభ్యులతో బుధవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,11,116లను చెక్కు రూపంలో అందచేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతకు, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేద పండితులు ఆశీస్సులు ఇచ్చారు. అనంతరం అధికారులు వారికి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, రాపిడో వంటి విదేశీ యాప్‌ల కారణంగా ఆటోకార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే ప్రభుత్వాలు స్పందించి రద్దు చేయాలని విజయవాడ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. దుర్గాపురం బీఆర్‌టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆటో కార్మికుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వచ్చే ఆదాయం చాలకపోవడంతో ఆటోమోటార్ కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి ఎం. హనుమంతరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు పి.తిరుపతయ్య, ఎం. కొండలరావు, జె.సూర్యనారాయణ, బి.లక్ష్మణ, వెంకటేశ్వరరావు తిరుమలరావు పాల్గొన్నారు.

పెంచిన పాల ధరలకు వ్యతిరేకంగా సీపీఐ నిరసన

చిట్టినగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.200 కోట్లు లాభం వస్తే, విజయ డెయిరీ వినియోగదారులకు పాలధరలను లీటరు రూ.2ల చొప్పున పెంచి భారాలు వేయడం సబబుకాదని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో పాలఫ్యాక్టరీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్‌లో లీటర్‌కు రూ.2లు పెంచి, ఆగస్టులో రూ.2లు పెంచి మరల ఇప్పుడు ఏప్రిల్ ఒకటి నుంచి రూ.2లు పెంచడం, ఇలా ఆరునెలలకొకసారి పాల రేట్లను పెంచి భారాలు వేస్తుందని దుయ్యబట్టారు. ప్యాకింగ్ ధరలు పెరిగాయన్న పేరుతో పాల వినియోగదారులపై ధరల భారాలు వేయడం దుర్మార్గమన్నారు. పాల ధర పెంచగానే హోటల్స్‌లో టీ ధరలను పెంచేశారని, చైన్ సిస్టం మాదిరిగా పాలతో పాటుగా పాల ఉత్పత్తులపై ఈ భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించాలని, సంస్థను పరిరక్షించాలని కోరారు. తక్షణమే పెంచిన పాల ధరలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నాయకులు నక్క వీరభద్రరావు, బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

- పేరుకు మాత్రమే హైవే పెట్రోలింగ్
- వాహనాలు ఆగినా పట్టించుకోని దుస్థితి
- అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు
- పొంచి ఉన్న ప్రమాదాలు.. గుర్తించకుంటే పెను నష్టం


వెలగని విద్యుత్ దీపాలతో చీకటిగా ఉన్న జాతీయ రహదారి


జాతీయ రహదారిపై అడ్డంగా నిలిపి ఉంచిన హైవే పెట్రోలింగ్ వాహనం.

ఇదో ట్రాఫిక్ టెర్రర్ హైవే! చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) దేశంలో అతిపెద్ద కారిడార్లలో ఒకటి. వేలాది వాహనాలు నిత్యం ప్రయాణించే ఈ హైవేపై 'హైవే పెట్రోలింగ్' నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సహాయ సేవల నిర్వహణలో ఘోరంగా విఫలమవుతోంది. దీంతో అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్

నిశీధిలో నరకం


చీకటిగా ఉన్న జాతీయ రహదారి

అంధకారంగా మారిన జాతీయరహదారిపై అధికారుల పర్యవేక్షణ శూన్యం

రహదారి భద్రత హైవే పెట్రోలింగ్ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) అతిపెద్ద కారిడార్. నిత్యం వీఐపీలు ప్రయాణించే ఈ రహదారిపై హైవే పెట్రోలింగ్‌కు సంబంధించి అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. జాతీయ రహదారిపై ప్రమాదం జరిగితే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు, ట్రాఫిక్ ఆగినప్పుడు, నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు నిలపకుండా చూడటంలో హైవే పెట్రోలింగ్ పూర్తిగా విఫలమైంది. జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో వాటికోసం ఏర్పాటు చేసిన వాహనాలు గానీ, సిబ్బంది గానీ అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్ చేయాల్సిన వాహనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడమే కాకుండా జంక్షన్‌లో రోడ్డు మధ్యలోనే నిలిపి ఉంచి రహదారి భద్రతకు వారే తూట్లు పొడుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చూసుకుంటారనే ఉద్దేశంతో సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో జాతీయ రహదారి పక్కన డివైడర్లు కలిసే చోట్ల వాహనాలు నిలిపి ఉంచినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ముఖ్యంగా వీరవల్లి, హనుమాన్ జంక్షన్‌కు వెళ్లేందుకు వేలేరు అడ్డరోడ్డు, బొమ్ములూరు వద్ద డివైడర్లు కనిపించకుండా భారీ వాహనాలు అడ్డుగా పెట్టినా హైవే పెట్రోలింగ్ వారికి కనబడటం లేదంటే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో అర్థమవుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బొమ్ములూరు, పొట్టిపాడు వద్ద గల రెండు టోల్‌గేట్‌లలో నమోదైన గణాంకాల ప్రకారం సుమారు 18వేల వాహనాలకు పైగానే ప్రతిరోజు ప్రయాణిస్తుంటాయని సమాచారం. వీటికి తోడు ఉత్తరాంధ్ర నుంచి అమరావతికి వెళ్లే వీఐపీలు ఇదే రహదారిపై ప్రయాణించాలి. మల్లవల్లి పారిశ్రామిక వాడకు వచ్చే భారీ వాహనాలు ఇదే రహదారిపై వస్తుంటాయి. అయినా సేవలు మాత్రం నామమాత్రమే. నిత్యం వేలాదిమంది ప్రజలు ప్రయాణించే జాతీయ రహదారిపై రహదారి భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గర్హనీయం. తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు శూన్యం

ఎ. సీతారాంపురం, కోడూరుపాడు, వీరవల్లి, ఎస్.ఎన్. పాలెం, పెరికీడు వద్ద అండర్‌పాస్‌లలో అడ్డదిడ్డంగా లారీలు నిలపేసి ఉంచుతారు. బొమ్ములూరు, వీరవల్లి, వేలేరు అడ్డరోడ్డు వద్ద అనుసంధానమయ్యే ప్రధాన రహదారులపై అడ్డుగా లారీలు, భారీ వాహనాలు నిలిపి ఉంచినా పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బస్సు లు, కార్ల వంటి వాహనాలు సర్వీసు రోడ్‌లోకి వెళ్లేందుకు మలుపు తీసుకోవడం కష్టంగా మారుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంద రు సిబ్బంది హోటళ్ల నిర్వాహకుల వద్ద నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జాతీయ రహదారి చీకటిమయం

చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బొమ్ములూరు టోల్‌ప్లాజా నుంచి పొట్టిపాడు టోల్‌ప్లాజా దాటాక సిద్ధార్థ వైద్య కళాశాల వరకూ కొన్నిరోజులుగా విద్యుత్ దీపాలు వెలగక అంధకారంగా మారింది. 20 కిలోమీటర్లకు పైగా ఉన్న జాతీయ రహదారిపై రెండువైపులా ఏర్పాటు చేసిన భారీ లైట్లు వెలగకపోవడంతో ముందు వెళ్లే వాహనాలు, రోడ్డుదాటే పాదచారులకు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్లోనూ విద్యుత్ దీపాలు వెలగక ఆయా గ్రామాల ప్రజలు అంధకారంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ సరఫరా నిలిపివేసినట్టు సమాచారం. దీంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మొత్తుకుంటున్నా అధికారుల తలకెక్కడం లేదు. దీంతో కోడూరుపాడు కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను కూడా దుండగులు తస్కరించారు. ఇప్పటికే ఈ సమస్యపై ఎన్‌హెచ్ సంస్థకు ఎస్సై స్థాయి అధికారి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

నివారణ చర్యలు ఏవి?

నిరంతర గస్తీ ముమ్మరం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా అండర్‌పాస్‌లలో వాహనాలు నిలిపినా, జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా వాహన చోదకులకు కౌన్సెలింగ్, జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలి. అత్యవసర వాహనాలను టోల్‌గేట్ల వద్ద అలంకారప్రాయంగా కాకుండా బ్లాక్‌స్పాట్‌లు (ప్రమాదకర పాయింట్లు) 3 చోట్ల అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. భారీ వాహనాలు ఏమైనా ఆగిపోతే తక్షణం స్పందించి క్రేన్ల సాయంతో రహదారి పక్కకు లేదా దగ్గరలోని ఖాళీ ప్రదేశంలో చేర్చేలా మూడు క్రేన్లను రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. హైవే సిబ్బంది ఎక్కడి వెళ్లింది జీపీఎస్ సాయంతో ఎప్పటికప్పుడు సమాచారం వచ్చేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

లైట్లు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి

సూర్యనారాయణ, ఉద్యోగి, కోడూరుపాడు.

జాతీయ రహదారిపై లైట్లు లేక చీకటిగా ఉండటంతో ముందు వెళ్లే పాదచారులు, సైకిలిస్టులు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. తాను విధులు ముగించుకుని వెళుతూ ప్రమాదానికి గురై చేయి ఫ్రాక్చరై 2నెలల పాటు జీతం కోల్పోయా. జాతీయ రహదారిపై ఉమామహేశ్వరపురం, కోడూరుపాడు, ఎ.సీతారాంపురం, వీరవల్లి, అంపాపురం వద్ద గ్రామాల ప్రజలు దినసరి పనులకు తప్పనిసరిగా జాతీయ రహదారి దాటాల్సిన పరిస్థితి. సర్వీస్ రహదారుల్లోనూ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బాలికపై అక్క భర్త అత్యాచారం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలికపై సొంత బావ అత్యాచారం చేసిన ఘటనపై చిల్లకల్లు పోలీసులు బుధవారం పోక్సో, రేప్ కేసు నమోదు చేశారు. మండలంలోని రెడ్యానాయక్ తండ గ్రామానికి చెందిన బాలికను తన అక్క భర్త త్రిపువరం గ్రామానికి చెందిన నిందితుడు వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామంలో మిర్చికోతకు తీసుకెళ్లాడు. ఆమెకు మాయమాటలు చెప్పి అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లి దాదాపు 20 రోజుల పాటు శారీరకంగా అనుభవించి గ్రామానికి తీసుకొచ్చాడు. గ్రామ పెద్దలు, ఇరువర్గాలు ఒకే కుటుంబానికి చెందినవారు కావటంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పటంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. మార్చి 25న నిందితుడు మళ్లీ బాలిక ఇంటికెళ్లి తన వద్ద ఫొటోలున్నాయని, బయటపెడతానని భయభ్రాంతులకు గురిచేయటంతో బాలిక పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు చిల్లకల్లు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం సీఐ వెంకటేశ్వర్లు, నందిగామ ఏసీపీ తిలక్‌కు సమాచారం అందించారు. కాగా నాగరాజుకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వత్సవాయి పోలీస్ స్టేషన్‌లో బాలిక మిస్సింగ్ కేసు కూడా నమోదై ఉంది.

పెనమలూరులో కిడ్నాప్ కలకలం

- ఆర్థిక లావాదేవీలే కారణం..?

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఒక వ్యక్తి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. పోరంకి నారాయణపురం కాలనీకి చెందిన జే వెంకటేశ్వరరావు, నగరంలో ఉండే గాడి రాజులు వ్యాపార భాగస్వాములు. వీరి మధ్య కొంతకాలంగా గొడవలొచ్చాయి. బుధవారం రాజు తన మనుషులతో వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి చర్చించాడు. కుదరకపోవడంతో రాజు తన మనుషుతో వెంకటేశ్వరరావును కారులో ఎక్కించుకొని సత్యనారాయణపురానికి తీసుకెళ్లారు. ఈ ఘటన వెంకటేశ్వరరావు కుమార్తె దూండీప్రియ చూసింది. రాజు మనుషులు దూండీప్రియకు ఫోన్ చేసి మీ నాన్ని మాకు ఇవ్వాల్సిన డబ్బు కట్టి తీసుకెళ్లమని చెప్పారు. దీంతో అప్రమత్తమైన ఆమె పోలీసులను ఆశ్రయించింది. పెనమలూరు సీఐ వెంకటరమణ సిబ్బందితో ఎన్‌క్వైరీ చేయించగా వారు సత్యనారాయణపురంలో ఉన్నట్టు తేల్చారు. అక్కడి పోలీసులు, పెనమలూరు సిబ్బంది కారును ట్రేస్ చేసి కిడ్నాప్ కథకు ముగింపు పలికారు. కిడ్నాప్ చేసిన వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

ఆర్‌పీఎఫ్ సేవలు అద్వితీయం

- వార్షిక నివేదికను వెల్లడించిన డివిజినల్ రైల్వే అధికారులు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) 2024-25 మధ్యకాలంలో గణనీయమైన సేవలందించింది. ఈ మేరకు వార్షిక నివేదికను విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ మేరకు డివిజన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వల్లేశ్వర బీ తోకల, ఆర్‌పీఎఫ్ అధికారులను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారు. ఇదే పనితీరును మున్ముందు ప్రదర్శించి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆర్‌పీఎఫ్ సాధించిన ప్రగతిని పరిశీలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో దుర్భర పరిస్థితిలో ఉన్న 257 మంది పిల్లలను రక్షించింది. ఆపరేషన్ నన్హే ఫరిష్తాలో భాగంగా పిల్లలను రక్షించి సహాయం, రక్షణ కల్పించారు. మిషన్ రైలు సురక్షలో భాగంగా 104 మంది నేరస్థులను అరెస్టు చేసి రూ.674 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఏడాదిలో కేవలం రూ.499 లక్షలను మాత్రమే రికవరీ చేశారు. మిషన్ యాత్రి సురక్షలో ప్రయాణికుల భద్రతకు అగ్ర ప్రాధ్యన్యతను ఇచ్చారు. 85 దొంగతనాలకు సంబంధించి 54 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.64.70 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని తిరిగి వాటి యజమానులకు అప్పగించారు. ఆపరేషన్ నార్కోస్‌లో రూ.16.76 లక్షల విలువైన 336 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 28 మందిని అరెస్టు చేసి, 25 కేసులను నమోదు చేశారు. ఆపరేషన్ ఉపలబ్ధ్‌లో రిజర్వేషన్ టికెట్లను అక్రమంగా విక్రయించే ముఠాను పట్టుకున్నారు. 65 మందిని అరెస్టు చేసి వారి నుంచి 576 రిజర్వేషన్ టిక్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. 424 ఐఆర్‌సీటీసీ యూజర్ ఐడీలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే చట్ట ఉల్లంఘన కింద 17,988 కేసులను నమోదు చేసి ప్రయాణికుల్లో క్రమశిక్షణను రైల్వే చట్టాల అమలులోను బాధ్యత పెంచింది. పరిశుభ్రతకు కూడా ప్రత్యేక కార్యక్రమంగా తీసుకుని 1,898 కేసులు నమోదు చేశారు. పొగాకు చట్టం కింద 1,210 కేసులను నమోదు చేసి రూ.2,92,900 జరిమానా వసూలు చేశారు. రైల్వే ప్రాంగణాల్లో విచ్చలవిడిగా చెత్తను పారవేయటం, ధూమపానం చేయటం వంటి వాటిని నిరోధించే క్రమంలో విస్తృత ప్రచారం చేశారు.

యజమాని ఇంటిలో దొంగతనం

- మహిళ అరెస్టు.. రూ.45 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి యజమాని లేని సమయంలో మారు తాళంతో తలుపులు తీసి ఇంటిలో భద్రపరచిన బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించిన మహిళ (పనిమనిషి)ను బుధవారం కృష్ణలంక పోలీసులు అరెస్టు చేసి మీడియా ముందు హాజరుపరిచారు. పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని పోలీసు అవుట్ పోస్టులో సౌత్ ఏసీపీ పవన్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఓ మెడికల్ కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న నరసింహమూర్తి భార్య, కుమారుడితో కలిసి కృష్ణలంక బాలాజీనగర్, పాత ఆంజనేయస్వామి గుడి రోడ్డులో ఉంటున్నాడు. అతడి ఇంటిలో బాలాజీనగర్‌కు చెందిన కఠారి భవాని పనిమనిషిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో మార్చి 30న భార్య కుమారుడు షిర్డీ వెళ్లగా నరసింహమూర్తి డ్యూటీ నిమిత్తం శ్రీకాకుళం వెళ్లాడు. బుధవారం ఉదయం భార్య, కుమారుడు తిరిగి రాగా ఇంటిలోని సుమారు రూ.45 లక్షల విలువైన 625 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. నరసింహమూర్తి కుమారుడు చైతన్య ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 326 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితురాలిని గుర్తించారు. నరసింహమూర్తి ఇంటిలో పనిచేస్తున్న కఠారి భవానీ దొంగతనానికి పాల్పడిందని నిర్ధారించుకుని ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. మారు తాళంతో దొంగిలించినట్టు చెప్పగా నిందితురాలి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ట్రైనీ ఏసీపీ పావని, కృష్ణలంక సీఐ నాగరాజు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొడాలి నానీకి బైపాస్ సర్జరీ సక్సెస్

గుడివాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నానికి బైపాస్ సర్జరీ సక్సెస్ అయిందని ఆయన సన్నిహితులు తెలిపారు. బుధవారం ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో చీఫ్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృత్వంలో నిర్వహించిన సర్జరీ సక్సెస్ అయింది. సుమారు 8 గంటల పాటు వైద్యులు సుదీర్ఘంగా సర్జరీలో పాల్గొన్నారు. ప్రస్తుతం నాని వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వారు పేర్కొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న బెజవాడ బార్ ఈసీ మెంబర్లు

'బార్' కార్యవర్గసభ్యుల ప్రమాణం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్‌లో నూతనంగా నియమితులైన 25మంది ఈసీ మెంబర్లు, నూతన కార్యవర్గసభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో సీనియర్ న్యాయవాదుల కేటగిరిలో పడవల ఏడుకొండలు, దిగువ కేటగిరికి చెందిన న్యాయవాదుల్లో కాళహస్తి పద్మజ, జి. జయలక్ష్మి, స్వామి, జేవీ కార్తీక్‌బాబు, జంగా జయలక్ష్మి తదితరులున్నారు. వీరితో పాటు బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కె.బాషా, జనరల్ సెక్రటరీ కె.వి.రంగారావు, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ జీవీ లక్ష్మీ, ట్రెజరర్ ఎం.సత్యనారాయణ, లైబ్రేరియన్ సెక్రటరీ కె.త్రినాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ రవిబాబు, మహిళా సెక్రటరీ కె.అనురాధ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ ప్రెసిడెంట్ చిదంబరం, అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ సాయిప్రతాప్, బార్ కౌన్సిల్ మెంబర్లు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, సంపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కన్నతండ్రి కర్కశత్వం

- కుమారుడిపై దాడి.. పోలీసులను ఆశ్రయించిన తల్లి

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాను చెప్పినట్టు వినడంలేదని ఓ తండ్రి సొంత కుమారుడిని బలమయిన కర్రతో దాడి చేయడంతో 6వ తరగతి చదువుతున్న ఒక బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో తల్లి శంషాద్ పెనమలూరు పోలీసులను ఆశ్రయించింది. కానూరు సనత్‌నగర్‌కు చెందిన మస్తాన్, శంషాద్ భార్యాభర్తలు. వారికిద్దరు మగపిల్లలు. చిన్న కుమారుడు పర్హాన్ దగ్గర్లోని పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో ఆడుకోవడానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అంతకు ముందు ఎక్కడికీ వెళ్లవద్దని కుమారుడికి చెప్పి వెళ్లిన తండ్రి మస్తాన్ తన మాట వినలేదనే కోపంతో బలమైన కర్రతో చావబాదాడు. దీంతో బాలుడికి మణికట్టు, చేతిభుజంపై వాతలు తేలాయి. దీంతో కడుపు రగిలిపోయిన తల్లి తన కుమారుడిని, బంధువులను తీసుకొని పోలీసులను ఆశ్రయించింది. గతేడాదీ ఇలాగే కొడుకును చావబాదాడని తల్లి కన్నీరుమున్నీరైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ



చందర్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి సీఎం వస్తున్న విషయం విదితమే. ఈక్రమంలో బుధవారం ముప్పాళ్లలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ముప్పాళ్ల గ్రామానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలకు అమలౌతున్న పథకాలను తెలుసుకున్నారు. వ్యవసాయం, హార్టికల్చర్, విద్య, వైద్యశాఖలపై నిశిత పరిశీలన చేశారు. గ్రామంలో పాడి గేదెల సంఖ్య, పాల దిగుబడి, ఆదాయ వివరాలు తెలుసుకున్నారు. పర్యటన ఆద్యంతం అన్ని కేటగిరీల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 స్టాల్స్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తించిన పీ4 లబ్ధిదారులకు ఆదాయం ఎలా పెంచాలన్న అంశంపై సమీక్ష జరపాలన్నారు. సీఎం నేరుగా ప్రజలతో మాట్లాడి దరఖాస్తులు స్వీకరిస్తార న్నారు. ఈ ప్రజాదర్బార్ వద్ద అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, ఏసీపీ ఏబీజీ తిలక్, డీపీవో లావణ్యకుమారి, సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస శిరోమణి, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ముప్పాళ్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు రాకకు ముప్పాళ్ల గ్రామం ముస్తాబవుతోంది. గ్రామంలో రోడ్ల వెంట చెత్తచెదారం ఎత్తివేయడంతో పాటు కంప చెట్లు కొట్టి వేస్తున్నారు. రహదారులతో పాటు అంతర్గత రోడ్లను సుందరీకరిస్తున్నారు. ఎస్కవేటర్ల, డోజర్ల సాయంతో రోడ్లన్నీ శుభ్రపరుస్తున్నారు. బుధవారం ఉదయం నుంచే కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తున్నారు. తమ అభిమాన నేత తొలిసారి ముప్పాళ్ల వస్తుండడంతో కూటమి నేతలతోపాటు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుత్తవారిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డులోని వ్యవసాయ భూమిని శరవేగంగా చదును చేస్తున్నారు. అధికారులతో పాటు స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద సీఎం చంద్రబాబు రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

కేడీసీసీబీ టర్నోవర్ రూ.11,307.14 కోట్లు

- చైర్‌పర్సన్, జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ (కేడీసీసీబీ) వ్యాపారంలో ముందుకు సాగుతోందని కేడీసీసీబీ చైర్‌పర్సన్, జేసీ గీతాంజలిశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో బ్యాంకు షేర్ క్యాపిటల్‌ను రూ.370.70 కోట్ల నుంచి రూ.418.50 కోట్లకు పెంచినట్టు తెలిపారు. డిపాజిట్ల సేకరణ రూ.3,094.40 కోట్ల నుంచి రూ.3,265.94 కోట్లకు చేరిందన్నారు. గత ఏడాది రూ.170.79 కోట్లు పెరిగిందన్నారు. కేడీసీసీబీ ద్వారా పంటరుణాలతో పాటు వివిధ రకాల రుణాలు రూ.7,955.42 కోట్ల నుంచి రూ. 8,041.94 కోట్లకు పెంచడం జరిగిందన్నారు. మొత్తంగా బ్యాంకు టర్నోవరు రూ.11,049.82 కోట్లనుంచి రూ.11,307.14 కోట్లకు చేరిందన్నారు. జిల్లాలోని 425 పీఎసీఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తున్నామని, ఇప్పటికి 314 పీఎసీఎస్‌లు పూర్తయ్యాయన్నారు. కేడీసీసీబీలో 66 మంది స్టాఫ్ అసిస్టెంట్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని, త్వరలో ఐబీపీఎస్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామన్నారు. 2024 నవంబరు 26న ఢిల్లీలో జరిగిన సదస్సులో కేంద్రహోం, సహకారశాఖల మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా కేడీసీసీబీ బెస్ట్ పెర్ఫార్మింగ్ బ్యాంకు అవార్డును అందుకుందన్నారు. బ్యాంకు లాభాల నుంచి 6శాతం డివిడెంట్‌ను ఏటా పీఎసీఎస్‌లకు ఇస్తున్నట్టు జేసీ తెలిపారు.

వృక్షంపై కక్ష కత్తి..!


- ఆర్ అండ్ బీ బంగ్లాలో చెట్లను నరికివేయించిన అధికారులు



జగ్గయ్యపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వృక్షో రక్షితః రక్షితః అంటూ మైకుల్లో ఉపన్యాసాలిచ్చే అధికారులు వాస్తవంలో మాత్రం వృక్షాలపై కత్తి పెడుతున్నారు. పట్టణంలోని ఆర్అండ్ బీ బంగ్లాలో పురాతన చెట్లను నరికివేయటం విమర్శల పాలైంది. 80, 90 ఏళ్లున్న చెట్లను ఎందుకు కొట్టి వేయించారో అంతు పట్టకుండా ఉంది. ఈ చెట్ల వల్ల ఇబ్బంది లేదని, ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉన్న ప్రాంతం కావటంతో ఆ చెట్ల నీడన ప్రజలు సేద తీరేవారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల మార్జిన్లలో చెట్లను ఇష్టానుసారంగా కొడుతున్నా పట్టించుకోని అధికారులు ఆర్ అండ్ బీ కార్యాలయం, బంగ్లా ప్రాంగణంలోని చెట్లను తొలగించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ డీఈ పరశురాం వివరణ కోరగా తాను సీఎం ముప్పాళ్ల పర్యటనలో బిజీగా ఉన్నానన్నారు.

హామీలు నెరవేర్చకుంటే మరో ఉద్యమం

- నిరసనలో పలువురు నేతలు



ధర్నాలో పాల్గొన్న నేతలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర నేత నక్కా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. తక్షణమే 12వ పీఆర్సీకి చైర్మన్‌ను నియమించాలని అప్పటిలోగా ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్‌మ్యాప్ ప్రకటించాలన్నారు. ఏపీటీఎఫ్ మాజీ ప్రధానకార్యదర్శి పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే మరో బీఆర్టీఎస్ రోడ్డు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ అలవాల సుందరయ్య మాట్లాడుతూ 2022 నుంచి పెండింగ్‌లోని సరెండర్ లీవ్ బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులకు నిధులు విడుదల చేయాలన్నారు. ప్రధానకార్యదర్శి ఇంటి రాజు మాట్లాడుతూ 2004కు ముందు నియమాకాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నేత నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 3 ఏప్రిల్ 2025

తరచి చూస్తే మన చుట్టూ అనేక అవకాశాలు ఉంటాయి. వాటిని అందిపుచ్చుకుంటే.. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించటమే కాదు.. ఇతరులకు సాయం చేయటానికి వీలవుతుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన **దీపాలి ముర్మా** కథ కూడా ఇదే.. దీపాలి తన చుట్టూ పక్కల ఉచితంగా దొరికే సబాయి గడ్డితో పర్యావరణహితమైన గృహఅలంకారాలను చేసి విక్రయించటం ప్రారంభించింది. తనలాంటి అనేక మంది గిరిజన మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తోంది. దీపాలి ప్రస్థానం ఆమె మాటల్లోనే...

మన చుట్టూ చూస్తే అవకాశాలెన్నో!



"నేను పదోతరగతి వరకు చదువుకున్నాను. నాకు చిన్నతనంలోనే వివాహమైంది. నా భర్త తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసేవాడు. గట్ల మీద సబాయి గడ్డిని పండించేవాడు. సబాయి గడ్డి చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా ఈ గడ్డితో తాళ్లను పేనుతారు. నా భర్త చేసే వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం మా కుటుంబానికి సరిపోయేది కాదు. దాంతో నేను కూడా ఏదో ఒక పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించకపోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి. కానీ ఆ డబ్బులు సరిపోయేవి కావు. ఆ సమయంలో- నా కోసమే అన్నట్లుగా- యునెస్కో సంస్థ స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి- ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో సబాయి గడ్డిని ఉపయోగించి రకరకాల గృహాలంకరణ వస్తువులను తయారు చేయడం నేర్పించారు. జ్యూవెలరీ బాక్స్‌లు, బుట్టలు, హ్యాంగింగ్ ప్లాంటర్లు, వాల్ మౌంటెడ్ సొల్వర్లు, ఫ్లవర్ వాజ్‌లు, పళ్లాలు వంటివి తయారుచేయటం ఎలాగో నేర్పించారు. వాటిపై అందమైన పువ్వులు, పక్షులు, జంతువుల బొమ్మలు కుట్టడం నేర్పారు.

> నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించక పోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి.



రకరకాలు...

ఈ ప్రకృతిలో ప్రతి వస్తువు మనకు పనికి వస్తుంది. మనం వాటిని గుర్తించి ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించాలంతే! సబాయి గడ్డి చూడటానికి గరుకుగా ఉన్నా- దానితో రకరకాల వస్తువులు తయారుచేయవచ్చు. మా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు వేటిని ఇష్టపడతారో గమనించి- ఆ వస్తువులు తయారుచేయటం మొదలుపెట్టా. ఈ ప్రయాణ ప్రారంభంలోనే- ఎదురయిన తొలి సవాల్- తగినంత సబాయి గడ్డి దొరకకపోవటం. మా పొలంలో పండిన గడ్డి- ఎక్కువ వస్తువులకు సరిపోయేది కాదు. దాంతో ఇతరుల నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చేది. గడ్డితో పాటుగా సహజసిద్ధమైన రంగులను కూడా కొని తయారు చేసిన వస్తువులపై బొమ్మలు వేసేదాన్ని. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సబాయి గడ్డితో చేసే వస్తువుల తయారీకి చాలా ఎక్కువ సమయం పడుతుంది. ఉదాహరణకు ఒక అందమైన బుట్ట అల్లాలంటే 40 గంటల దాకా పడుతుంది. దాంతో నేను ఎదగాలంటే ఎక్కువ మంది పనివారు అవసరమవుతారని అర్థమయింది. ఆ లోపులో నేను తయారుచేసిన వస్తువులకు గిరాకీ పెరిగింది. దాంతో మా గ్రామంలోనే ఉన్న కొద్ది మంది మహిళలకు ఉపాధి కల్పించాను. ప్రస్తుతం నా దగ్గర 50 మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరందరూ నెలకు 600 దాకా రకరకాల వస్తువులు తయారుచేస్తూ ఉంటారు. వీటిని దేశంలో వివిధ నగరాల్లో జరిగే కళాప్రదర్శనలలో ఉంచుతాము. గత ఏడాది కొపెన్‌హెగెన్‌లో జరిగిన ఒక ఉత్సవంలో కూడా పాల్గొన్నాం. ఒకప్పుడు నెలకు 1500 సంపాదించటానికి కష్టపడిన నేను ప్రస్తుతం ఏడాదికి కొన్ని లక్షలు సంపాదిస్తున్నా! దీనికి ప్రధానమైన ముడివస్తువు గడ్డే! అనేక ప్రాంతాల్లో ఉచితంగా దొరికే ఈ గడ్డితో అందరూ వస్తువులు తయారుచేయవచ్చు. సంపాదించుకోవచ్చు. దీనికి నేనే ఉదాహరణ. నా ఉదాహరణ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నా!".

పిల్లల లంచ్‌బాక్స్‌లో ఇవి వద్దు...

పిల్లలకు ఇష్టమని లంచ్‌బాక్స్‌లో రకరకాల చాక్లెట్లు, చిప్స్ పెడుతూ ఉంటారు చాలామంది తల్లులు. వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లల లంచ్‌బాక్స్‌లో ఏవి పెట్టకూడదో తెలుసుకుందాం.

- **పళ్ల రసాల ప్యాకెట్లు:** నిమ్మ, నారింజ, దానిమ్మ లాంటి రకరకాల పళ్ల రసాల ప్యాకెట్లు ప్రస్తుతం బజార్లో దొరుకుతున్నాయి. చాలామంది ఇవి ఆరోగ్యానికి మంచివనే ఉద్దేశంతో వీటిని కొని పిల్లల లంచ్‌బాక్స్‌లో పెట్టేస్తుంటారు. వీటిలో అధిక మొత్తంలో చక్కెరలు ఉంటాయి. ఎక్కువకాలం నిల్వ ఉండడం కోసం రసాయనాలు కూడా కలుపుతుంటారు. వీటివల్ల పిల్లల్లో స్థూల కాయం, దంత సమస్యలు ఏర్పడవచ్చు. ఇలాంటి పాకెట్లను లంచ్‌బాక్స్‌లో పెట్టకూడదు.
- **డ్రైఫ్రూట్ చాక్లెట్లు:** కాజు, బాదం, పిస్తా లాంటి నట్స్, డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ వీటితో తయారు చేసిన చాక్లెట్లలో కృత్రిమ రంగులు, అధిక పరిమాణంలో చక్కెర, ఇతర కొవ్వు పదార్థాలు కూడా కలుపుతారు. వీటిని తినడం వల్ల పిల్లలకు జీర్ణ సమస్యలు వస్తాయి. తరచూ ఇలాంటి చాక్లెట్లని పిల్లలకు ఇవ్వకూడదు.
- **సాల్ట్ బిస్కెట్స్, చిప్స్:** వీటిలో పిల్లలకు అవసరమైనదానికంటే ఎక్కువ పరిమాణంలో ఉప్పు ఉంటుంది. వీటిని తిన డం వల్ల పిల్లల ఆరోగ్యం పాడవుతుంది.
- **పేస్ట్రీలు, రస్కులు:** వీటిని సాధారణంగా మైదాతో తయారు చేస్తూ ఉంటారు. ఇది పిల్లల ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో కూడా అధికంగా చక్కెర, కొవ్వు



పదార్థాలు ఉంటాయి. వీటివల్ల పిల్లలకు మధుమేహం లాంటి సమస్యలు రావచ్చు.

- **పిజ్జా, బర్గర్:** వీటిలో పోషకాలకు బదులు అధిక మొత్తంలో క్యాలరీలు, శాచురేటెడ్ కొవ్వులు, సోడియం లాంటివి ఉంటాయి. వీటివల్ల పిల్లలకు టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది.

సెలెబ్ టాక్

కెరీర్ రాకెట్‌లా దూసుకుపోయే సమయంలో బిడ్డను కనడానికి ఏ మహిళకైనా కాస్త తటపటాయిస్తుంది. ఎన్నో అపరాధ భావనలు, భయాలు వాళ్లను వేధిస్తాయి. సినీనటులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. బాలీవుడ్ అగ్రతార **దీపిక పదుకొనె** తానెదుర్కొన్న 'మామ్ గిల్ట్' గురించి, దాన్ని అధిగమించిన వైనం గురించి ఇలా వివరిస్తోంది.



కొత్త తల్లులు గిల్ట్ లేకుండా..

బిడ్డ 'దువా'ను కన్న తర్వాత, రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన దీపిక, అబుదాబిలో గ్లోబల్ సమిట్‌కు హాజరైన సందర్భంలో, తన మాతృత్వ ప్రయాణం గురించీ, మాతృత్వం పట్ల తనకున్న దృక్పథం గురించి ఇలా వివరించింది. "మాతృత్వమన్నది అద్భుతమైన అనుభవం. ఇక నుంచి నేనెంచుకోబోయే సినిమాలు, పాత్రల మీద ఆ ప్రభావం పడుతుందనే విషయం నాకు తెలుసు. గర్భం దాల్చక ముందు నుంచే ఈ విషయం గురించి నేను స్పష్టతను ఏర్పరుచుకున్నాను. ప్రస్తుతం జీవితంలో నేనొక కీలకమైన దశలో ఉన్నాను. ఒక కొత్త తల్లిగా బిడ్డకు సమయాన్ని కేటాయిస్తూనే, నటిగా నా వృత్తికి న్యాయం చేకూర్చేలా సమయ నిర్వహణను కొనసాగించక తప్పదు. అలాగని బిడ్డకు దూరమైన ప్రతిసారీ అపరాధ భావనకు గురి కావలసిన అవసరం లేదని కూడా నేను భావిస్తున్నాను.

నిజానికి మాతృత్వం నన్నెంతో మార్చేసింది. నా ఆలోచనా విధానాలు, తీసుకునే నిర్ణయాలు బిడ్డే ప్రధానంగా సాగుతున్నాయి. నా ప్రాధామ్యాలు కూడా మారిపోయాయి. నా మనసులో పాప దువా ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటుంది. నిజానికి నా గూగుల్ సెర్చ్ మొత్తం పిల్లల పెంపకం చుట్టూరానే తిరుగుతూ ఉంటుంది. బిడ్డ పాలు కక్కడం ఎప్పటి నుంచి మానేస్తుంది, అందుకోసం తల్లులేం చేయాలి? లాంటి ప్రతి తల్లినీ వేధించే ప్రశ్నలే నన్ను కూడా వేధిస్తూ ఉంటాయి.

సెల్ఫ్ కేర్ అవసరం

తల్లి అయినంత మాత్రాన మన పూర్వపు బాధ్యతలకు స్వస్తి చెప్పవలసిన అవసరం లేదు. ఎలాంటి అపరాధ భావనకు గురి కాకుండా సెల్ఫ్ కేర్‌కు కూడా సమయం కేటాయిస్తూ ఉండాలి. మహిళలమైన మనం ఎన్నో పాత్రలు పోషిస్తూ ఉంటాం. ఆ పాత్రలకు పూర్తి న్యాయం చేయాలని పరితపిస్తూ ఉంటాం. అయితే ఆ క్రమంలో మనల్ని మనం నిర్లక్ష్యం చేసుకుంటూ ఉంటాం. నిజానికి మహిళలు వాళ్లకంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. మిగతా బాధ్యలకు నిర్లక్ష్యం చేయకుండా, వాటికి తగినంత సమయాన్ని కేటాయించినంత కాలం ఎలాంటి అపరాధ భావనకూ గురి కావలసిన అవసరం లేదని నా అభిప్రాయం. మహిళలు నిరంతరంగా ఏదో ఒక విషయం గురించి చింతిస్తూనే ఉంటారు. తల్లి బాధ్యతలకే ప్రాధాన్యమిస్తూ, మానసికోల్లాసాన్ని అందించి సేద తీర్చే సొంత పనులను వాయిదా వేస్తూ ఉంటారు. కానీ ఇది సరి కాదు. బిడ్డను ఆరోగ్యంగా పెంచాలంటే తల్లి కూడా ఆరోగ్యంగా ఉండాలి.

దశలవారీ ఒడిదొడుకులు

మహిళలకు భావోద్వేగాలు, కుంగుబాట్లు ఎక్కువ. వాటి మీద కూడా దృష్టి పెడుతూ ఉండాలి. ఒకానొక సమయంలో నేను కూడా మానసిక కుంగుబాటుకు లోనయ్యాను. ఆ అనుభవాన్ని బయటి ప్రపంచంతో పంచుకోవడం ద్వారా నా మనసును తేలిక పరుచుకున్నాను. నా భుజాల పైనుంచి పెద్ద భారం తొలగిపోయిన అనుభూతికి లోనయ్యాను. ఆ సమయంలో ఎవరో నన్ను అంచనా వేస్తారనే భయం లేకుండా ఎంతో పారదర్శకంగా వ్యవహరించాను. అత్యంత వ్యక్తిగతమైన విషయాన్నీ, నా జీవితాన్ని మలుపు తిప్పిన విషయాన్నీ అందరితో పంచుకోవడం నాకెంతో ముఖ్యమనిపించింది. ఇలా స్వీయ అనుభవాన్ని పంచుకోవడం ద్వారా ఏ ఒక్కరి జీవితాన్ని కాపాడగలిగినా నా ప్రయత్నం ఫలించినట్టేనని భావించాను. మహిళల జీవితంలో దశలవారీ ఒడిదొడుకులుంటాయనడానికి నా జీవితమే ఒక ఉదాహరణ. మానసిక కుంగుబాటును ధైర్యంగా ఎదుర్కోవడమే కాకుండా, ఆ సమస్య పట్ల అవగాహన పెంచగలిగాను. కొత్త తల్లులు లోనయ్యే అపరాధ భావనలను స్వయంగా అనుభవించాను కాబట్టే ఈ అంశం గురించి బహిరంగ చర్చ జరగవలసిన అవసరం ఉందని నేను దృఢంగా నమ్ముతున్నాను."

కౌన్సెలింగ్

ముడతలు పోవడానికి మార్గమిదే!

Q A

డాక్టర్! నా వయసు 35. ఈ మధ్య ముఖం మీద సన్నని గీతలు, ముడుతలు కనిపిస్తున్నాయి. ఫేస్ ప్యాక్స్, ఫేసియల్స్‌తో అంతగా ప్రయోజనం కనిపించడం లేదు. వీటిని వదిలించుకోవడంతో పాటు చర్మాన్ని బిగుతుగా మార్చే చికిత్సలేవైనా ఉన్నాయా?

- ఓ సోదరి, హైదరాబాద్



35 ఏళ్ల వయసు నుంచి ముఖం మీద గీతలు ఏర్పడడం సహజం. చర్మాన్ని బిగుతుగా ఉంచే చర్మం అడుగున కొల్లాజెన్ ఈ వయసు నుంచి తరిగిపోతూ ఉంటుంది. దీన్ని శరీరం స్వతఃసిద్ధంగా తయారు చేసుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. కాబట్టి చర్మం మీద సన్నని గీతలు, ముడతలు లాంటి వయసు పైబడే ఛాయలు కనిపించడం మొదలవుతుంది. ఇలాంటి సందర్భాల్లో కొల్లాజెన్ సప్లిమెంట్స్‌ను వాడుకోవచ్చు. ఇవి పౌడర్, ద్రవ రూపంలో ఉంటాయి. అయితే నిజానికి ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడతాయే తప్ప స్వచ్ఛమైన కొల్లాజెన్స్ కావు. వీటిని ఆహారంతో లేదా పానీయాలతో కలుపుకుని తీసుకోవచ్చు. ఇలా రోజుకు ఐదు గ్రాముల కొల్లాజెన్ తీసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న కొల్లాజెన్ సప్లిమెంట్స్ అన్నీ జంతు ఆధారితమైనవే! వృక్షసంబంధ కొల్లాజెన్లు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ కొల్లాజెన్ సప్లిమెంట్లలో అదనంగా జింక్, విటమిన్ సి కూడా ఉంటాయి కాబట్టి చర్మ పోషణకు కూడా ఇవి ఉపయోగపడతాయి. అలాగే కొల్లాజెన్ సప్లిమెంట్లు కేవలం చర్మానికే కాదు వెంట్రుకలకూ, కీళ్లకూ కూడా ఎంతో మేలు చేస్తాయి.

ఆహారం ద్వారా...

కొల్లాజెన్ సప్లిమెంట్లతో పాటు, చికెన్, చేపలు, గుడ్లు, బోన్ బ్రాత్, నట్స్, బెర్రీలు, వెల్లుల్లి, బీన్స్, బెల్ పెప్పర్స్ కూడా కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడతాయి. కాబట్టి వాటిని కూడా ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. వీటితో పాటు కొల్లాజెన్ పౌడర్‌ను 35 ఏళ్ల వయసు నుంచే తీసుకోవడం మొదలుపెట్టాలి. అలాగే ఈ పౌడర్లను కొన్ని నెలల పాటు వాడుకుని తర్వాత కొంత కాలం పాటు యాంటీఆక్సిడెంట్లు వాడుకోవచ్చు. లేదంటే ప్రతి రోజూ క్రమం తప్పకుండా 6 నెలల పాటు కొల్లాజెన్ పౌడర్లను వాడుకుని, ఆ తర్వాత వారానికి రెండు సార్లు చొప్పున వాడుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ఓవర్‌డోస్ సమస్యను అరికట్టవచ్చు. ఈ కొల్లాజెన్ పౌడర్లను 35 ఏళ్లు పైబడిన వాళ్లు కూడా వాడుకోవచ్చు.

డాక్టర్ స్వప్న ప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైదరాబాద్.

ఇలా చేస్తే ఇంట్లోకి బల్లులు రావు..!



సాధారణంగా కిటికీలు, వెంటిలేటర్ల నుంచి బల్లులు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. వీటిని సులువుగా బయటికి పంపేందుకు నిపుణులు ఈ చిట్కాలు చెబుతున్నారు.

- బల్లి ఉన్న గదిలో కొన్ని వెల్లుల్లి రెబ్బలు లేదా సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను ఓ గిన్నెలో వేసి ఉంచితే వాటి ఘాటుకి బల్లులు బయటికి వెళ్లిపోతాయి.
- గిన్నెలో పది నుంచి పన్నెండు మిరియాలు వేసి అవి మునిగే దాకా నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి బల్లులు ఉన్నచోట పిచికారీ చేస్తే బల్లులు వెళ్లిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, కొద్దిగా పొగాకు వేసి కొన్ని నీళ్ల చుక్కలు చల్లి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసి గది మూలల్లో ఉంచితే బల్లులు వెళ్లిపోతాయి. మళ్లీ రావు
- కలరా వుండలను ఇంట్లో అక్కడక్కడ ఉంచితే వాటి వాసనకు బల్లులు వెళ్లిపోతాయి.
- ఇంట్లో బూజులు లేకుండా తరచూ శుభ్రం చేసుకుంటూ ఉంటే బల్లులు రావు.

సాధారణంగా మనం రెస్టారెంట్‌కు వెళ్లి ఆర్డర్ చేసిన తర్వాత... రుచి నచ్చకపోతే ఆహార పదార్థాలు వదిలేస్తాం. కానీ కూర్గ్‌లో ఉన్న 'ది ఇబనీ వెల్‌నెస్ సెంటర్'లో అలా వదిలేస్తే ప్రతి పది గ్రాములకు వంద రూపాయల జరిమానా కట్టించుకుంటారు. కేవలం ఆహారమే కాదు.. ప్రకృతికి ఇబ్బంది కలిగించే ఏ చిన్న పనినీ చేయరు. పక్షులకు ఇబ్బంది అవుతుందని ఈ రిసార్ట్‌లో సెల్‌ఫోన్ టవర్స్ కూడా వేయలేదు. ఇలా పూర్తిగా ప్రకృతితో మమేకమైపోయిన ఈ రిసార్టు ఎండీ డాక్టర్ షెర్లిని 'నవ్య' పలకరించినప్పుడు అనేక విశేషాలు చెప్పుకొచ్చారు.



ప్రకృతిలో మమేకమై...

వాణిజ్యపరమైన ప్రాధాన్యత లేకుండా రిసార్టును, వెల్‌నెస్ సెంటర్‌ను నడపటం సాధ్యమా? 'ది ఇబనీ'ని ఎందుకు ప్రారంభించారు?

కూర్గ్ కాఫీ తోటలకు ప్రసిద్ధి. అయితే ఈ ప్రాంతంలో 'కొడగు' అనే తెగల వారు నివసిస్తూ ఉంటారు. వీరు ఇప్పటికీ ప్రకృతిని దేవతగా కొలుస్తారు. ప్రకృతికి విరుద్ధమైన ఏ పనిని చేయరు. కొడుగు భాషలో 'ఇబనీ' అంటే మంచు బిందువు అని అర్థం. మంచు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో మేము అనుసరించే విధానాలు అలాగే ఉంటాయి. మా దగ్గర ఉన్న అన్ని భవంతులకు కొడగు భాషలోని పేర్లే పెట్టాం. 2002లో మా నాన్నగారు 125 ఎకరాల ఈ ఎస్టేట్‌ను కొనుగోలు చేశారు. దానిలో మేము మాత్రమే నివసించేవాళ్లం. దీనిని అందరితోను ఎందుకు పంచుకోకూడదనే ఆలోచన వచ్చింది. అప్పుడు కొన్ని కాటేజీల మాదిరిగా రూమ్స్ కట్టించాం. 125 ఎకరాలలో 47 కాటేజీలు ఉంటాయి. అంటే ప్రతి కాటేజీకి సుమారు మూడు ఎకరాల కాఫీ తోటలు..అడవీ ప్రాంతం వస్తుంది. జాగ్రత్తగా గమనిస్తే తప్ప కాటేజీ ఉందనే విషయం కూడా ఎవరికి తెలియదు. మేము దీనిని నిర్మించిన సమయంలో ఒక్క పెద్ద చెట్టును కూడా కొట్టలేదు.

రిసార్టు చిన్నగా ఉంటే ఎక్కువ లాభాలు ఉండవు కదా...

మేము ఈ ప్రాజెక్టు ద్వారా డబ్బులు సంపాదించాలనుకోవటం లేదు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు మా వంతు కృషిని చేయాలనుకుంటున్నాం. దానితో పాటుగా పర్యాటకులకు స్వచ్ఛమైన ప్రకృతి అనుభూతిని అందించాలనేదే మా ఉద్దేశం. పర్యాటకులకు ఉదయానే వినిపించే పక్షుల పాటలు ఎప్పటికీ గుర్తుండిపోవాలి. గడియారాల అవసరం లేకుండా సూర్యుడి గమనం ద్వారా సమయం ఎంత అయిందో చెప్పే నైపుణ్యత రావాలి. ప్రశాంతమైన ప్రకృతిలో ఉన్నప్పుడు మన ఇంద్రియాలు చురుకుగా పనిచేస్తాయి. అప్పుడు మనలో కలిగే భావనలు వేరుగా ఉంటాయి. అంతే కాకుండా అతిథులకు మా వద్ద ఉన్న వందల రకాల చెట్ల జాతులు గురించి అవగాహన కలగాలి. అదే మా లక్ష్యం. దీని వెనక ఎలాంటి లాభాపేక్ష లేదు.

ఇంత స్వచ్ఛంగా నిర్వహించాలనుకున్నప్పుడు ఎదురయ్యే సవాళ్లు ఏమిటి?

రకరకాల సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. వాటి నుంచి మేము పాఠాలు.. గుణపాఠాలు నేర్చుకుంటూనే ఉంటాం. ఉదాహరణకు మేము ఏ పదార్థంలోను పంచదార వాడం. కాఫీ..టీ.. డిజర్ట్ అన్నింటిలోను బెల్లమే వాడతాం. ఇక మా దగ్గర ఆహారాన్ని వృథా చేయనివ్వం. ఎవరైనా అతిథులు ఆహారాన్ని వృథా చేస్తే - పది గ్రాములకు వంద రూపాయలు చెల్లించమంటాం. ఈ విషయం ముందే చెబుతాం. ఇలా జమ అయిన మొత్తానికి మరి కొంత కలిపి ఏడాదికి ఒక సారి స్వచ్ఛంద సంస్థలకు అందిస్తాం. అంతే కాదు. మా దగ్గర బుఫేలో కూడా ఒక సారి వంటలు వండం. అతిథుల సంఖ్య ఆధారంగా విడతల వారిగా ఆహారాన్ని వండుతాం. దీని వల్ల వృథా పూర్తిగా తగ్గిపోతుంది. ఈ విషయాలు కొందరికి నచ్చకపోవచ్చు. కానీ మా పద్ధతిలో పర్యావరణానికి, సమాజానికి మేలు చేసేవారు మా దగ్గరకు వస్తారు. కొందరు రాకపోవచ్చు. దీనికి కూడా మేము సిద్ధపడే ఉన్నాం. అంతే కాకుండా మేము పూర్తి పర్యావరణహితమైన పద్ధతులను అనుసరిస్తాం. మా దగ్గర ఎక్కడ ప్లాస్టిక్ కనిపించదు భవంతులు నిర్మించే సమయంలో ఒక్క చెట్టును కూడా కొట్టివేయలేదు. అంత దాకా ఎందుకు.. మా రిసార్ట్‌లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అంతంత మాత్రమే! సెల్‌ఫోన్ టవర్స్ పెడతామని అనేక మంది ముందుకు వచ్చారు. కానీ మేము అంగీకరించలేదు. ఎందుకంటే- మా దగ్గర సుమారు 75 రకాల పక్షులు కనిపిస్తూ ఉంటాయి. వీటిలో ఏడాదికి ఒక సారి వచ్చే వలస పక్షులు కూడా ఉన్నాయి. సెల్‌ఫోన్ టవర్స్ వెలువరించే తరంగాల వల్ల పిచుకలు వంటి అనేక పక్షులు చనిపోతాయి. అందువల్ల టవర్స్‌ను పెట్టడానికి అంగీకరించలేదు. దాంతో మా దగ్గరకు వచ్చే పర్యాటకులు వైఫై మీద ఆధారపడాల్సి ఉంటుంది.

ఆతిథ్యరంగంలో ఉన్నత స్థానాల్లో తక్కువ మంది మహిళలు ఉంటారు. మీ అనుభవాలేమిటి?

నాకు ఈ విషయంలో భిన్నమైన అభిప్రాయం ఉంది. నేను ఎప్పుడూ పురుషుల కన్నా తక్కువ అని అనుకోలేదు. అలాంటి ఆలోచనలు నాకు ఎప్పుడూ రావు. నా ఉద్దేశంలో పని బాగా చేయటం.. చేయలేకపోవటం అని మాత్రమే ఉంటాయి. కొన్ని ఉద్యోగాలకు స్త్రీ, పురుషులు ఇద్దరూ పోటీ పడుతూ ఉంటారు. ఎవరు బాగా పనిచేస్తే వారికి ఉద్యోగం ఇవ్వాలి తప్ప- స్త్రీలనే వివక్ష ఉండకూడదనేది నా అభిప్రాయం.

ఒక వైపు వ్యాపారం... మరో వైపు ఇల్లు... వీటి మధ్య బ్యాలెన్స్ ఎలా?


ఇల్లు... వ్యాపారం... ఈ రెండే తప్ప నాకు వేరే వ్యాపకాలు ఏమి లేవు. కొన్ని సార్లు ఈ రెండూ కలిసిపోతూ ఉంటాయి. బోర్డు రూమ్‌లో కూర్చుని ఇంట్లో పిల్లల కోసం పిజ్జాలు ఆర్డర్ చేసిన సందర్భాలున్నాయి. ఇదే విధంగా ఇంట్లో పిల్లలు- "బోర్డు రూమ్‌లో మాట్లాడినట్లు మాట్లాడుతున్నావు.." అని ఫిర్యాదు చేసిన రోజులు కూడా ఉన్నాయి. నా ఉద్దేశంలో మన ప్రాధమ్యాలు స్పష్టంగా తెలిస్తే.. వ్యాపారాన్ని, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయటంలో సమస్యలు ఉంటాయని అనుకోవటం లేదు.

• సివిఎల్ఎన్ ప్రసాద్

అంబానీకే మళ్లీ ఫోర్బ్స్ కిరీటం

రెండో స్థానంలో అదానీ.. సంపన్న మహిళ సావిత్రి జిందాల్

- ఫోర్బ్స్ జాబితాలో 205 మంది భారతీయులు
- అందులో 13 మంది తెలుగువారు
- అత్యధిక శ్రీమంతులున్న దేశాల్లో ఇండియాకు మూడో స్థానం



న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 205 మంది భారతీయులకు చోటు దక్కింది. గత ఏడాదితో పోలిస్తే మనోళ్ల సంఖ్య మరో ఐదు పెరిగింది. భారత కుబేరుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ 9,250 కోట్ల డాలర్ల (సుమారు రూ.7.91 లక్షల కోట్లు) సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. ఆసియాలో ఆయనే నం.1 కాగా ప్రపంచ లిస్ట్‌లో మాత్రం 18వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ 5,630 కోట్ల డాలర్ల (రూ.4.81 లక్షల కోట్లు) ఆస్తితో దేశంలో రెండో అత్యంత ధనికుడిగా ఉన్నారు. ప్రపంచ జాబితాలో ఆయనకు 28వ స్థానం దక్కింది. జిందాల్ గ్రూప్ ఛైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ 3,550 కోట్ల డాలర్ల (రూ.3.04 లక్షల కోట్లు) నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉన్నారు. అంతేకాదు, దేశంలో ఆమే అత్యంత సంపన్న మహిళ కూడా. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో సావిత్రి జిందాల్ 48వ స్థానంలో ఉన్నారు. హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ (3,450 కోట్ల డాలర్లు), సన్ ఫార్మా ఛైర్మన్ దిలీప్ సంఘ్వీ (2,490 కోట్ల డాలర్లు) వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నారు. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమారమంగళం బిర్లా, స్టీల్ టైకూన్ లక్ష్మీ మిట్టల్, డీమార్ట్ సూపర్ మార్కెట్ల అధిపతి రాధాకిషన్ దమానీ, డీఎల్ఎఫ్‌కు చెందిన కేపీ సింగ్ వరుసగా టాప్-10లోని మిగతా స్థానాలను దక్కించుకున్నారు.

మొత్తం సంపద రూ.80.46 లక్షల కోట్లు

ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలోని 205 మంది భారతీయుల మొత్తం సంపద 94,100 కోట్ల డాలర్లుగా (రూ.80.46 లక్షల కోట్లు) నమోదైంది. గత ఏడాది జాబితాలోని 200 మంది బిలియనీర్ల మొత్తం సంపద 95,400 కోట్ల డాలర్లతో పోలిస్తే గణనీయంగా తగ్గింది. గడిచిన ఏడాదిలో అంబానీ, అదానీల ఆస్తి భారీగా తరిగిపోవడం ఇందుకు ప్రధాన కారణం. కాగా, ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో అమెరికా (902 మంది), చైనా (516 మంది) తర్వాత మూడో స్థానం మనదే. ప్రపంచ బిలియనీర్లలో సగానికిపైగా ఈ మూడు దేశాల్లోనే ఉండటం గమనార్హం.

3,000 దాటిన ప్రపంచ కుబేరులు..

మొత్తం సంపద రూ.1,377 లక్షల కోట్లు

ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో ఈసారి 3,028 మందికి చోటు దక్కింది. వీరి సంఖ్య 3,000 దాటడం ఇదే తొలిసారి. గత ఏడాదితో పోలిస్తే 247 మంది పెరిగారు. ఈ ఏడాది జాబితాలోని బిలియనీర్ల మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి మొత్తం 16.1 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.1,377 లక్షల కోట్లు) చేరుకుంది.

తెలుగు సంపన్నుల్లో ఫార్మా వారే అధికం

భారత బిలియనీర్లలో 13 మంది తెలుగు వారు కూడా ఉన్నారు. అందులో దివీస్ ల్యాబ్స్ ఛైర్మన్ మురళి దివి 910 కోట్ల డాలర్ల (సుమారు రూ.77,805 కోట్లు) సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. హెటిరో గ్రూప్ అధిపతి పార్థసారధి రెడ్డి 380 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ఆ తర్వాత స్థానంలో ఉన్నారు. బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు చెందిన మహిమ దాట్ల 320 కోట్ల డాలర్ల ఆస్తితో తెలుగు రాష్ట్రాల్లోని సంపన్న మహిళగా నిలిచారు. తెలుగువారులో అత్యధికం ఫార్మా రంగానికి చెందినవారే కావడం విశేషం.



మస్క్ ప్రపంచ నం.1

ప్రపంచ కుబేరుల్లో టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ ఏఐ కంపెనీల అధిపతి ఎలాన్ మస్క్ తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. 34,200 కోట్ల డాలర్ల ఆస్తితో (రూ.29.24 లక్షల కోట్లు) మరోసారి ప్రపంచ నం.1గా నిలిచారు. మార్క్ జుకెర్‌బర్గ్ 21,600 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో 2వ స్థానాన్ని దక్కించుకున్నారు. అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకులు జెఫ్ బెజోస్ (21,500 కోట్ల డాలర్లు) మూడో స్థానంలో ఉన్నారు. ఒరాకిల్ సహ వ్యవస్థాపకులు లారీ ఎలిసన్ (19,200 కోట్ల డాలర్లు), లూయీ విట్టన్ గ్రూప్ ఛైర్మన్ బెర్నార్డ్ అర్నో కుటుంబం(17,800 కోట్ల డాలర్లు) వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నారు.

తెలుగు బిలియనీర్లు

ప్రపంచ ర్యాంక్	పేరు	ఆస్తి (బి. డాలర్లు)	కంపెనీ
323	మురళి దివి	9.1	దివీస్ లేబొరేటరీస్
948	బీ పార్థసారధి రెడ్డి	3.8	హెటిరో గ్రూప్
1141	మహిమ దాట్ల	3.2	బీ ఈ లిమిటెడ్
1219	జీఎం రావు	3	జీఎంఆర్ గ్రూప్
1265	ప్రతాప్ సీ రెడ్డి	2.9	అపోలో హాస్పిటల్స్
1305	పీపీ రామ్‌ప్రసాద్ రెడ్డి	2.8	అరబిందో ఫార్మా
1408	ఎం సత్యనారాయణ రెడ్డి	2.6	ఎంఎస్ఎన్ గ్రూప్
1513	జూపల్లి రామేశ్వర్ రావు	2.4	మై హోమ్ గ్రూప్
1688	పీ పిచ్చి రెడ్డి	2.1	మేఘా ఇంజనీరింగ్
1688	పీవీ కృష్ణా రెడ్డి	2.1	మేఘా ఇంజనీరింగ్
2233	జీవీ ప్రసాద్	1.5	డాక్టర్ రెడ్డీస్
2233	కే సతీశ్ రెడ్డి	1.5	డాక్టర్ రెడ్డీస్
2479	సుబ్బమ్మ జాస్తి	1.3	సువెన్ లైఫ్



ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా

న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థిక వేత్త పూనమ్ గుప్తాను ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఇందుకు ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల పాటు గుప్తా ఈ పదవిలో ఉంటారు. జనవరిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ డి పాత్రా పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పూనమ్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ఆర్థిక శాస్త్రంపై గట్టి పట్టు ఉన్న ఆమె ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుతో సహా పలు సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రధాని ఆర్థిక సలహా మండలిలోనూ ఆమె సభ్యురాలు.

తయారీ రంగం దూకుడు

న్యూఢిల్లీ: మార్చి నెలలో తయారీ రంగం కనివిని ఎరుగని వేగంతో దూసుకుపోయింది. కొత్త ఆర్డర్లు పెరగడంతో పాటు అందుకు అనుగుణంగా వస్తూత్పత్తి కూడా పెరగడంతో తయారీ రంగ సూచీ హెచ్‌ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ 58.1 పాయింట్లకు చేరింది. ఇది ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయి. ఫిబ్రవరిలో ఇది 14 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో మార్చి నెల పీఎంఐ అద్భుతమైన రికవరీ సాధించిందని విశ్లేషకులంటున్నారు. అంతర్జాతీయ ఆర్డర్లు కొంతమేరకు తగ్గినా దేశీయ ఆర్డర్లు గణనీయంగా పెరిగాయని వారన్నారు. ఈ సూచీ 50 పాయింట్ల కన్నా పైన ఉంటే వృద్ధిపథంలో ఉన్నదని సంకేతం. గత జూలై తర్వాత మొత్తం విక్రయాలు ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం.

యూకే ఫార్మా కంపెనీ లుపిన్ చేతికి

న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన రెనాసైన్స్ ఫార్మా కంపెనీని 1.23 కోట్ల పౌండ్లకు (రూ.135 కోట్లు) కొనుగోలు చేసినట్టు లుపిన్ ప్రకటించింది. ముంబై కేంద్రంగా పని చేస్తున్న లుపిన్‌కు అనుబంధ విభాగం అయిన లుపిన్ హెల్త్‌కేర్ (యూకే) లిమిటెడ్ ఈ కొనుగోలు చేసింది. దీని ప్రకారం రెనాసైన్స్ పూర్తిగా లుపిన్ యాజమాన్యంలోని సంస్థగా మారుతుంది. తదుపరి దశలో లుపిన్‌కు అనుబంధ కంపెనీగా ట్రేడవుతుందని తెలిపింది. చెవి నొప్పికి వినియోగించే సెఫాలోస్పోరిన్స్ బ్రాండెడ్ ఇంజెక్షన్ సరఫరా చేసే ఏకైక కంపెనీ రెనాసైన్స్. ఇది కాకుండా కార్డియో వాస్కులర్, మూత్రకోశ వ్యాధులకు కూడా రెనాసైన్స్ ఔషధాలు ఉత్పత్తి చేస్తుంది. ఈ కొనుగోలుతో తమ బ్రాండెడ్ ఔషధాల పోర్ట్‌ఫోలియో విస్తరణకు దోహదపడుతుందని లుపిన్ తెలిపింది.

సెన్సెక్స్ 593 పాయింట్లు అప్

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలను ప్రకటించనున్న నేపథ్యంలో క్రితం సెషన్‌లో భారీగా నష్టపోయిన ఈక్విటీ సూచీలు బుధవారం కాస్త కోలుకున్నాయి. బ్యాంకింగ్, వాహన, ఐటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వేల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో సెన్సెక్స్ 592.93 పాయింట్లు ఎగబాకి 76,617.44 వద్దకు చేరింది. నిఫ్టీ 166.65 పాయింట్ల లాభంతో 23,332.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.38 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం పెరిగాయి.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు గడువు జూలై 31

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) ఐపీఓను ప్రారంభించేందుకు గడువును సెబీ ఈ జూలై 31 వరకు పొడిగించింది. ఎన్ఎస్‌డీఎల్ రూ.3,000 కోట్ల ఐపీఓకు మార్కెట్ నియంత్రణ మండలి 2024 సెప్టెంబరులోనే ఆమోదం తెలిపింది. డిపాజిటరీ ఐపీఓకు వచ్చేందుకు ఇదివరకున్న గడువు ఈనెల 11తో ముగియనుంది.

యూపీఐ లావాదేవీల జోరు

2024 జూలై-డిసెంబరు మధ్య 42% వృద్ధి



న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపులు జోరందుకున్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో నమోదైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలే ఇందుకు ఉదాహరణ. ఈ కాలంలో దేశవ్యాప్తంగా 9,323 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. అంతకు ముందు ఆరు నెలలతో పోలిస్తే ఇది 42% ఎక్కువని వరల్డ్‌లైన్ సంస్థ తాజాగా విడుదల చేసిన తన 'ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ ఫర్ 2హెచ్, 2024'లో పేర్కొంది. లావాదేవీల సంఖ్య, లావాదేవీల విలువ పరంగా చూస్తే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలు 92-93% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో యూపీఐ చెల్లింపుల విలువ రూ.99.68 లక్షల కోట్ల నుంచి 31% వృద్ధితో రూ.130.19 లక్షల కోట్లకు చేరింది.

లిథియం ఉత్పత్తిలోకి కోల్ ఇండియా

న్యూఢిల్లీ: బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కీలకమైన లిథియం ఖనిజ ఉత్పత్తిలోకి ప్రవేశించాలని యోచిస్తోంది. కంపెనీ సీఎండీ పీఎం ప్రసాద్ ఈ విషయం వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ ఖనిజ నిక్షేపాలున్న కొన్ని బ్లాకులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అరుదైన లిథియం ఖనిజాన్ని విద్యుత్ వాహనాల బ్యాటరీలు, పవన విద్యుత్ టర్బైన్స్‌లో పెద్ద ఎత్తున వినియోగిస్తారు. మన దేశంలో ఈ ఖనిజ నిక్షేపాలు పెద్దగా లేవు. దీంతో మన దేశానికి చెందిన అనేక కంపెనీలు ఈ నిక్షేపాలు అధికంగా ఉన్న అర్జెంటీనా, చిలీ, ఆస్ట్రేలియావైపు చూస్తున్నాయి.

మార్చిలో తగ్గిన నియామకాలు

ముంబై: మార్చి నెలలో దేశంలో ఆఫీసు కొలువుల నియామకాలు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో ఈ నియామకాలు 1.4 శాతం తగ్గాయని నౌకరి.కామ్ తెలిపింది. హోలీ, రంజాన్ పండగలు ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. గత ఏడాది మార్చితో పోలిస్తే గత నెల రిటైల్ రంగంలో 13 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో 10 శాతం, ఎడ్యుకేషన్ రంగంలో 14 శాతం నియామకాలు తగ్గాయి. గత ఏడాది మార్చిలో ఐటీ రంగంలో నియామకాలు 16 శాతం పెరగ్గా, గత నెల మూడు శాతం పడిపోయాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	425
చిత్తూరు	520	విశాఖపట్నం	440
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	140
కరీంనగర్	146	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	117
కర్నూలు	146	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	122
గోదావరి	152		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	92,850 ▲	85,100 ▲	1,14,000 ▲
విజయవాడ	94,200 ▲	88,500 ▲	1,03,000 ▲
విశాఖపట్నం	89,320 ▲	81,880 ▲	99,930 ▼
రాజమండ్రి	92,840 ▲	85,100 ▲	1,03,100 ▼
ప్రొద్దుటూరు	93,350 ▲	85,880 ▲	1,01,200 ▲
ముంబై	91,000 ▼	83,350 ▼	99.540 ▼

ధీరజ్‌కు శాప్ ఛైర్మన్ హామీ

- ఆర్చర్‌తో మాట్లాడిన రవి నాయుడు
- నేడు సమస్య పరిష్కారమయ్యే చాన్స్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

విజయవాడ (స్పోర్ట్స్) : ఆర్చర్లు ధీరజ్, చికిత వీసా కష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పందించారు. అమెరికాలో జరిగే ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-1లో ఏపీ క్రీడాకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్గొనాలన్న ఉద్దేశంతో...బుధవారం క్రీడాకారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంటరీ స్పోర్ట్స్ కమిటీ మెంబర్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగితో క్రీడాకారులను ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడించారు. వీసా మంజూరులో సమస్యలను పరిష్కరించి వెంటనే క్రీడాకారులు వరల్డ్ కప్‌లో పాల్గొనే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని వారిని కోరినట్టు శాప్ ఛైర్మన్ తెలిపారు.



సంజూకి లైన్ క్లియర్

కీపింగ్ బాధ్యతలకు ఓకే

బెంగళూరు : ఐపీఎల్‌లో సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. అలాగే అతడు కీపింగ్ కూడా చేయనున్నాడు. ఈమేరకు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)నుంచి సంజూకి గ్రీన్ సిగ్నల్ లభించింది. గత ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్ సందర్భంగా జోఫ్రా ఆర్చర్ బంతి తగలడంతో శాంసన్ కుడి చూపుడు వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దాంతో అతడు ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఈ ఐపీఎల్‌లో ఇప్పటి వరకు రాజస్థాన్ ఆడిన మూడు మ్యాచ్‌లలో ఇంపాక్ట్ ఆటగాడిగానే సంజూ బరిలో దిగాడు. ఈనేపథ్యంలో రియాన్ పరాగ్ రాయల్స్‌కి సారథ్యం వహిస్తున్నాడు.

ప్రపంచ బాక్సింగ్ కప్ సెమీస్‌కు జదుమని

న్యూఢిల్లీ: భారత బాక్సర్ జదుమని సింగ్ బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 50 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో జదుమని 3-2తో ఎలిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)పై నెగ్గాడు. మిగతా భారత బాక్సర్లలో నరేందర్ బేర్వాల్ (+90 కి), నిఖిల్ దూబే (75 కి), జుగ్ను (85 కి) తమ ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై క్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు.

గుజరాత్ అదుర్స్

- మెరిసిన బట్లర్, సిరాజ్
- బెంగళూరు చిత్తు



బట్లర్ (73 నాటౌట్)



సిరాజ్ (3/19)

బెంగళూరు: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. డాషింగ్ బ్యాటర్ జోష్ బట్లర్ (39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 73 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిరాజ్ (3/19) విజృంభించడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 8 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ని చిత్తు చేసింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. లివింగ్‌స్టోన్ (54), జితేష్ శర్మ (33), టిమ్ డేవిడ్ (32) పోరాడారు. సాయి కిశోర్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లకు 170 పరుగులు చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (49) రాణించాడు. హాజెల్‌వుడ్, భువనేశ్వర్ చెరో వికెట్ దక్కించుకొన్నారు.

రాణించిన బ్యాటర్లు: బట్లర్ అర్ధ శతకంతో రాణించడంతో.. గుజరాత్ అలవోకగా నెగ్గింది. సుదర్శన్‌తో కలసి రెండో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన బట్లర్.. రూథర్‌ఫోర్డ్ (30 నాటౌట్)తో కలసి మూడో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జోడించాడు. దీంతో టైటాన్స్ మరో 13 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ఛేదనలో ఓపెనర్లు సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (14) తొలి వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. పవర్‌ప్లేలో గుజరాత్ 42/1 స్కోరు చేసింది. ఐదో ఓవర్లో గిల్ అవుటైన తర్వాత వచ్చిన బట్లర్ తొలుత ఆచితూచి ఆడినా తర్వాత చెలరేగిపోయాడు. అయితే, 13వ ఓవర్‌లో బంతి మార్చడంతో చాలెంజర్స్‌కు బ్రేక్ దక్కింది. అర్ధ శతకానికి పరుగు దూరంలో ఉన్న సుదర్శన్‌ను హాజెల్‌వుడ్ క్యాచవుట్ చేశాడు. కానీ, బట్లర్ 4,6తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మరో ఎండ్‌లో రూథర్‌ఫోర్డ్ కూడా ధాటిగా ఆడాడు. విజయానికి 18 బంతుల్లో 20 పరుగులు కావల్సి ఉండగా.. బట్లర్ మూడు సిక్స్‌లతో మ్యాచ్‌ను ముగించాడు.

చెలరేగిన సిరాజ్: సిరాజ్ నిప్పులు చెరగడంతో.. పవర్‌ప్లేలోనే మూడు టాపార్డర్ వికెట్లను కోల్పోయిన బెంగళూరు ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన బెంగళూరుకు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ కోహ్లీ (7)ని అర్షద్ క్యాచవుట్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో దేవ్‌దత్ పడిక్కళ్ (4)ను సిరాజ్ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. సిక్స్‌తో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14)ను కూడా సిరాజ్ పెవిలియన్ చేర్చడంతో.. ఆరు ఓవర్లకు బెంగళూరు 38/3తో కష్టాల్లో పడింది. కెప్టెన్ రజత్ పటీదార్ (12)ను ఇషాంత్ వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. ఈ దశలో లివింగ్‌స్టోన్‌కు జత కలసిన జితేష్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆర్‌సీబీ 73/4 స్కోరు చేసింది. కానీ, జితేష్‌ను కిశోర్ అవుట్ చేయడంతో.. ఐదో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన క్రునాల్ పాండ్యా (5)ను కూడా కిశోర్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు. అయితే, డెత్ ఓవర్లలో లివింగ్‌స్టోన్, డేవిడ్ ధాటిగా ఆడుతూ ఏడో వికెట్‌కు 24 బంతుల్లో 46 పరుగులు జోడించారు. రషీద్ వేసిన 18వ ఓవర్‌లో మూడు సిక్స్‌లు బాదిన లివింగ్‌స్టోన్ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. కానీ, ఆవెంటనే సిరాజ్ బౌలింగ్‌లో క్యాచవుట్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో డేవిడ్ రెండు ఫోర్లు, సిక్స్‌తో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు. మొత్తంగా చివరి 5 ఓవర్లలో బెంగళూరు 64 పరుగులు రాబట్టింది.

ఐపీఎల్‌లో నేడు — వేదిక కోల్‌కతా

కోల్‌కతా x హైదరాబాద్ రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
ముంబై	3	1	2	0	2	0.309
లఖ్‌నవూ	3	1	2	0	2	-0.150
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
కోల్‌కతా	3	1	2	0	2	-1.428

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) సిరాజ్ 14, కోహ్లీ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7, పడిక్కళ్ (బి) సిరాజ్ 4, పటీదార్ (ఎల్బీ) ఇషాంత్ 12, లివింగ్‌స్టోన్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 54, జితేశ్ (సి) తెవాటియా (బి) సాయి కిషోర్ 33, క్రునాల్ (సి అండ్ బి) సాయి కిషోర్ 5, టిమ్ డేవిడ్ (బి) ప్రసిద్ధ్ 32, భువనేశ్వర్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 169/8; వికెట్ల పతనం:** 1-8, 2-13, 3-35, 4-42, 5-94, 6-104, 7-150, 8-169. **బౌలింగ్:** సిరాజ్ 4-0-19-3, అర్షద్ 2-0-17-1, ప్రసిద్ధ్ 4-0-26-1, ఇషాంత్ 2-0-27-1, సాయి కిషోర్ 4-0-22-2, రషీద్ 4-0-54-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) ఇషాంత్ (బి) హాజెల్‌వుడ్ 49, గిల్ (సి) లివింగ్‌స్టోన్ (బి) భువనేశ్వర్ 14, బట్లర్ (నాటౌట్) 73, రూథర్‌ఫర్డ్ (నాటౌట్) 30, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.5 ఓవర్లలో 170/2; వికెట్ల పతనం:** 1-32, 2-107; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-23-1, హాజెల్‌వుడ్ 3.5-0-43-1, యశ్ 3-0-20-0, రసిఖ్ 3-0-35-0, క్రునాల్ 3-0-34-0, లివింగ్‌స్టోన్ 1-0-12-0.

స్పోర్ట్స్

గోయెంకా..మళ్లీ అదే తీరు!




లఖ్‌నవూ: గత సీజన్ ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నాటి కెప్టెన్ కేఎల్ రాహుల్‌కు ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా మైదానంలోనే క్లాస్ పీకడం పెద్ద దుమారం లేపింది. తాజాగా మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ ఓడిపోయింది. సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో సూపర్ జెయింట్స్‌కిది రెండో పరాజయం కావడం గమనార్హం. అలాగే కెప్టెన్ పంత్ బ్యాటుతోపాటు, సారథిగానూ విఫలమయ్యాడు. ఈనేపథ్యంలో..పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం గ్రౌండ్‌లోనే పంత్‌తో గోయెంకా మాట్లాడాడు. ఆ సందర్భంగా పంత్‌వైపు వేలు చూపుతూ సీరియస్‌గా ఏదో అనడం కనిపించింది. ఈ సీన్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ జరుగుతోంది.

వన్డే సిరీస్ కూడా కివీస్‌దే..

హామిల్టన్ : ఐదు టీ20ల సిరీస్‌ను 4-1తో గెలిచిన న్యూజిలాండ్..పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌నూ మరో మ్యాచ్ ఉండగానే సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో వన్డేలో 84 పరుగులతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత కివీస్ 50 ఓవర్లలో 292/8 స్కోరు చేసింది. కీపర్ మిచెల్ హే (99 నాటౌట్) ఒక్క పరుగుతో సెంచరీ మిస్సయ్యాడు. ఛేదనలో సీర్స్ (5/59) ధాటికి పాకిస్థాన్ 41.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది.

ముంబైకి బై.. గోవాకి జై!


యశస్వీ జైస్వాల్ అనూహ్య నిర్ణయం



ముంబై: యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. తన అంతర్జాతీయ కెరీర్‌కు పునాదులు వేసిన ముంబై జట్టును వీడనున్నాడు.. 2025-26 సీజన్ నుంచి దేశవాళీల్లో గోవాకి ఆడనున్నాడు. జాతీయ జట్టు మ్యాచ్‌లు లేకుంటే..23 ఏళ్ల జైస్వాల్ దేశవాళీల్లో గోవా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముంది.. వ్యక్తిగత కారణాలతోనే ముంబైని వీడాలని యశస్వీ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈమేరకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరుతూ ముంబై క్రికెట్ సంఘా(ఎంసీఏ)నికి అతడు లేఖ రాశాడు. దానిని ఆమోదిస్తూ ఎంసీఏ బుధవారం నిర్ణయం తీసుకుంది. జైస్వాల్ జమ్మూ కశ్మీర్‌తో గత జనవరిలో జరిగిన గ్రూప్-ఎ రంజీ లీగ్ మ్యాచ్‌లో ముంబైకి చివరిసారి ప్రాతినిధ్యం వహించాడు. ఆ మ్యాచ్‌లో అతడు 4, 26 పరుగులు చేశాడు. కాగా..ఆ మ్యాచ్‌లో ముంబై ఓడింది. 'జైస్వాల్ మా జట్టుకు ఆడాలని నిర్ణయించుకున్నాడు. అతడికి స్వాగతం' అని గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి షంబా దేశాయ్ అన్నాడు. ఇటీవలి కాలంలో అర్జున్ టెండూల్కర్, సిద్దేశ్ లాడ్ కూడా ముంబైని వీడి గోవా జట్టుకు వెళ్లడం గమనార్హం.

కారణం అదేనా?


ముంబై జట్టు యాజమాన్యంపై అసంతృప్తి కారణంగానే జైస్వాల్ గోవా వెళ్లాలన్న నిర్ణయానికి కారణమని సమాచారం. కశ్మీర్‌తో మ్యాచ్ సందర్భంగా జైస్వాల్, ముంబై జట్టు సీనియర్ ఆటగాడికి నడుమ గొడవ జరిగినట్టు తెలిసింది. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్ షాట్ ఎంపికను ఆ సీనియర్ ఆటగాడు ప్రశ్నించాడట. దాంతో యశస్వీ..తొలి ఇన్నింగ్స్‌లో ఆ సీనియర్ క్రికెటర్ షాట్ ఎంపికను ప్రస్తావించి అతడి ప్రశ్నను తిప్పికొట్టినట్టు తెలిసింది.



ముంబై జట్టును కొనుగోలు చేసిన సారా

ముంబై: సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ క్రికెట్ వ్యాపారంలోకి ప్రవేశించింది. గ్లోబల్ ఈ-క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జీఈపీఎల్)లో ముంబై ఫ్రాంచైజీని సారా కొనుగోలు చేసింది. గతేడాదే మొదలైన ఈ లీగ్ విజయవంతమైంది. దీంతో ఇప్పుడు రెండో సీజన్‌లో కొత్త జట్లను ఆహ్వానించారు. ఇందులో భాగంగా ముంబై జట్టును సారా కొనుక్కుంది. జీఈపీఎల్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-క్రికెట్ లీగ్. రియల్ క్రికెట్-24 అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై లీగ్ జరుగుతుంది. లీగ్ ఫైనల్ ఈ ఏడాది మే నెలలో జరగనుంది.

'నోట్ బుక్' సంబరాలు.. దిగ్వేష్‌కు జరిమానా



లఖ్‌నవూ: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీపై బీసీసీఐ కొరడా ఝుళిపించింది. అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతోపాటు రాఠీ ఖాతాలో ఓ డీ మెరిట్ పాయింట్ చేర్చారు. పంజాబ్‌తో మ్యాచ్‌లో ప్రియాన్షు ఆర్య అవుటైనప్పుడు ఓ లెటర్ రాస్తున్నట్టుగా దిగ్వేష్ తన చేతులతో అతిగా ప్రవర్తించాడు. వెంటనే ఫీల్డ్ అంపైర్ అతడిని వారించాడు. వెస్టిండీస్ పేసర్ కెస్రిక్ విలియమ్స్ కూడా ఇలాగే వికెట్ పడగొట్టినపుడు 'నోట్ బుక్' సెలబ్రేషన్స్ చేసుకొనే వాడు. 2019 ద్వైపాక్షిక సిరీస్‌లో కోహ్లీని అవుట్ చేసిన సమయంలో విలియమ్స్ ఇలాంటి సంబరాలే చేసుకొన్నాడు. కాగా, దిగ్వేష్ తీరును మాజీలు గవాస్కర్, కైఫ్ తప్పుబట్టారు.

బీసీలకు టీడీపీ రక్షణ కవచం

- బలహీన వర్గాలను ఊచకోత కోసిన వైఎస్ఆర్, జగన్
- యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారంలో మంత్రులు



చైర్మన్‌గా సంతకం చేస్తున్న నరసింహ యాదవ్, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత తదితరులు

విజయవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'బీసీలకు టీడీపీ రక్షణ కవచంగా ఉంది. ఆ వర్గాలకు గుర్తింపు తెచ్చింది నాడు ఎన్టీ రామారావు అయితే... ప్రస్తుతం సీఎం చంద్రబాబు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు' అని పలువురు మంత్రులు పేర్కొన్నారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ సంఘం అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జి.నరసింహ యాదవ్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, రామ్ ప్రసాద్ రెడ్డి, పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ... 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలహీనవర్గాలను ఊచకోత కోశారు. జగన్ 56 కార్పొరేషను పెట్టి పైసా కేటాయించకుండా బీసీలను మోసం చేశారు' అని అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, హత్యలు జరిగాయి. సీఎం చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో 8 మంది బీసీ మంత్రులు ఉన్నారు' అని తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.నరసింహ యాదవ్ మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గంతో పాటు బీసీ వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ల నారాయణ, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డి.రామారావు, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చైర్మన్ నరసింహ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.

రైల్లో దొంగలు పడ్డారు!



అల్లూరురోడ్డు స్టేషన్ సమీపంలోని ఘటనాస్థలిలో జీఆర్పీ డీఎస్పీ మురళీధర్, అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు! ప్రయాణికులు ఎదురు తిరగడంతో పరారయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లా అల్లూరు రోడ్ స్టేషన్ సమీపంలో సినిమా ఫక్కీలో జరిగిన సంఘటన ఇది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... అల్లూరు రోడ్డు స్టేషన్‌కు కిలో మీటరు దూరంలో... ఎగువ మార్గం హోం సిగ్నల్ వద్ద రైళ్లను ఆపి దోచుకునేందుకు దొంగలు మాస్టర్ ప్లాన్ వేశారు. దీనికోసం ఏకంగా సిగ్నల్ పని చేయకుండా సాంకేతిక సమస్యను సృష్టించారు. రైలు పట్టాల కట్‌పాయింట్ వద్ద నాణేలు పెట్టి రైలు సిగ్నల్ వ్యవస్థను డ్రాప్ చేశారు. అలాగే... సమీపంలో ఉండే సిగ్నల్ బోర్డులో వైర్లను కత్తిరించి సిగ్నల్‌ను హ్యాక్ చేశారు. మంగళవారం రాత్రి 11.10 గంటల ప్రాంతంతో హౌరా నుంచి బెంగళూరు వెళ్లే సూపర్ ఫాస్ట్ (12863) రైలును ఇలా ఆపేందుకు ప్రయత్నించారు. అప్పటికే... రైలు చాలా వేగంగా ప్రయాణిస్తోంది. సిగ్నల్ చూసి లోకో పైలట్ బ్రేకులు వేసినప్పటికీ... మూడు నిమిషాల తర్వాత అది అల్లూరు రోడ్డు స్టేషన్‌లో ఆగింది. 11.29 గంటలకు గ్రీన్ సిగ్నల్ పడటంతో హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ముందుకు కదిలింది. దీంతో దొంగల తొలిప్రయత్నం విఫలమైంది.

ఈసారి మరో రైలు...

దొంగలు సిగ్నల్ ట్యాంపర్ చేసిన అదే మార్గంలో... 40 నిమిషాల తర్వాత చండీగఢ్ - మధురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20494) వచ్చింది. 11.50 గంటల ప్రాంతంలో లోకో పైలట్ ఎల్లో సిగ్నల్‌ను గమనించి వెంటనే బ్రేకులు వేశారు. అంతకుముందు స్టేషన్‌లోనే స్లీపర్ కోచ్‌లలోకి ఇద్దరు దొంగలు ప్రయాణికుల్లాగా ఎక్కారు. మరో ముగ్గురు దొంగలు కింద ఉండి... సిగ్నల్ ట్యాంపర్ చేశారు. రైలు ఆగగానే... కింద ఉన్న దొంగలు లోపలికి ఎక్కారు. అప్పటికే లోపలున్న వాళ్లతో కలిసి ఎస్4, ఎస్5 కోచ్‌లలోని ప్రయాణికులపైనబడి... నగలు దోచుకునేందుకు ప్రయత్నించారు. రెండు బంగారు గొలుసులు, హ్యాండ్ బ్యాగ్‌లు లాక్కున్నారు. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. ఇతర బోగీల్లో ఉన్న ప్రయాణికులూ అప్రమత్తమయ్యారు. మూకుమ్మడిగా దొంగలపైకి తిరగబడ్డారు. ఈ పరిణామం ఊహించని దొంగలు... రైల్లోంచి దిగి పరుగులు తీశారు. అయినా వదలకుండా వెంటబడుతున్న ప్రయాణికులపై రాళ్లు రువ్వుతూ పారిపోయారు. మొత్తంగా 20 నిమిషాలపాటు ఈ బీభత్సం కొనసాగింది. దోపిడీ సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకు వివరాలు సేకరించారు. అప్పటికే రైళ్ల రాకపోకలు ఆలస్యం అవుతుండటంతో బాధితులు తమ గమ్యస్థానాల్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సొత్తు కోల్పోయిన ప్రయాణికులు పాండిచ్చేరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన మెడలోని పది గ్రాముల బంగారు గొలుసు, రూ.2500 నగదు, రెండు సెల్‌ఫోన్లు దోచుకుపోయినట్లు చండీగఢ్ నుంచి మధురైకి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న రమ్య అనే మహిళ ఫిర్యాదు చేశారు. అలాగే... తన దగ్గరి నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు దోచుకున్నట్లు మరో మహిళ పేర్కొన్నారు. తన బ్యాగ్ పోయినట్లు ఇంకొకరు ఫిర్యాదు చేశారు.

సీసీ కెమెరాల్లో 'దొంగలు'

ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముఠాలు ఇలాంటి దోపిడీకి పాల్పడతాయని పోలీసులు తెలిపారు. దోపిడీ చేయాలనుకున్న రైళ్లను, ప్రాంతాన్ని ముందే ఎంచుకుని, తమ వాహనాలను అక్కడే పెట్టుకుంటారు. కొందరు ప్రయాణికుల రూపంలో రైలు ఎక్కుతారు. మరికొందరు 'స్పాట్'లో ఉండి సిగ్నల్ ట్యాంపరింగ్‌కు పాల్పడతారు. రైలు ఆగగానే అందినకాడికి దోచుకుని వాహనాల్లో పారిపోతారు. అల్లూరు రోడ్డు స్టేషన్ వద్ద రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన ఒక బాక్స్‌లోని సీసీ కెమెరాల్లో ఇద్దరు దొంగల కదలికలు రికార్డయినట్లు తెలుస్తోంది. దొంగల ముఠా పక్కాప్లాన్ ప్రకారం దోపిడీకి పాల్పడినట్లు నెల్లూరు జీఆర్పీ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. రైల్వేశాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయన్నారు. కాగా... అల్లూరు రోడ్డు వద్ద గతంలోనూ రెండుసార్లు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లలో దోపిడీ యత్నానికి దుండగులు పాల్పడ్డారు.







చిత్రజ్యోతి

SINCE 1965

పాతబస్తీ నేపథ్యంలో



ప్రముఖ నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ తమ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మించనున్న 60వ చిత్రాన్ని ప్రకటించారు. 'రౌడీ బాయ్స్', 'లవ్ మీ' చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆశిష్ ఇందులో ప్రధాన పాత్రలో నటించనున్నారు. నూతన దర్శకుడు ఆదిత్యరావు గంగసాని తెరకెక్కించనున్నారు. హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్వరలోనే తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని ఖరారు చేసి షూటింగ్ ప్రారంభించనున్నారు.

ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్నా

కె.రాఘవేంద్రరావు



"దర్శకుడు వీఎన్ ఆదిత్య నా దగ్గర పనిచేయకపోయినా, ఆయనంటే చాలా ఇష్టం. స్టార్స్‌తోనే సినిమాలు చేయకుండా.. కొత్తవాళ్లకూ అవకాశం ఇస్తుంటాడు. అందుకే ఆయన దర్శకత్వం వహించిన 'ఫణి' చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. వీఎన్ ఆదిత్య తెరకెక్కిస్తున్న గ్లోబల్ థ్రిల్లర్ 'ఫణి'. మహేశ్ శ్రీరామ్, క్యాథరిన్ ట్రెస్సా జంటగా నటిస్తున్నారు. డాక్టర్ మీనాక్షీ అనిపిండి నిర్మిస్తున్నారు. బుధవారం జరిగిన మోషన్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో డా.మీనాక్షీ అనిపిండి మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రంగా మొదలై పెద్ద ప్రాజెక్ట్‌గా మారింది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అని చెప్పారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ "ఈ సినిమా చిత్రబృందం పడిన కష్టానికి ఫలితం. అన్ని రకాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం

నితిన్, భరత్



'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో తొలిసారి మెగాఫోన్ పట్టారు దర్శక ద్వయం నితిన్, భరత్. ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించింది. మైత్రీమూవీ మేకర్స్ విడుదల చేస్తోంది. ఈనెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా నితిన్ మాట్లాడుతూ "ప్రదీప్ చాలా కాలంగా తెలుసు. ఈ కథ చెప్పగానే ఆయనకు నచ్చింది. పవన్‌కల్యాణ్ నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమా పేరు ఈ ప్రాజెక్టుకు కచ్చితంగా సరిపోతుందనే తీసుకున్నాం. ఈ టైటిల్ మాకు పబ్లిసిటీ పరంగానూ సాయపడింది" అని అన్నారు. భరత్ మాట్లాడుతూ "ఈ సినిమా కథకు చాలా స్పాన్ ఉంది. సినిమాలో సందర్భానుసారంగా వచ్చే వినోదం ఎక్కువగా ఉంటుంది. ఈ సమ్మర్‌లో కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ అలరించి ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

ఆధ్యాత్మిక అనుభూతితో



భక్తి, జ్ఞానం ద్వారా మనిషిలో దైవత్వం నిండుతుందనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'శివాజ్ఞ'. సీనియర్ నటుడు భానుచందర్, హర్షిణి కీలకపాత్ర పోషించారు. శివపరమాత్మ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. 'శివాజ్ఞ' చిత్రం ప్రేక్షకులకు కొత్త ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది'అని యూనిట్ తెలిపింది. తొలి రోజు ఎంపిక చేసిన థియేటర్లలో ఉచిత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.

హాలీవుడ్ నటుడు వాల్ కిల్మర్ కన్నుమూత



ప్రముఖ హాలీవుడ్ నటుడు వాల్ కిల్మర్ (65) ఇక లేరు. 'బ్యాట్ మ్యాన్ ఫరెవర్, 'టాప్ గన్', 'ద డోర్స్' 'హీట్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న వాల్ కిల్మర్.. మంగళవారం న్యూమోనియా వ్యాధితో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, థియేటర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయనకు 1984లో విడుదలైన 'టాప్ సీక్రెట్' చిత్రం సినీ రంగప్రవేశానికి బాటలు వేసింది. 1986లో విడుదలైన 'టాప్ గన్' అనే చిత్రంలోని 'ఐస్‌మ్యాన్' పాత్ర ఆయనకు మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత 1991లో విడుదలైన 'ద డోర్స్' అనే చిత్రంలో 'జిమ్ మోరిసన్' పాత్రను పోషించి అందరినీ ఆకట్టుకున్నారు. 1995లో విడుదలైన 'బ్యాట్‌మ్యాన్ ఫరెవర్'లో బ్యాట్‌మ్యాన్‌గా ప్రేక్షకాదరణ పొందారు.

అలరించే ఎర్రచీర



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎర్రచీర: ద బిగినింగ్'. సుమన్ బాబు కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.వి. సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మిస్తున్నారు. రఘుబాబు, కమల్‌కామరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాత ఎన్.వి.వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "సినిమాలో గ్రాఫిక్స్‌కు అధిక ప్రాధాన్యం ఉంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే సినిమా ఇది" అని దర్శకుడు సుమన్‌బాబు చెప్పారు.



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబును ఆయన సోదరుడు చిరంజీవి తన సతీమణి సురేఖతో కలసి బుధవారం సత్కరించారు.

నిహారిక నిర్మాతగా



కమిటీ కుర్రోళ్లు చిత్రంతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్నారు నిహారికా కొణిదెల. తన నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై నిర్మించబోయే తదుపరి చిత్రాన్ని ఆమె బుధవారం ప్రకటించారు. ఇందులో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్నాడు. మానస శర్మ దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

ప్రతి పాత్ర ప్రత్యేకంగా



గూఢచారి సాహసాల నేపథ్యంలో అల్లుకున్న ఓ ఆసక్తికర కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'చైనా పీస్'. నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలు. అక్కి విశ్వనాథరెడ్డి దర్శకుడు. మూన్‌లైట్ డ్రీమ్స్ బేనర్ నిర్మిస్తోంది. కమల్ కామరాజు, రఘుబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. నిహాల్ కోధాటి పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. సీరియస్ లుక్‌లో నిహాల్ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ప్రతి పాత్రకు తనదైన ప్రత్యేకత ఉంటుందని యూనిట్ తెలిపింది. సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్, సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు.

వెంటాడే చిత్రం



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రం 'బ్లడ్ రోజస్'. రంజిత్‌రామ్, అప్సరరాణి జంటగా నటించారు. ఎంజీఆర్ దర్శకుడు. టీబీఆర్ సినీ క్రియేషన్స్ నిర్మించింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి సినిమా చేయాలనే ప్రయత్నం ఈ చిత్రంతో నెరవేరింది. ఈ నెల చివరి వారంలో 'బ్లడ్ రోజస్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అన్నారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను చాలాకాలం పాటు వెంటాడతాయి అని అప్సరరాణి చెప్పారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని రంజిత్‌రామ్ పేర్కొన్నారు.

ఏడు నెలలుగా మంచానికే పరిమితం

- వైద్యానికి రూ.2 లక్షలు ఖర్చవుతాయన్న వైద్యులు
- ఆరోగ్యశ్రీలో వైద్యానికి రేషన్ కార్డు కూడా లేదు
- దాతల సాయం కోసం పేద డ్రైవర్ ఎదురుచూపు


భార్య సాయంతో నిలుచున్న బాధితుడు వెంకటేశ్

కనగానపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అతడో దళిత నిరుపేద కారు డ్రైవర్. ఏడు నెలలుగా నడవలేక.. కనీసం లేచి నిలుచోలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కూలి పనులకు వెళ్తున్న భార్య.. మంచాన పడిన భర్తను, కూతురిని పోషిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన కె.వెంకటేశ్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆయనకు భార్య పద్మావతి, కూతురు మధుప్రియ ఉన్నారు. ఏడు నెలల కిందట వెంకటేశ్ కాళ్లకు వాపులు వచ్చి చచ్చుబడిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించినా నయం కాలేదు. తోటి డ్రైవర్లు అండగా నిలిచి.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పలు పరీక్షలు చేసిన వైద్యులు... వెన్నెముకలో గడ్డ ఉందని, ఆపరేషన్ చేయించుకుంటేనే ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు. రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని తెలిపారు. అంత డబ్బు ఖర్చుచేసే స్థోమత లేని ఆ కుటుంబం ఇంటికి వచ్చేసింది. నాటి నుంచి భర్త మంచంపై పడి ఉంటే.. భార్య అతడికి సేవలు చేస్తూ.. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. 'బతుకుతెరువు కోసం కారు కొన్నందుకు నాలుగేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం రేషన్ కార్డు తొలగించింది. బాడుగలు సరిగా లేకపోవడం, రేషన్ సరుకులు కూడా రాకపోవడంతో.. కారు అమ్మేశాం. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేస్తే మంజూరు కాలేదు. అది లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించదని చెబుతున్నార' అని ఆమె కంటతడి పెట్టుకున్నారు. దాతలు సాయం చేస్తే.. భర్తకు వైద్యం చేయించుకుంటానని చెప్పారు.

దాతలు సాయం చేయాల్సిన చిరునామా: కె.పద్మావతి, భర్త: కె.వెంకటేశ్.. బ్యాంకు ఖాతా నంబర్: 91162528096(ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు), ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఏపీజీబీ0001085, ఫోన్‌పే నంబర్: 7416153998.

నీట్, ఎన్టీఏ పరీక్షలపై రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నీట్, ఎన్టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీకి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, పలు శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సమన్వయ కమిటీలను నియమిస్తున్నట్లు ఉన్నత విద్యాశాఖ బుధవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.


రిలయన్స్ ప్లాంట్ భూమిపూజ సభకు హాజరైన అశేష జనం


రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్

సీబీజీ ప్లాంట్లతో వలసలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

పీసీపల్లి మండలం దివాకరపల్లి వద్ద రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్(సీబీజీ) ప్లాంట్‌కు బుధవారం మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. "యువగళం పాదయాత్రలో భాగంగా జి.డి.నెల్లూరు నియోజకవర్గంలోని ఓ గ్రామం వద్ద రోడ్డుపక్కన బొండాలు అమ్ముతున్న మహిళ సమస్యలను విన్నాను. తాగుబోతు భర్త చనిపోతే బొండాలు వేసి అమ్ముతూ ఇద్దరు బిడ్డలను చదివిస్తోంది. తన బిడ్డల లాంటి వారికి ఉద్యోగాలు కల్పించాలని కోరింది. యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టిపెట్టాలని ఆ రోజే నిర్ణయించుకున్నాను. ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రధానాంశంగా పెట్టాలని చంద్రబాబును కోరాను. ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే ఉద్యోగాల కల్పన కోసం పని ప్రారంభించాను. పెట్టుబడుల కోసం అనేక ప్రాంతాలకు వెళ్లాను.

రిలయన్స్ చూపు రాష్ట్రం వైపు

ధీరూభాయ్ అంబానీ కాలం నుంచి సీఎం చంద్రబాబుకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ కారణంతోనే రాష్ట్రం వైపు రిలయన్స్ సంస్థ చూస్తోంది. ఈక్రమంలోనే సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. వారి సూచన ప్రకారం రాష్ట్రంలో నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐస్) పాలసీ తీసుకువచ్చాం. రూ. 65 వేల కోట్ల పెట్టుబడులతో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ ఒప్పందం చేసుకుంది. వీటి ద్వారా 2.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రాంతంలో బీడు భూములను వారికి లీజుకు ఇస్తే ప్రభుత్వ భూములకు రూ. 15 వేలు, ప్రైవేటు భూములకు రూ. 30 వేలు కౌలు చెల్లించి నైపర్ గడ్డి పెంచుతారు. దాని ద్వారా గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. రైతులు గడ్డి పెంచి ఇస్తే వారు కొనుగోలు చేస్తారు. రాష్ట్రంలో 500 ప్లాంట్ల కోసం 5 లక్షల ఎకరాలు అవసరం.

ప్రకాశం, కడప, అనంతలకు ప్రాధాన్యం

ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల్లో సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తొలి ప్లాంట్‌ను అత్యంత వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నాం. తొలుత జిల్లాలో నాలుగు ప్లాంట్లు అనుకున్నాం. ఇక్కడి పరిస్థితులను బట్టి 50 వేల ఎకరాలు సమకూర్చుతామని స్థానిక ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సభాముఖంగా చెప్పారు. అలా అయితే ఒక్క కనిగిరి ప్రాంతంలోనే 50 ప్లాంట్లను ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని సీబీజీ ప్లాంట్ హబ్‌గా మార్చుతాం. దీని వల్ల ఉపాధి పెరిగి రైతులకు లాభం చేకూరి వలసలు నివారణ అవుతాయి. కొందరు ప్లాంట్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గతంలో 2014-19 మధ్య ఎంతో కష్టపడి అనేక కంపెనీలను రాష్ట్రానికి తెస్తే ఆ తర్వాత వైసీపీ పాలకులు పలు కంపెనీలను రాష్ట్రం నుంచి పారదోలారు. ఇప్పటికీ అభివృద్ధి పనులు, పారిశ్రామిక రంగంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అలాంటి ప్రచారాలు మానుకోకపోతే వారిని రెడ్‌బుక్‌లోకి ఎక్కిస్తా.

మన బ్రాండ్ సీబీఎన్..

ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన అంటే మాటలా.. ఎలా సాధ్యం, ఏమిటి నీ ధైర్యం అని అనేకమంది నన్ను అడిగారు. తెలంగాణకు హైదరాబాద్, తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు ఉంటే మా ఆంధ్రకు చంద్రబాబు (సీబీఎన్) ఉన్నారు. అదే మా బ్రాండ్, అదే మా ధైర్యం అని వారందరికీ సమాధానమిచ్చా. ఆ బ్రాండ్‌ను చూసే అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు వస్తున్నాయి. వాటిలో రిలయన్స్, ఎన్‌టీపీసీ, టీసీఎస్, టాటా పవర్, మిట్టల్ స్టీల్ వంటి దిగ్గజ కంపెనీలున్నాయి. రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు చేయడం అంటే సీబీఎన్ పీ4 విధానానికి నాంది వంటిది. వీటి ఏర్పాటు ద్వారా బీడు భూములను వినియోగంలోకి తీసుకురావడం, దాని వల్ల రైతులకు లీజు రూపంలో డబ్బు రావడం, స్థానికంగా యువతకు ఉద్యోగాలు రావడం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయి.

త్వరలోనే కనిగిరిలో ట్రిపుల్ ఐటీ

ప్రకాశం జిల్లా పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన జిల్లాలో లభించింది. అత్యంత వెనుకబడిన ప్రాంతాలు అధికంగా ఉండటంతో ఈ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నాం. త్వరలో కనిగిరిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. వెలిగొండను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేర్చింది. దాని నిర్మాణం పూర్తిచేసి చివరి ఎకరాకు కూడా నీరు ఇస్తాం. తాగునీటి ఇక్కట్లను తీర్చుతాం. కేంద్ర భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు సరిగా చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం నిధులు దోపిడీ చేస్తే అన్న పవన్ కల్యాణ్ కేంద్రంతో మాట్లాడి ఆ పథకం గడువును పొడిగించేలా చేశారు. ఆ పథకం ద్వారా ఇంటింటికి కుళాయితో నీరు ఇస్తాం" అని లోకేశ్ చెప్పారు.

50 వేల ఎకరాలు సమకూర్చుతా: ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉపాధి లేక కనిగిరి ప్రాంతవాసులు వలసలు వెళ్తున్నారని చెప్పారు. నీరు లేక, పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీబీజీ ప్లాంట్‌కు తమ నియోజకవర్గంలో రైతులను ఒప్పించి 50 వేల ఎకరాలు సమకూర్చే బాధ్యత తాను తీసుకుంటానని, వీలైనన్ని ఎక్కువ ప్లాంట్లను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, రిలయన్స్ డైరెక్టర్ పీఎస్ఎం ప్రసాద్, ఆ సంస్థ ప్రతినిధులు మాధవరావు, హెచ్‌కె త్రిపాఠిలతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తొలుత ప్లాంట్‌కు భూమిపూజ చేసిన అనంతరం.. ఆ ప్లాంట్ ఎలా ఉంటుంది?, ఎలా పని చేస్తుంది?, గడ్డిపెంపకం, గ్యాస్ వినియోగం తదితర అంశాలపై డెమోను మంత్రి లోకేశ్ తిలకించారు.

ఖాళీల భర్తీపై ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయలేం

- ఇది ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన వ్యవహారం: హైకోర్టు
- 2022 వరకు ఉన్న ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేశాం: ఏఏజీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇది పూర్తిగా ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన వ్యవహారమని పేర్కొంది. 2022 వరకు ఉన్న ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టులు అన్నింటినీ భర్తీ చేశామని, ఆతర్వాత ఏర్పడిన ఖాళీలను తదుపరి నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోందని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో పిల్‌పై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ విచారణను మూసివేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు చెందిన 246 ఎస్ఐ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఐటీడీఎస్ కార్యనిర్వాహక సభ్యుడు అనుముల వంశీకృష్ణ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపించారు.

పింఛను సొమ్ము.. క్యాసినోకు తగలేశాడు!

- పరారయిన సచివాలయ ఉద్యోగి అరెస్టు

కంచికచర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వృద్ధులు.. వికలాంగులు.. వితంతవులకు పంపిణీ చేయాల్సిన పింఛను సొమ్ముతో పరారైన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన సచివాలయ ఉద్యోగి తోట తరుణ్‌కుమార్.. ఆ డబ్బుతో క్యాసినో ఆడేశాడు. రూ.7.5 లక్షలతో పరారైన తరుణ్‌కుమార్.. డఫా బెట్టింగ్ యాప్‌లో క్యాసినో ఆడేసి డబ్బు మొత్తం పోగొట్టుకోగా.. అతడి వద్ద రూ.28 వేలు మాత్రమే మిగిలాయి. తరుణ్ కుమార్‌ను కంచికచర్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం ఎస్ఐ రాజు విలేకరులకు చెప్పారు. మంగళవారం రాత్రే అతడిని పెనుగొలనులోని ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద కేవలం రూ.28 వేలు మాత్రమే లభించాయని చెప్పారు. పింఛను లబ్ధిదారుల సొమ్ముతో సెల్‌ఫోన్‌లోని డఫా బెట్టింగ్ యాప్‌లో క్యాసినో ఆడినట్లు గుర్తించామన్నారు. తరుణ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

గిరిజన పాఠశాలల్లో వసతులకు 155 కోట్లు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల భవనాల అభివృద్ధికి రూ.155.97 కోట్లు మంజూరు చేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. తరగతి గదులు, హాస్టళ్ల భవనాలు, మరుగుదొడ్లు, స్టాఫ్ క్వార్టర్స్, ఫర్నిచర్ కొనుగోలు, భవనాల మరమ్మతులకు ఈ నిధులు ఖర్చు చేస్తారు.

6 గిరిజన ప్రాంతాల్లో మల్టీపర్పస్ మార్కెట్లు

రాష్ట్రంలోని ఆరు గిరిజన ప్రాంతాల్లో మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలను మంజూరు చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో మార్కెట్ కేంద్రానికి రూ.కోటి చొప్పున ఆరు కేంద్రాలకు రూ.6 కోట్లు ఖర్చు చేస్తారు. తురాయిపువలస, సాలూరు, పాడేరు, ఆకుమన్నిడి కోట, బుట్టాయిగూడెం, శ్రీశైలంలో ఈ మార్కెట్ కేంద్రాలను నిర్మించనున్నారు.

వ్యవసాయంలో సమాచార, యాజమాన్య వ్యవస్థ-2.0 ప్రారంభం

వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలకు ఉపయోగపడేలా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార, యాజమాన్య వ్యవస్థ-2.0 (ఏపీఏఐఎంఎస్-2)ను వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ప్రారంభించారు. బుధవారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అందించే అన్ని సేవల సమాచారాన్ని ఒకే గొడుకు కింద అందించే యాప్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు.

'తిరుమల' ఎంత భద్రం?

(మొదటి పేజీ తరువాయి)

సరిపోవని ఇలాంటి అనేక సంఘటనలు నిరూపిస్తున్నాయి.

అలిపిరి కీలకం

తిరుపతి నుంచి వాహనాల్లో తిరుమలకు చేరుకోవాలంటే అలిపిరి టోల్‌గేట్ నుంచే ప్రయాణించాలి. ఇక్కడ టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ, స్పెషల్ పోలీస్ ఫోర్స్, ఆర్మ్‌డ్ రిజర్వు, హోంగార్డులు, సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారు. టోల్‌గేట్‌లో వీఐపీలకు విడిగా మార్గం ఉన్నప్పటికీ వచ్చిందెవరో నిర్ధారించుకున్నాకే అనుమతిస్తారు. టీటీడీ ఉన్నతాధికారులు, వీవీఐపీలు కొద్దిమందికి మాత్రమే తనిఖీల నుంచి మినహాయింపు ఉంటుంది. వాహనాల తనిఖీకి, లగేజీ తనిఖీకి వేర్వేరుగా స్కానర్లతో పాటు యాత్రికుల తనిఖీకి మెటల్ డిటెక్టర్లు ఉన్నాయి. ఫ్రిస్కింగ్ (శరీరమంతా తడిమి తనిఖీ చేయడం) కూడా ఉంటుంది. మద్యం, మాంసం, మత్తు పదార్థాలు, హిందూయేతర మత చిహ్నాలు, వాటికి సంబంధించిన సాహిత్యం, మారణాయుధాలు, పేలుడు పదార్థాలు వంటివి కొండపైకి నిషేధం. తనిఖీల్లో వీటిని అడ్డుకుంటారు.

బాస్‌ల సేవల్లో పోలీసులు

పైకి పటిష్ఠ భద్రతా వ్యవస్థలా కనిపించినా ఇదంతా డొల్ల మాత్రమేనని తరచూ జరిగే ఘటనలు నిరూపిస్తూ ఉంటాయి. నిఘా, భద్రత విధులకన్నా ఎక్కువగా తమ శాఖకు చెందిన అధికారుల దర్శనాలు, వసతి సౌకర్యాల ఏర్పాట్లలోనే పోలీసు వ్యవస్థ మునిగి తేలుతూ ఉంటుందనేది వాస్తవం. ఆలయ సిబ్బందితో సత్సంబంధాలు పెట్టుకున్న పోలీసులు ఏళ్ల తరబడి తిరుమలలోనే పీఠం వేసుకుని ఉండిపోతుంటారు. చిన్నారులు అపహరణకు గురైన సందర్భాల్లో తప్ప ఈ శాఖ వేగంగా స్పందించిన సందర్భాలు తక్కువ.

ఒట్టి చేతులతో విజిలెన్స్

టీటీడీ విజిలెన్స్ విభాగంలో 2,300 మంది సిబ్బంది ఉన్నారు. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి సారథ్యంలో ఒక అదనపు సీవీఎస్వో, ముగ్గురు వీఎస్వోలు, ఆరుగురు ఏవీఎస్వోలు, 12 మంది విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు ఈ విభాగంలో ఉంటారు. తిరుమలలోనే మూడు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అదనపు ఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు సహా 125 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. అవాంఛనీయ వస్తువులు, వ్యక్తులను అలిపిరిలోనే అడ్డుకోవాల్సిన సిబ్బంది వద్ద కనీస ఆయుధాలు కూడా ఉండవు. కనీసం చేతిలో లాఠీ కూడా లేకుండా వీరు అవాంఛనీయ పరిస్థితులను ఎలా ఎదుర్కొంటారో టీటీడీ ఉన్నతాధికారులకే తెలియాలి. తిరుమలలో శ్రీవారి ఆలయం, భక్తుల భద్రతకు ఆక్టోపస్ బలగాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వారి పరిధి శ్రీవారి ఆలయం వరకే పరిమితం. అలిపిరి, శ్రీవారి మెట్టు నడకదారుల్లో గట్టి భద్రత లేదు.

భర్తీకాని సీవీఎస్వో పోస్టు

టీటీడీలో కీలకమైన నిఘా, భద్రతా విభాగాన్ని తక్షణం పటిష్ఠపరచాల్సిన అవసరం ఉంది. అవసరానికి తగినట్టుగా సిబ్బందిని పెంచడంతో పాటు ఆధునిక నిఘా పరికరాల వినియోగంలో శిక్షణ ఇవ్వాలి. ఈ విభాగానికి నేతృత్వం వహించే సీవీఎస్వో పోస్టు 3నెలలుగా ఇంచార్జీలతో నడుస్తోంది. జనవరి 8న జరిగిన తొక్కిసలాట ఘటనకు బాధ్యుడిని చేస్తూ ప్రభుత్వం అప్పటి సీవీఎస్వో శ్రీధర్‌ను బదిలీ చేసింది. చిత్తూరు ఎస్పీ చందోలు మణికంఠకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. చిత్తూరు నుంచి పర్యవేక్షణ సాధ్యం కాదని ఇటీవల తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజును పూర్తి అదనపు బాధ్యతలతో సీవీఎస్వోగా నియమించారు. బుధవారం టీటీడీపై జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. త్వరలో సీవీఎస్వోతోపాటు ఇతర కీలక అధికారుల నియామకం చేపడతామని వెల్లడించారు.

భద్రతా వైఫల్యానికి సాక్ష్యాలివిగో..

- గతేడాది తిరుమలలో ఏకంగా టీటీడీకి చెందిన బస్సును అపహరించి తీసుకువెళ్లారు. టోల్‌గేట్ మీదుగా దర్జాగా బస్సును నడుపుకుంటూ వెళ్లిపోయాడో దుండగుడు. నాయుడుపేట దగ్గరగానీ ఆ బస్సును గుర్తించి అడ్డుకోలేకపోయారు. టీటీడీకి చెందిన మరో వాహనం కూడా ఇదే తరహాలో చోరీకి గురైంది.
- అటవీ శాఖకు చెందిన వ్యక్తులు వారం క్రితం టీటీడీ అనుమతి లేకుండా, టోల్‌గేట్‌లో భద్రతా సిబ్బందికి తెలియకుండా తిరుమలకు పడవలను తీసుకొచ్చారు. పాపవినాశనం రిజర్వాయర్‌లో బోటింగ్ ట్రయల్స్ కూడా నడిపారు.
- పది రోజుల కిందట అర్చక నిలయం వద్ద ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. 'తిరుమలలోనే మద్యం అమ్ముతా... ఏం చేస్తారో చేసుకోండి' అంటూ సవాల్ విసిరాడు.
- ఇటీవలే భద్రతా సిబ్బంది నివాసాలతో పాటు మీడియా కార్యాలయాలు ఉండే డీ-టైప్ క్వార్టర్స్ వద్ద మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు దారిన వెళ్లేవారిపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో విజిలెన్స్ సిబ్బంది కూడా గాయపడ్డారు.
- ఇటీవల సీఎం చంద్రబాబు తిరుమల వచ్చే ముందురోజు ఏటీసీ క్యూలైన్‌లోనే మద్యం సీసాలు కనిపించాయి. రాంబగీచా గెస్ట్ హౌస్ వద్ద రోడ్డు పక్కనే కొందరు భక్తులు ఎగ్ బిర్యానీ తింటూ కనిపించారు.
- అదనపు ఈవో కార్యాలయం వెనుక కొందరు మద్యం మత్తులో కారు ధ్వంసం చేయడంతో పాటు అద్దాలు పగలగొట్టి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు.
- బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సారథ్యంలో సాధువులు తిరుమలలో ధర్నాకు దిగారు.
- కల్యాణ వేదిక వద్ద ఫొటోగ్రాఫర్ల ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. అలాగే సీఆర్వో వద్ద భక్తుల మధ్య గొడవ జరిగి ఇద్దరు గాయపడ్డారు.


టీటీడీ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, ఈవో శ్యామలరావు, మంత్రి ఆనం, తదితరులు

సేవలపై సంతృప్తి

రథసప్తమి, వైకుంఠ ఏకాదశి సందర్భాల్లో తిరుమలలో టీటీడీ అందించిన సేవలపై సర్వేల్లో భక్తుల నుంచి అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు సీఎంకు వివరించారు. మార్చి 9 నుంచి 14 వరకు సాధారణ రోజుల్లో తిరుమల వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైంది.

కలిసి పనిచేయలేరా?

- టీటీడీలో వందశాతం ప్రక్షాళన జరగాలి
- టీటీడీ వ్యవహారంలో దేవదాయ మంత్రిని భాగస్వామ్యం చేయండి: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'టీటీడీలో మంచి పనులు జరిగితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. సక్రమంగా జరగకపోతే ఆ ప్రభావం కూడా ప్రభుత్వంపై ఉంటుంది. మీరంతా అవగాహనతో ఎందుకు పని చేయరు? అందరూ కూర్చుని చర్చించుకుని నిర్ణయాలు తీసుకోవడం చేత కాదా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబు టీటీడీ పాలకమండలి, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో 3గంటలపాటు ఆయన సమీక్ష నిర్వహించారు. తిరుమలలో పారిశుధ్య పనులు, తిరుమల పర్వత శ్రేణులపై పచ్చదనం పెంపు, భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పన వంటి విషయాల్లో తాను చెప్పినవి కూడా సక్రమంగా అమలు చేయడం లేదని సీఎం అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, పాలకమండలి సమన్వయంతో పరస్పర అవగాహనతో పని చేయడం లేదని స్వయంగా ప్రస్తావించారు. దేవదాయ మంత్రిని టీటీడీ వ్యవహారాలకు దూరంగా ఉంచడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇకపై టీటీడీ ఏ కీలక నిర్ణయాలు తీసుకోవాలన్నా చైర్మన్, ఈవోతో పాటు దేవదాయ శాఖ మంత్రిని పరిగణనలోకి తీసుకోవాలని, ఈ ముగ్గురు చర్చించిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం టీటీడీలో ఎంత మంది ఉద్యోగులు పని చేస్తున్నారని ఈ సమావేశంలో సీఎం ప్రశ్నించారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కలిపి దాదాపు 20 వేలమంది ఉద్యోగులు ఉన్నారని అధికారులు వివరించారు. ఇందులో నాలుగు వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారని, వీరందరిని గత ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అవసరాన్ని బట్టి సిబ్బంది ఉండాలని, ఎవరి కోసమో ఉండకూడదని సీఎం అన్నారు. లక్షలాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన తిరుమలలో ఆధ్యాత్మికత ఉట్టిపడాలని, వెనకటి అస్తవ్యస్త విధానాలు కొనసాగడానికి వీల్లేదన్నారు. ప్రక్షాళన వంద శాతం జరగాల్సిందేనని, మినహాయింపులు లేవని తేల్చిచెప్పారు.

పవిత్రతకు పెద్ద పీట...

'తిరుమలలో భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్ద పీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలి. తిరుమల ఆలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. గత ప్రభుతంలో, ఇప్పటికి మార్పు కనిపించింది. ఆ మార్పు 100 శాతం ఉండాలి. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో వాటిని మాత్రమే చేయాలి. మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్త మాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చు పెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు టీటీడీ ఖర్చు చేస్తోంది. దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్‌తో పాటు కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది' అని చంద్రబాబు అన్నారు. భక్తుల కోసం అలిపిరిలో బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 25 వేలమందికి సౌకర్యంగా ఉండేలా నిర్మిస్తున్నట్లు వివరించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేలమంది వరకూ భక్తులు వస్తారని అధికారులు తెలుపగా.. మరింత అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్, టీటీడీ జేఈవో, సీవీఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా.. వెంటనే ప్రారంభం కావాలని సీఎం సూచించారు. ప్రతి సేవకు ఆధార్, సెల్‌ఫోన్ నంబర్‌ను లింక్ చేయడం వల్ల అక్రమాలకు ఆస్కారం ఉండదని చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టిపెట్టాలని సూచించారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టార్లలో విస్తరించి ఉండగా, ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉందని, 80 శాతానికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.

ఆలయాల అభివృద్ధి

రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించాలని,త్వరలోనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలందుర్పేట, కోయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా సీఎం సమీక్షించారు. సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారులు, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీ స్క్వేర్ వివాదంపై చర్చ

చెన్నై కేంద్రంగా పని చేస్తున్న జీ స్క్వేర్ అనే రియల్ సంస్థ వ్యవహారంపై సమావేశంలో చర్చ జరిగింది. ఆ సంస్థ చెన్నైలో తన వెంచర్లు ఉన్న చోట టీటీడీ ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మించడానికి ముందుకొచ్చింది. ఎవరో వ్యాపారాల కోసం ఆలయాలను కట్టిస్తామంటే మనమెందుకు అంగీకరించాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే దేవస్థానం డబ్బులు ఖర్చు పెట్టకుండా కోట్ల ఖర్చుతో ఆలయాలు నిర్మిస్తుంటే అభ్యంతరం ఎందుకని సీఎం ప్రశ్నించారు. ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత డబ్బులతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తామంటే ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆగమ శాస్త్రబద్ధంగా ఆలయాలను నిర్మించాలని, టీటీడీ తరఫున ఆగమ శాస్త్ర సలహాలు, సూచనలను అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల్లో ఆలయాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం.. 1.30 కోట్ల పరిహారం

- బాధిత కుటుంబానికి ఇవ్వాల్సిందేనని హైకోర్టు తీర్పు
- రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయుడు
- గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టని వైనం
- కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటన

నెల్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణ సమయంలో సంబంధిత కాంట్రాక్టర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. అయితే.. అలాంటి నిబంధనలు పాటించని కారణంగా 2016లో నెల్లూరు జిల్లా కొడవలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ టీచర్ ప్రాణాలు కోల్పోయారు. ఆ మరణానికి కారణం ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లేనని పేర్కొంటూ మృతుని కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించి రూ.1.30 కోట్లను పరిహారంగా పొందారు. హైకోర్టు కూడా బాధిత కుటుంబానికే అండగా నిలిచింది. ముందుగా పరిహారంలో సగం సొమ్మును చెల్లించాలని అధికారులను ఆదేశించింది. విడవలూరు మండలం రామతీర్థం పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దాసరి కామరాజ్ 2016 మే 27న ఓ పనిమీద నెల్లూరు వెళ్లి రాత్రి 11 గంటలకు బైక్‌పై తిరిగి స్వగ్రామమైన వావిళ్లకు వస్తున్నారు. అప్పట్లో గుండాలమ్మపాలెం వద్ద ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దీనికోసం తీసిన గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ గుంతలను గమనించలేకపోయిన కామరాజ్ బైక్‌పై వెళ్తూ గుంతలో పడి ప్రమాదానికి గురై మరణించారు. దీనిపై కొడవలూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కామరాజ్‌కు భార్య, తల్లితోపాటు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది. దీంతో వారు 2019లో జిల్లా కోర్టును ఆశ్రయించి, పరిహారం ఇప్పించాలని కోరారు. కామరాజ్‌కు ఇంకా 12 ఏళ్ల సర్వీసు ఉందని, ఆయన జీతం, బెనిఫిట్స్ మొత్తం లెక్కించి రూ.90 లక్షలు పరిహారంగా ఇప్పించాలని అభ్యర్థించారు. ఈ కేసుపై మూడో జిల్లా అదనపు కోర్టులో ఐదేళ్లపాటు విచారణ జరిగింది. చివరకు కోర్టు.. రూ.81.25 లక్షలను బాధిత కుటుంబానికి చెల్లించాలని ఆర్‌అండ్‌బీని ఆదేశించింది. అలాగే సూట్ వేసినప్పటి నుంచి తీర్పు వచ్చే వరకు వడ్డీతో కలిపి చెల్లించాలని పేర్కొంది. ఈ మొత్తం రూ.1.30 కోట్లుగా తేలింది. జిల్లా కోర్టు తీర్పును ఆర్‌అండ్‌బీ అధికారులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసు గత నెలలో విచారణకు వచ్చింది. హైకోర్టు స్పందిస్తూ.. కేసు విచారణ కంటే ముందు జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సగం పరిహారాన్ని బాధిత కుటుంబానికి జమ చేయాలని, ఆ మొత్తంలో సగాన్ని వారు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. దీంతో రూ.65 లక్షలను బాధితుల ఖాతాలో జమ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు పరిహారం చెల్లించాలంటూ కాంట్రాక్టర్ పైడాల తిరుపతిరెడ్డికి కావలి ఆర్‌అండ్‌బీ ఈఈ రామకృష్ణప్రసాద్ గత నెల 4న నోటీసు ఇచ్చారు. అయితే, ఈ విషయంలో తన తప్పులేదని సదరు కాంట్రాక్టర్ తిరిగి ఈఈకి వివరణ ఇచ్చారు. దీంతో ఇప్పుడు అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. త్వరలోనే బాధిత కుటుంబానికి పరిహారం దక్కనుంది. సగం మొత్తం డిపాజిట్ చేయాలన్న కోర్టు ఆదేశాలతో కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చామని కావలి ఆర్‌అండ్‌బీ ఈఈ రామకృష్ణప్రసాద్ చెప్పారు.

మరో 50 ఏఎంసీలకు నేడో రేపో చైర్మన్లు!

» 15 రోజుల్లో మిగిలినవీ భర్తీ.. వీటితోపాటే ఆలయ కమిటీలకు కూడా

» నెలాఖరులోగా పీఏసీఎస్‌ల నియామకాలు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ల నియామకానికి టీడీపీ అధిష్ఠానం కసరత్తు కొలిక్కి వస్తోంది. మొత్తం 218 ఏఎంసీల్లో తొలి విడతగా గత నెల 28న 47 ఏఎంసీలకు చైర్మన్లను ప్రకటించారు. ఒకట్రెండు రోజుల్లో మరో 50 ఏఎంసీ చైర్మన్ల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. మిగతా నియామకాలు కూడా 15 రోజుల్లో పూర్తిచేసేయాలని భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ అధినేత చంద్రబాబు గ్రామ స్థాయి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆచితూచి అడుగు వేస్తుండడంతో కాస్త జాప్యం జరుగుతోంది. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడం కోసమే విస్తృతంగా కసరత్తు చేస్తున్నారు. వీటితోపాటే దేవాయలయ కమిటీలనూ ప్రకటించే అవకాశం ఉంది. అనంతరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)ల భర్తీపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,250 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటికి చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత నామినేటెడ్ చైర్మన్లు లేదా పర్సన్ ఇన్‌చార్జులతో నడిపిస్తున్నారు.

సీఎంతో వంగవీటి రాధా భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబును వంగవీటి రాధాకృష్ణ సచివాలయంలో కలిశారు. బుధవారం సాయంత్రం సుమారు అరగంట పాటు ఆయనతో సమావేశమయ్యారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీల జాబితాలో రాధా పేరు ఉంటుందని భావించారు. కానీ ఖాళీ అయిన ఐదు స్థానాల్లో జనసేన, బీజేపీలకు చెరొకటి కేటాయించడంతో ఆయనకు ఇవ్వలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుండడంతో రాధాకు నామినేటెడ్ పోస్టు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. దీని పైనే రాధా పార్టీ అధినేతను కలిసినట్లు సమాచారం.

అమరావతి చిత్రకళా వీధికి సీఎం మద్దతు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం గురించి వివరించేందుకు సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని బుధవారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా అమరావతి అంశంపై రూపొందించిన చిత్రలేఖనానికి చంద్రబాబు కుంచెతో రంగులు వేసి తన మద్దతు తెలిపారు. ఇక, రాజమండ్రిలో ఈనెల 4న 'అమరావతి చిత్రకళావీధి' నిర్వహిస్తున్నామని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని తెలిపారు. మన కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, మంత్రి దుర్గేష్ సహకారంతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



కుంచెతో రంగులు వేస్తున్న చంద్రబాబు

అవినీతి చక్రవర్తి జగన్‌రెడ్డి

» విశ్వసనీయత లేని పత్రికలో నాపై నిందలు: సత్యకుమార్



కడప, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'పంచభూతాలను సైతం వదలిపెట్టకుండా దోచుకున్న అవినీతి చక్రవర్తిగా మాజీ సీఎం జగన్ ఖ్యాతిగాంచారు' అని మంత్రి వై.సత్యకుమార్ విమర్శించారు. బుధవారం బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య శాఖలో నేను అవినీతికి పాల్పడినట్లుగా విశ్వసనీయత లేని ఆయన రోత పత్రికలో అసత్య రాతలు రాయడం మరీ విడ్డూరం. మోదీ, చంద్రబాబు హయాంలో అటు దేశం, ఇటు రాష్ట్రం వికసిత్ భారత్, ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోనున్నాయి. మరో 10 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వాలు అధికారంలో కొనసాగేలా ప్రజలు ఆశీర్వదించాలి' అన్నారు. ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

» జగన్‌రెడ్డిపై అచ్చెన్నాయుడు ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా వైసీపీ నేత జగన్‌రెడ్డికి అహంకారం తగ్గలేదు, బుద్ధి రాలేదు' అని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో విజయంపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. 'ఉప ఎన్నికలు జరిగిన స్థానాల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించినట్లు జగన్ చెబుతుండటం హాస్యాస్పదం. ఉప ఎన్నికలు జరిగిన 53 స్థానాలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ భయపెట్టి గెలిచినవే. అలాంటి స్థానాల్లో విజయం సాధించడంపై జగన్ బీరాలు పలుకుతున్నారు. మేం నిజంగా పోలీసులతో బెదిరించి, భయపెట్టి వైసీపీ గెలిపించుకున్న వారిని మావైపు తిప్పుకుంటే... ఒక్క స్థానం కూడా వారికి దక్కేది కాదు. చేయాల్సిన తప్పుడు పనులన్నీ చేసి ఇప్పుడు సుద్దపూస కబుర్లు చెబుతున్నారు. టీడీపీకి అలాంటి తప్పుడు పనులు చేయాల్సిన అవసరం లేదు' అన్నారు.

టీడీపీ కార్యాలయంలో టీడీ జన్మదిన వేడుకలు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్దన్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పలువురు పార్టీ నేతలు కేక్ కట్ చేశారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా మెటీరియల్‌ను జనార్దన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన నాగబాబు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు కలిశారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆయన సచివాలయంలో ఉన్న చంద్రబాబును సతీసమేతంగా వెళ్లి కలిశారు. చంద్రబాబుని శాలువాతో సత్కరించారు. చంద్రబాబు కూడా నాగబాబును శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

క్లైమాక్స్‌కు చేరిన చంద్రబాబు మోసాలు

» పీ 4 పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు: వైఎస్ జగన్

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కు చేరాయి. వాటిని గ్రహించిన రాష్ట్ర ప్రజలు సమావేశాల్లో బాబు ప్రసంగిస్తుండగానే భరించలేక బయటకు వెళ్లిపోతున్నారు' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం 'స్థానిక' ఉప ఎన్నికల్లో విజయం సాధించిన వారితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో సంఖ్యాబలం లేకున్నా ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పోటీ చేయడాన్ని జగన్ తప్పుబట్టారు. 'కుప్పంలో టీడీపీకి బలం లేకున్నా పోటీ చేసింది. రాప్తాడులోనూ బలం, కోరం లేకున్నా గెలిచినట్లుగా ప్రకటించుకున్నారు. నేను అధికారంలో ఉన్న నాలుగేళ్లూ ఎప్పుడూ ఏదో ఒక బటన్ నొక్కడం ద్వారా పేదల నోట్లోకి ముద్ద వెళ్లేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముద్దమాట దేవుడెరుగు... ఎకంగా ప్లేటునూ లాగేసుకున్నారు. కొత్తగా పీ 4 అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు' అంటూ జగన్మోహన్‌రెడ్డి మండిపడ్డారు.

బీసీ బిల్లును ఆమోదించాలి: శంకర్‌రావు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం రూపొందించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు కేశిని శంకర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద 'బీసీల పోరు గర్జన మహాధర్నా'లో ఆయన మాట్లాడుతూ... 'మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళల వాటా తేల్చాలి. జనగణనలో కులగణనను చేపట్టాలి' అని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, వివిధ జిల్లాల బీసీ సంక్షేమ సంఘాల నాయకులు తరలివచ్చారు.

గొల్లపూడిలో శాటిలైట్ రైల్వే స్టేషన్ నిర్మించండి

» రైల్వేస్టేషన్లలో అరకు కాఫీ స్టాల్స్‌ను ఏర్పాటు చేయండి

» కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ ఎంపీల వినతులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్ రద్దీ దృష్ట్యా గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వే స్టేషన్ నిర్మించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. బుధవారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆమె భేటీ అయ్యారు. ఈమేరకు విజ్ఞాపన పత్రాన్ని ఆయనకు అందించారు. అరకు కాఫీ స్టాల్స్‌ని దేశంలోని ప్రముఖ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయాలని టీడీపీ ఎంపీ అప్పలనాయుడు వినతిపత్రం ఇచ్చారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం: కృష్ణప్రసాద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ పార్టీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడారు. '1985లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఏపీలో మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను స్థాపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 1996లో ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించారు. 2014-19 మధ్యకాలంలో మైనారిటీల అభివృద్ధి కోసం రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టాం' అని కృష్ణప్రసాద్ తెలిపారు.

అట్టడుగు వర్గాలకు జనసేన అండ: తంగెళ్ల ఉదయ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో జనసేన ఎల్లప్పుడూ అట్టడుగువర్గాలకు అండగా ఉంటుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల హక్కులకు ఆటంకాలు కలగవన్నారు.

అమరావతికి నిధులొచ్చాయ్!




శాఖమూరు వద్ద కార్మికుల కోసం ఆర్‌వీఆర్ సంస్థ నిర్మిస్తున్న షెడ్లు

3,535 కోట్లు విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు

అమరావతి/ గుంటూరు/ తుళ్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగు పడింది. ప్రపంచ బ్యాంకు నుంచి తొలి విడత రుణం కింద రూ.3,535 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమయ్యాయి. తాజాగా ప్రపంచ బ్యాంకు నిధులు విడుదల చేయడంతో త్వరలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) నుంచి కూడా మొదటి విడత రుణం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజధాని కోసం ప్రపంచ బ్యాంకు రూ.6,700 కోట్లు, ఏడీబీ రూ.6,700 కోట్లు కలిపి మొత్తం రూ.13,600 కోట్లు అప్పుగా ఇస్తున్నాయి. మరో రూ.1,400 కోట్లను కేంద్రం ఏపీకి ప్రత్యేక సాయంగా అందిస్తోంది. ఈ నిధులను రాష్ట్ర రుణ పరిమితిలో (ఎఫ్‌ఆర్‌బీఎం) లెక్కించకూడదని కేంద్రం నిర్ణయించింది. హడ్కో నుంచి రూ.11,000 కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. అలాగే, జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5,000 కోట్ల రుణాలు తీసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

రాజధానిపై వైసీపీ కుట్రలతో జాప్యం

అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ చెరో రూ.6,700 కోట్ల చొప్పున రుణాన్ని గతేడాది డిసెంబరులో ఆమోదించాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలోనే ప్రపంచ బ్యాంకు నుంచి మొదటి విడత అప్పు విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతం రాజధానిగా పనికిరాదని, అప్పు ఇవ్వొద్దంటూ కొందరు ఆ బ్యాంకుకు లేఖలు రాశారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేసరికి 2నెలలు ఆలస్యమైంది. 2018లో కూడా వైసీపీ ఇలాంటి కుట్రలే చేసి అమరావతికి అప్పు రాకుండా అడ్డుపుల్లలు వేసింది. కానీ, ఈసారి వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వాస్తవానికి 2018లోనే రాజధాని నిర్మాణానికి రుణం మంజూరు చేయడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. కానీ ఆ నిధులు రాకుండా నాటి ప్రతిపక్ష నేత జగన్, విజయసాయిరెడ్డి కుట్రలు పన్నారు. అప్పటి ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేస్తూ ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాశారు. అమరావతి వరదలకు మునిగిపోతుందని పదేపదే ఈ-మెయిళ్లు పంపారు. రాజధాని గ్రామాలతో సంబంధంలేని రైతులతోనూ ఫిర్యాదులు చేయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ జగన్ రోతపత్రికలో విషపు కథనాలు వండివార్చారు. ఈ పరిణామాలతో ప్రపంచ బ్యాంకు వెనక్కి తగ్గింది. అనంతరం సీఎం అయిన జగన్... అమరావతి నిర్మాణానికి తమకు రుణం అక్కర్లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారు. 2014-19లో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్లను క్లోజ్ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు వంటి 19 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ రూ.16,871 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక వీటికి అంచనాలు తయారుచేశారు. 31 సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. పనులకు టెండర్లు కూడా ఖరారు చేశారు.

పనుల సందడి

రాజధానిలో పనుల సందడి ప్రారంభమైంది. ఏప్రిల్ మూడో వారంలో ప్రధాని చేతుల మీదగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దసంఖ్యలో కార్మికులు వస్తున్నారు. రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసే పనులు కూడా సమాంతరంగా సాగనుండడంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలకు చేతినిండా పని ఉంటోంది. నిర్మాణాలకు ముందస్తు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయా సంస్థలు బిజీగా ఉన్నాయి. గతంలో ఆగిపోయిన ప్రభుత్వ భవనాల వద్ద కార్మికుల కోసం భారీస్థాయిలో రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. క్లాస్-4, న్యాయమూర్తులు, మంత్రుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ.. దాదాపు 200 మంది కార్మికుల కోసం షెడ్డును సిద్ధం చేసింది. హ్యాపీనెస్ట్ కాంట్రాక్టు పొందిన ఎన్‌సీసీ సంస్థ షెడ్లను నిర్మించింది. జడ్జిల భవన సముదాయం వద్ద కూడా పనులు జరుగుతున్నాయి. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన కేఎంవీ సంస్థ ఆ నిర్మాణాలకు సమీపంలో షెడ్లు నిర్మిస్తోంది. రాజధానిలో ఈ-6 నిర్మాణ కాంట్రాక్టు తాజాగా పొందిన ఆర్‌వీఆర్ కంపెనీ తుళ్లూరు శివారులో గతంలో వేసిన షెడ్లను సకల సౌకర్యాలతో కార్మికుల కోసం సిద్ధం చేస్తోంది. సీఎం చంద్రబాబు వెలగపూడిలో ఇటీవల కొన్న స్థలానికి సంబంధించి బీఎస్ఆర్ సంస్థ పనులు ప్రారంభించింది. రాయపూడి కృష్ణానది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఫిల్టర్ ట్యాంకు పైపులైను పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటితో పాటు కంప చెట్ల తొలగింపు, మెరక, చదును చేయడం వంటి పనుల్లో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు.

ఈ నెలలోనే ప్రధాని మోదీ రాక!

» పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

రాజధాని పనులను పునఃప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని మోదీ ఈ నెలలో అమరావతికి రానున్నారు. మోదీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్ విజయానంద్ బుధవారం అమరావతి సచివాలయంలో అధికారులతో ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షిస్తామని, ఈలోపు శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని ఆదేశించారు.

అమరావతిలో సింగపూర్ బృందం

రాజధాని అమరావతిలో సింగపూర్ కన్సార్షియం బృందం బుధవారం పర్యటించింది. స్టార్టప్ ఏరియా నిర్మాణంలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోమారు కోరిన నేపథ్యంలో ఈ బృందం రాజధానిలో పర్యటించింది. కోర్ క్యాపిటల్ పరిధిలోని పలు ప్రభుత్వ భవన సముదాయాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవన సముదాయంతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధుల భవనాలను పరిశీలించింది. గతంలో రాజధాని అమరావతిలో సింగపూర్ స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ఉద్దండరాయునిపాలెం- తాళ్లాయపాలెం పరిధిలో 1,900 ఎకరాల భూమి సింగపూర్ కన్సార్షియం తీసుకుంది. ఐదేళ్ల తర్వాత పరిస్థితులపై తాజాగా బృందం ఆరా తీసింది. వరద నియంత్రణకు తీసుకున్న చర్యలు, కరకట్ట రోడ్డు పరిస్థితులను పరిశీలించింది. అనంతరం సీఎస్ విజయానంద్, సీఆర్డీఏ ఉన్నతాధికారులతో ప్రతినిధి బృందం సచివాలయంలో భేటీ అయింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరిగానే ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సీఎస్ వారికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్‌శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ... రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంతకుముందు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రజా రాజధానిని నిర్మించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. సుమారు రూ.లక్ష కోట్ల పనులు పునఃప్రారంభం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధాని మోదీ ఈ నెలలోనే శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. సింగపూర్ ప్రతినిధులు ఫ్రాన్సిస్ చేంగ్, ఆడ్రేటాన్, ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. కాగా, నేడు మంత్రి లోకేశ్‌తో పాటు సీఎం చంద్రబాబుతో సింగపూర్ కన్సార్షియం ప్రతినిధులు భేటీ కానున్నారు.

ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం


ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలపాటి రాజా, బీటీ నాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, సోము వీర్రాజు


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు దంపతులు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల శాసన మండలికి ఎన్నికైన ఐదుగురు సభ్యులు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. సోము వీర్రాజు(బీజేపీ), కొణిదెల నాగబాబు(జనసేన), బీటీ నాయుడు(టీడీపీ), పేరాబత్తుల రాజశేఖర్(టీడీపీ), ఆలపాటి రాజేంద్రప్రసాద్(టీడీపీ)లతో బుధవారం అమరావతి అసెంబ్లీ భవనంలో మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, బీటీ నాయుడు అసెంబ్లీ గేటు బయట మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో హైదరాబాద్ వంటి మహానగర నిర్మాణం జరుగుతోంది. ప్రధాని మోదీ అన్ని విధాలా సహకరిస్తున్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ముందుకు వెళుతోంది. వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ముందుకు వెళుతోది. సూపర్ సిక్స్ అమలు తీరుతో ప్రతిపక్షం భయపడుతుంది' అని సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ, 'టీడీపీలో డబ్బులు, గాడ్ ఫాదర్ అవసరం లేదు. కష్టపడి పని చేస్తే గుర్తింపు ఉంటుంది. అందుకు ఉదాహరణ నేనే. టీడీపీ అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ. గతంలో రాక్షస పాలన సాగింది. 56 కార్పొరేషన్లు పెట్టి బల్లలు, కుర్చీలు, ఇచ్చారు తప్ప నిధులు, విధులు లేవు. గత ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడూ బడుగులను గౌరవించలేదు. 76 సంవత్సరాల వయస్సులోను సీఎం చంద్రబాబు కష్టపడి పని చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తున్నారు' అని అన్నారు.

అసెంబ్లీ ఆవరణలో దొంగల చేతివాటం

» 4 లక్షలు కొట్టేసిన ఘనులు

ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకార సమయంలో అసెంబ్లీ ఆవరణలో జేబు దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. సుమారు రూ.4 లక్షలు కొట్టేశారు. టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు జేబులోని రూ.10,000లను లాఘవంగా లాగేశారు. ఆయన గన్‌మెన్ జేబులో ఉన్న రూ.40 వేలు, హైకోర్టు లాయర్ జేబులో రూ.50 వేలు, మరో వ్యక్తి నాగరాజు జేబులో ఉన్న రూ.32 వేలు నగదును అత్యంత చాకచక్యంగా దొంగలు తస్కరించారు.

భవ్య హెల్త్ సర్వీస్‌కు 104, 108 బాధ్యతలు

» కొత్త సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 104, 108 అంబులెన్సుల నిర్వహణకు ప్రభుత్వం కొత్త సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేసింది. ఇప్పటి వరకు సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రక్రియలో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సారథ్యంలో ఎస్ఆర్‌బిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామిగా ఉన్న కన్సార్షియంను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో ఎక్కడా లేని విధంగా 104 వాహనాల ద్వారా గ్రామీణులకు 47 రకాల రోగ నిర్ధారణ(డయాగ్నోస్టిక్) పరీక్షలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను రూపొందించడానికి ఈ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం, బీపీ పరీక్షలు మాత్రమే(ర్యాపిడ్ కిట్ ద్వారా) చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయనున్నారు. బ్లడ్ గ్లూకోజ్, కాలేయ పనితీరు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, మూత్ర విశ్లేషణ ఇలా 20 రకాల పరీక్షలు చేస్తారు. అదేవిధంగా నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్షలు చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షలను ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షలను పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టనుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాల్ని ప్రతి 104 వాహనంలో సెమీ-ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సీబీసీ మెడిసిన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వాహనంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు.

108కి 2 షరతులు

కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాల్ని సొంతగా కొనుగోలు చేయనుంది. కొత్త వాహనాలు అందుబాటులోకి రావడంతో 731 వాహనాలు 108 సేవల్ని అందిస్తాయి. 108 సేవలకు సంబంధించి, సర్వీస్ ప్రొవైడర్‌కు రెండు షరతులు పెట్టారు. కాల్ వచ్చినప్పటి నుంచి రోగిని ఒక గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దీనిని గోల్డెన్ అవర్‌గా పేర్కొంది. రెండోది.. అత్యవసర కాల్స్‌ను తప్పకుండా రిసీవ్ చేసుకోవాలి. ప్రస్తుతం 108 సేవలు అందిస్తున్న సంస్థ రోజుకు దాదాపు 200 ఎమర్జెన్సీ కాల్స్‌ను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ఈ షరతులు పెట్టడం గమనార్హం.



మహాసభల్లో ప్రసంగిస్తున్న ప్రకాష్ కరట్

హిందూత్వ-కార్పొరేట్ బంధంపైనే పోరాటం

» హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడే ధైర్యం వామపక్షాలదే

» సీపీఎం 24వ అఖిల భారత మహాసభలో ప్రకాశ్ కరట్

చెన్నై, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం.. అమెరికా సామ్రాజ్యవాదానికి దగ్గరగా ఉన్న హిందూత్వ-కార్పొరేట్ సంబంధాన్ని సూచిస్తాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరట్ వ్యాఖ్యానించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్, దానికి ఆధారమైన హిందూత్వ-కార్పొరేట్ సంబంధాన్ని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడే శక్తి, ధైర్యం వామపక్షాలకే ఉన్నాయని ఉద్ఘాటించారు. హిందూత్వ శక్తులు నిర్వహిస్తున్న రాజకీయ ఆధిపత్యం కేవలం ఎన్నికల మార్గాల ద్వారా మాత్రమే కాదన్నారు. అది సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో హిందూత్వ శక్తులు ప్రదర్శించే ప్రభావం ద్వారా సంపాదించిన ఆధిపత్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మనం అవలంబించే రాజకీయ -వ్యూహాత్మక పంథాలో.. బీజేపీ-ఆర్ఎస్ఎస్, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటం చేయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తమిళనాడులోని మదురైలో సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రకాశ్ కరట్ మాట్లాడుతూ.. "వామపక్షాలు.. ఐక్య పోరాటాలు, ఓటములు, ఇతర పార్టీలతో ఇమడలేకపోవడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడేందుకు వామపక్షాలకు మాత్రమే దృఢ నిశ్చయం, ధైర్యం, శక్తి ఉన్నాయి." అని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా వామపక్షాల ఐక్యతను బలోపేతం చేయడానికి, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకతాటి పైకి తీసుకురావడానికి సీపీఎం కృషి చేస్తుందని తెలిపారు. "డొనాల్డ్ ట్రంప్ తన సన్నిహితుడుగా ఎవరిని చెప్పుకొంటున్నారు? గౌతం అదానీ, ముఖేశ్ అంబానీలకు మిత్రుడు ఎవరు? ఆర్ఎస్ఎస్ పట్ల విధేయత చూపిస్తోందెవరు?.. ఈ మూడు ప్రశ్నలకు ఒక్కటే సమాధానం.. నరేంద్రమోదీ, బీజేపీ" అని కరట్ వ్యాఖ్యానించారు. "మోదీ ప్రభుత్వం.. అమెరికా సామ్రాజ్యవాదానికి అత్యంత సన్నిహితంగా ఉండే హిందూత్వ కార్పొరేట్ బంధాన్ని ప్రతిబింబిస్తోంది" అని కరట్ ఆరోపించారు. బూర్జువా రాజకీయాలు తప్ప బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలనలో మరొకటి కనిపించడం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా దుయ్యబట్టారు. "కార్పొరేట్, మత దాడులను బలంగా ఎదుర్కొనేందుకు అన్ని వామపక్ష శక్తులు ఐక్యం అయ్యేందుకు ఈ సభల ద్వారానే సంకల్పం చెప్పుకోవాలి" అని రాజా పిలుపునిచ్చారు. సభా ప్రాంగణానికి 'కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్' అని పేరు పెట్టారు.


సముద్రంలో డ్రగ్స్‌తో వెళుతున్న బోటును చుట్టుముట్టిన ఐఎన్ఎస్ తర్కాశ్, నేవీ సిబ్బంది

2,500 కిలోల మాదక ద్రవ్యాలు స్వాధీనం

విశాఖపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సముద్ర మార్గాన తరలిస్తున్న 2,500కిలోల మాదక ద్రవ్యాలను నేవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ హిందూ మహాసముద్రంలో కొన్ని బోట్లు అనుమానంగా సంచరిస్తున్నాయని యుద్ధనౌక ఐఎన్ఎస్ తర్కాశ్‌కు సమాచారం అందింది. దీంతో మార్చి 31న మెరైన్ కమెండోలతో తర్కాశ్ అక్కడకు చేరుకుంది. కమెండోలు బోటులోకి వెళ్లి తనిఖీలు చేయగా 2,500 కిలోల మాదక ద్రవ్యాల సంచులు లభించాయి. వాటిలో 2,386 కిలోల హషీష్, 121 కిలోల హెరాయిన్ ఉన్నట్టు నేవీ వర్గాలు బుధవారం తెలిపాయి.



పచ్చ తోరణం

విశాఖలో రైల్వేన్యూకాలనీ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు పెరిగి పచ్చ తోరణంలా కనిపిస్తున్నాయి. మండు వేసవిలో వాహన చోదకులకు అక్కడ చల్లదనం ఆహ్వానం పలుకుతోంది. సూర్యకిరణాలు కూడా చొరబడనంతగా అల్లుకున్న చెట్ల కింద నుంచి వెళుతుంటే వేసవితాపం నుంచి ఉపశమన కలుగుతోంది.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి

శవ రాజకీయాలొద్దు

» ప్రవీణ్ మృతిపై లోకేశ్ స్పందించారు: మహాసేన రాజేశ్



కాకినాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని కొందరు కావాలని రాజకీయం చేస్తున్నారు. నిరాధార ఆరోపణలతో విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణల్లోని హిందూ సమాజానికి నాదొక విజ్ఞప్తి... ఈ ఘటనను హిందువులపైకో, ప్రభుత్వంపైకో నెట్టేయాలని ఏ క్రైస్తవుడూ ప్రయత్నించలేదు. హిందువులెవరూ అపార్థం చేసుకోవద్దు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే ఆ నివేదికలు వస్తాయి' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ అన్నారు. బుధవారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పాస్టర్ ప్రవీణ్‌ది హత్య అని ఎవరి దగ్గరైనా ఆధారాలుంటే వాటిని పోలీసులకు అందజేస్తే ఆ కోణంలో దర్యాప్తు చేస్తారు. మంత్రి లోకేశ్ ఈ ఘటనపై స్పందించి ట్వీట్ చేశారు. మాజీ ఎంపీ హర్షకుమార్, వైసీపీ నాయకుడు జూపూడి ప్రభాకర్, కేఏ పాల్ నిరాధార ఆరోపణలతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. హిందువులు, క్రైస్తవుల మధ్య విద్వేషాలు సృష్టించి, మతకలహాలు రేపేందుకు, క్రైస్తవులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలిచేందుకు ఆ ముగ్గురితోపాటు కొందరు పాస్టర్లు ప్రయత్నిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' అని రాజేశ్ డిమాండ్ చేశారు.

పాస్టర్ మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి: కేఏ పాల్

విజయవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు నివృత్తి చేసేలా సీబీఐతో విచారణ చేయించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టులో పిల్ వేసినట్టు తెలిపారు. 'ప్రవీణ్ మృతి రోడ్డు ప్రమాదం కాదని, దుండగులు హత్య చేశారన్న చర్చ జరుగుతోంది. ఘటన జరిగి వారం గడుస్తున్నా పోస్టుమార్టం రిపోర్టు ఎందుకు బహిర్గతం చేయడం లేదు? పోలీసులు విడుదల చేసిన వీడియోలపై అనేక సందేహాలు ఉన్నాయి. సుమారు 300 సీసీ కెమెరాల ఫుటేజ్‌లను సేకరించిన పోలీసులు ప్రవీణ్ మృతి చెందిన ప్రాంతంలో ఏ జరిగిందో తెలిపే వీడియోలను ఎందుకు విడుదల చేయడం లేదు? వీడియోలో వ్యక్తి తన అన్న కాదని, అతనికి మద్యం అలవాటు లేదని ప్రవీణ్ సోదరి చెబుతోంది. అతని సన్నిహితులూ ఇదే ధ్రువీకరిస్తున్నారు' అని పాల్ అన్నారు.

పడుతూ.. లేస్తూ..

వరుస ప్రమాదాలకు గురైన పాస్టర్ ప్రవీణ్ కుమార్

విజయవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ పడుతూ లేస్తూ వరుస ప్రమాదాలకు గురైనట్టు సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు తెలియజేస్తున్నాయి. ఇప్పటికే కీసర టోల్‌గేట్, విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద ఆయన బుల్లెట్‌పై ప్రయాణిస్తూ అదుపు తప్పి పడిపోయిన ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చిల్లకల్లు టోల్‌గేట్ సమీపంలోనూ ఆయన బుల్లెట్ నడుపుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన మరో సీసీటీవీ ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. మార్చి 24న ఆయన హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయలుదేరారు. తెలంగాణ సరిహద్దు దాటాక ఎన్టీఆర్ జిల్లాలో కీసర టోల్‌గేట్ వద్ద బుల్లెట్ అదుపుతప్పి పడిపోయింది. అక్కడ ఆయనకు ప్రాథమిక వైద్యం చేసిన అంబులెన్స్ సిబ్బంది దీనికిముందు మరో ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. ఆ మేరకు చిల్లకల్లు టోల్‌గేట్ దాటడానికి ముందే జరిగిన ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీ తాజాగా విడుదలైంది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు తెలంగాణ సరిహద్దు దాటాక చిలకల్లు టోల్‌గేటులోకి ప్రవేశిస్తాయి. ఈ టోల్‌గేట్ చేరుకోవడానికి ముందే జగ్గయ్యపేటలోని ఇండస్ట్రియల్ కారిడార్ వద్ద ఉన్న వై జంక్షన్‌లో ప్రవీణ్ ప్రమాదానికి గురైనట్టు పోలీసులు గుర్తించారు. ముందు వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేయబోయి ప్రవీణ్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఆ వెనుకే వస్తున్న బస్సును డ్రైవర్ వెంటనే పక్కకు తిప్పడంతో ప్రవీణ్‌కు పెను ప్రమాదం తప్పింది. అయితే, ప్రవీణ్ ప్రమాద స్థలం నుంచి లేవలేక కాసేపు అలాగే కూర్చుండిపోయారు. వెనుక వచ్చిన వాహనదారులు సాయం చేసేందుకు రాగా, ప్రవీణ్ మెల్లగా లేచి నిల్చున్నారు. ముగ్గురు వ్యక్తులు బుల్లెట్‌ను లేపి రోడ్డు పక్కన స్టాండ్ వేసి నిలిపారు. అనంతరం తూలుతూనే బుల్లెట్ ఎక్కిన ప్రవీణ్ దానిని స్టార్ట్ చేయడానికి కొద్దిసేపు నానా తంటాలు పడిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. ఇక్కడే కుడి చేయిపై గీసుకున్న గాయమైనట్టు తెలుస్తోంది. తర్వాత ఆయన కీసర టోల్‌గేట్ సమీపంలో, రామవరప్పాడు రింగ్ వద్ద ఇంకోసారి అదుపుతప్పి పడిపోయారని అక్కడి సీసీ కెమెరాల ఫుటేజీల్లో వెల్లడైంది. సీసీ కెమెరాల ఫుటేజీలన్నింటినీ పరిశీలిస్తున్న పోలీసులు.. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ వరుస ప్రమాదాలకు గురైనట్టు గుర్తించారు.


చిల్లకల్లు టోల్‌గేట్ సమీపంలో బుల్లెట్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయిన ప్రవీణ్ కుమార్

ప్రభుత్వ దర్యాప్తుపై పూర్తి నమ్మకముంది!

» అత్యుత్సాహంతో చేసే 'సొంత దర్యాప్తు'లు ఆపండి

» ప్రవీణ్ మృతిని రాజకీయాలకు వాడుకోకండి

» పాస్టర్ ప్రవీణ్ సోదరుడు, సతీమణి వినతి

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని రాజకీయ, మతపరమైన ప్రయోజనాలకు వాడుకోవడం ఆపి వేయాలని ఆయన సతీమణి జెస్సికా పగడాల, సోదరుడు కిరణ్ కోరారు. ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం జరుపుతున్న దర్యాప్తుపట్ల తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. బుధవారం వారు వేర్వేరుగా దీనిపై వీడియో ప్రకటన విడుదల చేశారు. వివరాలు వారి మాటల్లోనే...

"ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం సత్వరం స్పందించి పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.



దీనికి మేం ధన్యవాదాలు చెబుతున్నాం. అయితే... అత్యుత్సాహంతో సొంత దర్యాప్తు చేస్తున్న వారందరికీ నా విన్నపం! మీ సొంత దర్యాప్తులు ఆపండి. ఇది... ప్రవీణ్ పగడాల ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. కొందరు యూట్యూబర్లు, బ్లాగర్లు ప్రవీణ్ పగడాల మరణంపై తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తున్నారు. మరికొందరేమో ఆయన మరణాన్ని మతపరంగా, రాజకీయంగా వాడుకుంటున్నారు. ప్రవీణ్ పగడాలను గౌరవిస్తూ... ఇలాంటి చర్యలను ఆపివేయండి. ఆయన ఎప్పుడూ మత సామరస్యాన్నే కోరుకున్నారు. మేం ప్రభుత్వ దర్యాప్తును పూర్తిగా విశ్వసిస్తున్నాం. దయచేసి ఎవరూ మత సామరస్యాన్ని చెరిపివేయవద్దు."

- కిరణ్ (ప్రవీణ్ సోదరుడు)



"మాకు మద్దతుగా నిలబడిన క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ ధన్యవాదాలు. ఇలాంటి సమయంలో మాకు మీ సహకారం అవసరం. ప్రవీణ్ పగడాల ఒక మంచి భర్త, మంచి తండ్రి! ఆయన భౌతికంగా లేరని తెలిశాక... మేం అనుభవిస్తున్న బాధను అందరూ అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం వేగంగా స్పందించి, పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అందుకు మా ధన్యవాదాలు. ప్రభుత్వ దర్యాప్తుపై మాకు నమ్మకముంది. దయచేసి ఎవరూ మత సామరస్యాన్ని దెబ్బతీయవద్దు. నా భర్త మత సామరస్యాన్నే కోరుకున్నారు. దానిని దెబ్బతీయాలనే ఉద్దేశం ఆయనకు ఎన్నడూ లేదు."

- జెస్సికా (ప్రవీణ్ సతీమణి)

డబుల్ సమ్మర్!

» ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలతో సుదీర్ఘ వేసవి

» నేడు రాయలసీమ, కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో లానినా ముగిసింది. ప్రస్తుతం తటస్థ పరిస్థితులు ప్రారంభం కావడంతో భూమధ్యరేఖకు ఆనుకుని తూర్పు, పశ్చిమ పసిఫిక్ మహా సముద్రంలో సాధారణం కంటే తక్కువగా ఉండే ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చాయి. దీంతో 4నెలలపాటు కొనసాగిన లానినా ముగిసి, తటస్థ పరిస్థితులు ఏర్పడ్డాయని అంతర్జాతీయ వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు సెప్టెంబరు, నవంబరు వరకు కొనసాగే అవకాశాలున్నాయని అంచనా వేశారు. రానున్న నైరుతి రుతుపవనాల సీజన్‌లో తటస్థ పరిస్థితులు పోయి, ఎల్‌నినో వచ్చే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తేల్చిచెప్పింది. అయితే పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు కొనసాగుతున్నా.. దేశంలో ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఎక్కువ రోజులు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని, వచ్చే 3నెలల్లో డబుల్ సమ్మర్ ఎఫెక్టు ఉంటుందని చెప్పారు. దేశంలో రానురాను వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతల నమోదుతోపాటు సుదీర్ఘమైన వేసవి కాలం కొనసాగుతుందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవిగా పరిగణిస్తుంటారు. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే వేసవి తీవ్రత మొదలైంది. వేసవికాలం సుదీర్ఘంగా కొనసాగడం, పగలు, రాత్రి వేడి వాతావరణం నెలకొనడం ప్రజల ఆరోగ్యాలు, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. దిగుబడులు తగ్గడం, కొన్ని పంటలు బాగా దెబ్బతినడంతో వ్యవసాయ రంగం నుంచి వచ్చే ఆదాయం తగ్గుతుందని, తద్వారా దేశ ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందని ఇప్పటికే పలు ఆర్థిక సంస్థల అధ్యయనంలో వెల్లడైందని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకూ కొనసాగుతున్న పంటల సాగు విధానాలు, ప్రజల జీవన విధానం ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు.

నేడు, రేపు పిడుగులతో వానలు

దక్షిణ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కామెరూన్‌లలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో రెండు సముద్రాల నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తున్నాయి. వాటి ప్రభావంతో బుధవారం రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గాలులు, ఉరుములు, పిడుగులు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని పేర్కొంది. కాగా, రానున్న రెండు రోజులు కొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. గురువారం అల్లూరి, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో, శుక్రవారం మన్యం, అల్లూరి, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయన్నారు. పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని 23 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

వంశీ ఆదేశాలతోనే టీడీపీ కార్యాలయంపై దాడి

» పట్టాభి వస్తారన్న సమాచారంతోనే దాడికి సన్నద్ధం

» సీఐడీ విచారణలో వంశీ అనుచరుడు రంగా వెల్లడి!

విజయవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆదేశాలతోనే టీడీపీ ఆఫీసుపై దాడికి దిగామని ఈకేసులో ప్రధాన నిందితుడు, వంశీ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా సీఐడీ అధికారుల ముందు అంగీకరించినట్టు తెలిసింది. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై 2023 ఫిబ్రవరిలో వైసీపీ శ్రేణులు, అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడికి దిగి కారులకు నిప్పుపెట్టారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ కేసులో 3 రోజులు రంగాను విచారించేందుకు సీఐడీ పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో విజయవాడ జిల్లా జైలు నుంచి రంగాను బుధవారం కానూరులో ఉన్న సీఐడీ ఆఫీసుకు తరలించారు. అక్కడ రంగాను అదనపు ఎస్పీ శ్రీహరిబాబు, ఇన్‌స్పెక్టర్లు విచారించారు. 20 నుంచి 25 ప్రశ్నలు వేసినట్టుగా తెలిసింది. నాడు టీడీపీ అధికార ప్రతినిధిగా ఉన్న కొమ్మారెడ్డి పట్టాభి గన్నవరంలోని టీడీపీ కార్యాలయానికి వస్తారన్న సమాచారంతో దాడికి ప్రణాళికను రూపొందించామని రంగా చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ముందుగానే తాము వంశీ ఆఫీసులో భేటీ అయ్యామని, వంశీతో సంప్రదింపుల తర్వాతే రోడ్లపైకి వచ్చినట్టు చెప్పాడని తెలిసింది. నియోజవర్గంలో ఉన్న పార్టీ శ్రేణులను అక్కడికి ముందుగానే రప్పించి ఒక సమావేశాన్ని నిర్వహించినట్టు అంగీకరించాడని, కొన్ని ప్రశ్నలకు మాత్రం తనకేమీ తెలియదని సమాధానం ఇచ్చాడని సమాచారం. ఈ విచారణ గురు, శుక్రవారాల్లోనూ కొనసాగనుంది.

రంగాపై పీటీ వారెంట్: రంగాపై విజయవాడ పటమట పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో రంగా ఐదో నిందితుడి గా ఉన్నాడు. అతడిని కోర్టులో హాజరుపరిచేందుకు పటమట పోలీసులు పీటీ వారెంట్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో దాఖలు చేశారు. దీనిపై రంగా తరఫు న్యాయవాదులకు గురువారం నోటీసులు జారీ చేస్తామని కోర్టు వెల్లడించింది.

నాపై రజినీ హత్యాయత్నం

» మాజీ మంత్రిపై నవతరం పార్టీ నేత ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని తనపై హత్యాయత్నం చేశారని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నవతరం పార్టీ నేత రావు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేట డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'రజిని మా పార్టీ కార్యాలయంపై 2022, ఏప్రిల్‌లో దాడి చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేకుండా చేసుకున్నారు' అని ఆరోపించారు.

హెచ్5ఎన్1 తోనే.. రెండేళ్ల చిన్నారి మృతి

» ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన ఐసీఎంఆర్

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్‌లో మరణించిన రెండేళ్ల చిన్నారికి హెచ్5ఎన్1 పాజిటివ్‌గా తేలిందని ఆరోగ్యశాఖ తెలిపింది. మార్చి 4న పల్నాడు జిల్లా, నరసరావుపేటలోని బాలయ్యనగర్‌కు చెందిన రెండేళ్ల చిన్నారిని ఎయిమ్స్‌లో చేర్చారు. జ్వరం, ఊపిరి ఆడకపోవడం, ముక్కు కారటం, మూర్ఛ, విరేచనాలు వంటి లక్షణాలను వైద్యులు గుర్తించారు. అయితే, వైద్యులు ఎంత ప్రయత్నించినా నయం కాలేదు. ఈ క్రమంలో మార్చి 16న చిన్నారి మరణించింది. ఇదిలావుంటే, మార్చి 7న శ్వాసకోశ వైరస్ పరీక్ష కోసం చిన్నారి స్వాబ్‌ను ఐసీఎంఆర్‌కు పంపించారు. ఈ నమూనాలో హెచ్5ఎన్1 పాజిటివ్‌గా తేలిందని ఐసీఎంఆర్ నివేదించింది. ఈ నేపథ్యంలో గత నెల 31న ఐసీఎంఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. దీంతో ఆరోగ్యశాఖ అధికారులు బాలయ్యనగర్‌లో జ్వర లక్షణాలపై సర్వే చేశారు. మరోవైపు ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ, కర్నూలులో 10 పడకల ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసింది. సంబంధిత మందులు అందుబాటులో ఉంచింది.

కాకాణి దాగుడుమూతలు!

» హైదరాబాద్‌లో పోలీసులకు కనిపించకుండా మాయం

» దీంతో సమీప బంధువుకు నోటీసులు అందజేత

» నేడు నెల్లూరులో విచారణకు రావాలని ఆదేశం

» ముందస్తు బెయిల్, క్వాష్ పిటిషన్లపై నేడు హైకోర్టు తీర్పు

నెల్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ కేసులో పోలీసుల నోటీసులను మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి లెక్కచేయడం లేదు. పైగా వారు వచ్చినప్పుడు ఇంట్లో ఉండకుండా దాగుడుమూతలు ఆడుతున్నారు. గత ఆదివారం నెల్లూరులో నోటీసులివ్వడానికి పోలీసులు నివాసానికి వెళ్లగా.. ఆయన కనిపించలేదు. దీంతో ఇంటి గేటుకు, గోడకు అంటించారు. సోమవారం ఉదయం 11 గంటలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి రమ్మని అందులో పేర్కొన్నారు. కానీ ఆయన రాలేదు. దీంతో పోలీసులు హైదరాబాద్ వెళ్లారు. అక్కడి నివాసంలో కూడా ఆయన లేకపోవడంతో బంధువుకు నోటీసులు అందజేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నెల్లూరులో విచారణకు రావాలన్నారు. అయినా హాజరుకాలేదు. మళ్లీ బుధవారం మనుబోలు ఎస్సై రాకేశ్ తన బృందంతో హైదరాబాద్ వెళ్లారు. వారు వెళ్లిన సమయానికి ఆయన పత్తాలేకుండా పోయారు. దరిమిలా ఆయన సమీప బంధువుకు నోటీసులు అందించారు. గురువారం ఉదయం 11 గంటలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి రావాలని స్పష్టంచేశారు. విచారణకు రాకుండా ఆయన తప్పించుకోవడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. అయితే ఆయన గురువారం నెల్లూరు రానున్నట్లు వైసీపీ వర్గాలకు సమాచారం అందింది. ఆయన వస్తే అదుపులోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పొదలకూరు మండలం మహమ్మదాపురంలో ప్రభుత్వానికి చెందిన రుస్తుం మైన్స్‌లోకి అక్రమంగా చొరబడి రూ.250 కోట్ల విలువ చేసే క్వార్ట్జ్‌ను తవ్వుకుపోయారన్న అభియోగాలతో నమోదైన కేసులో కాకాణి ఏ-4గా ఉన్నారు. క్వారీకి దిగువన ఉన్న ఎస్టీ కాలనీకి ప్రమాదం వాటిల్లేలా భారీ పేలుళ్లతో కాలనీని ధ్వంసం చేశారని, దానిని ప్రశ్నించినందుకు తమను బెదిరించారని కొందరు ఎస్టీలు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ను చేర్చారు. ఈ వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోసం ఒకటి.. పోలీసులు పెట్టిన కేసును పూర్తిగా కొట్టివేయాలని మరొక పిటిషన్‌ను ఆయన హైకోర్టులో దాఖలుచేశారు. గురువారం తీర్పు వెలువడనుంది. దీంతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

అయ్యన్నను చంపేస్తానన్న వైసీపీ నేత కర్రి శ్రీను అరెస్టు

» నంద్యాల జిల్లాలో కేసు నమోదు



నర్సీపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): "అయ్యన్నను చంపేస్తా" అంటూ అసెంబ్లీ స్పీకర్‌పై బహిరంగ వ్యాఖ్యలు చేసి.. బెదిరింపులకు దిగిన అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావును నంద్యాల జిల్లా జలదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో శారదా నగర్‌లోని శ్రీ శ్రీనివాస మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ వద్ద ఉన్న కర్రి శ్రీను వద్దకు పట్టణ సీఐ గోవిందరావు, ఎస్ఐ రమేశ్, జలదుర్గం పోలీసులు వెళ్లారు. ఆయన్ను జీపులో ఎక్కించుకుని తమ వెంట తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కర్రి శ్రీను పోలీసులతో వాగ్వాదానికి దిగి.. నోటీసు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని నిలదీశారు. శారదానగర్‌లో కర్రి శ్రీను సోదరుడు సత్తిబాబుకు చెందిన శ్రీశ్రీనివాస మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ భవనాన్ని ప్రభుత్వ భూమి ఆక్రమించి కట్టారని పేర్కొంటూ ఫిబ్రవరి 24న రెవెన్యూ అధికారులు కూల్చేశారు. ఈ సందర్భంగా కర్రి శ్రీనివాసరావు.. అసెంబ్లీ స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "నా కుటుంబాన్ని ఎందుకు బాధ పెడతారు. నన్ను చంపేయమనండి. లేదంటే నేనే ఆయన్ని చంపేస్తా" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధుబాబు నర్సీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా శ్రీను హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. మరోవైపు.. నంద్యాల జిల్లా జలదుర్గం గ్రామానికి చెందిన టీడీపీ నేత దూదీకుల హుస్సేన్ మార్చి 6న అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, బెదిరించడంతో మనస్తాపం చెందానని పేర్కొన్నారు. దీంతో జలదుర్గం పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేసి, బుధవారం అరెస్టు చేశారు.

ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రాతిపదికేంటి?

(మొదటి పేజీ తరువాయి)

కురిపించింది. వైసీపీ ప్రభుత్వంలో జగన్ సొంత మీడియాకు ప్రజల సొమ్మును దోచిపెట్టి.. ఇతర పత్రికలకు తక్కువ ప్రకటనలు జారీ చేయడం, ఆంధ్రజ్యోతికి అసలేమీ ఇవ్వకపోవడంపై.. కూటమి ప్రభుత్వం వచ్చాక విజయవాడకు చెందిన ఒక జర్నలిస్టు చేసిన ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ చేపట్టింది. 2019-24 మధ్య రూ.859 కోట్లు ప్రభుత్వ ప్రకటనలు జారీచేయగా.. అందులో సగానికి పైగా జగన్ సొంత మీడియాకు, మిగతా మొత్తంలోనూ అత్యధిక వాటా సానుకూల మీడియాకు విడుదల చేసినట్లు గుర్తించింది. ఈ బాగోతంపై ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించడంతో గత నవంబరులో కేసు నమోదు చేసిన గుంటూరు ఏసీబీ అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డిని నిందితుడిగా చేర్చి విచారణకు పిలిచారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన కోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. విచారణకు సహకరించని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు హెచ్చరించడంతో తప్పని పరిస్థితుల్లో ఆయన బుధవారం గుంటూరులోని ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఉదయం 10:30 గంటల నుంచి రాత్రి 7.15 వరకు సుమారు 8 గంటలపాటు అధికారులు సుదీర్ఘంగా విచారించారు. మధ్యాహ్నం కొద్ది సమయం భోజన విరామం ఇచ్చారు. ఏపీసీ గురించి ఏసీబీ అడుగగా.. తాను పీఐబీతో సంప్రదించానంటూ పొంతన లేని సమాధానం చెప్పారు. ఏసీబీ అధికారుల ప్రశ్నలకు ఆయన సూటిగా జవాబులివ్వలేదని తెలిసింది. డాక్యుమెంటరీ ఆధారాలను ముందుంచి ప్రశ్నించడంతో ఆయన ఏమీ మాట్లాడలేదని సమాచారం. ఈ నేపథ్యంలో మరింత లోతుగా ప్రశ్నించడానికి గురువారం కూడా విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. గుంటూరు ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర ఆధ్వర్యంలో ఈ విచారణ జరిగింది. ఏసీబీ కార్యాలయం నుంచి తిరిగి వచ్చేటప్పుడు.. ఏమేం అడిగారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. విజయ్‌కుమార్‌రెడ్డి ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయారు.


విచారణ అనంతరం బుధవారం రాత్రి గుంటూరు ఏసీబీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న విజయకుమార్‌రెడ్డి


నక్కా లక్ష్మి


దీపిక


నిందితుడు నవీన్

విశాఖలో ఉన్మాది ఘాతుకం

» పెళ్లికి నిరాకరించిందని యువతితోపాటు ఆమె తల్లిపై కత్తితోదాడి.. తల్లి మృతి

విశాఖపట్నం, శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తనతో పెళ్లికి నిరాకరించిందనే కక్షతో యువతిపైనా, ఆమె తల్లిపైనా విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడో ఉన్మాది. ఈ ఘటనలో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా, యువతి తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైంది. ఈ ఘటనకు సంబంధించి విశాఖ సీపీ శంఖబ్రతబాగ్చి బుధవారం వివరాలు వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రేగిడి మం డలం పుర్లి గ్రామానికి చెందిన నక్కా రాజు కొన్నాళ్ల క్రితం విశాఖ వలస వచ్చి కొమ్మాదిలో ఉంటున్నారు. ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతడికి భార్య లక్ష్మి, కుమార్తె దీపిక (20), కుమారుడు ఉన్నారు. దీపిక నర్సింగ్ పూర్తిచేసి ఒక స్కిన్ కేర్ సెంటర్‌లో పనిచేస్తోంది. దీపిక కొన్నాళ్ల కిందట వీరఘట్టం మండలం పనసనందివాడలోని తన పిన్ని ఇంటికి వెళ్లగా, అక్కడ దమరశింగి నవీన్(26)తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత నుంచి నవీన్.. ప్రేమ పేరుతో ఆమె వెంటపడుతున్నాడు. తల్లిదండ్రులకు చెప్ప గా, పోలీసులకు ఫిర్యాదు చేసే యువకుడి జీవితం నాశనమవుతుందని భావించి మిన్నకుండిపోయారు. కొన్నాళ్ల కిందట నవీన్ పెళ్లి సంబంధం మాట్లాడేందుకంటూ తన పెద్దమ్మను, పిన్నిని తీసుకుని దీపిక ఇంటికి వెళ్లాడు. ఉద్యో గం లేకుండా జులాయిగా తిరిగేవాడికి తన కుమార్తెను ఇచ్చేది లేదని దీపిక తల్లి లక్ష్మి తెగేసి చెప్పింది. అయితే, తాను ఆమెను తప్ప మరెవరినీ పెళ్లి చేసుకోనని నవీన్ వేడుకోవడంతో వారు కాస్త మెత్తబడ్డారు. ఏడాది లోగా ఉద్యోగం సంపాదించుకుంటే వివాహం చేస్తామన్నారు. కానీ, 15రోజుల కిందట నవీన్ దీపికను బెదిరించి బైక్ మీద పనసనందివాడ తీసుకువెళ్లాడు. అక్కడ దీపికను ఆమె పిన్ని చూసి నవీన్‌ను మందలించింది. దీపికను తిరిగి విశాఖ పంపేసింది. దీంతో పెళ్లికి అంగీకరించడం లేదని దీపికపైనా, ఆమె కుటుంబ సభ్యులపైనా నవీన్ కక్ష పెంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కొమ్మాదిలోని దీపిక ఇంట్లోకి ప్రవేశించాడు. వెంట తీసుకువెళ్లిన కత్తితో దీపిక తల్లిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం దీపికపై కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమె కూడా మరణించిందని భావించిన నవీన్ అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యాడు. శ్రీకాకుళం వైపు వెళ్తున్న నవీన్‌ను పోలీసులు పట్టుకుని విశాఖ తరలించారు. కాగా.. హోంమంత్రి అనిత ఈ ఘటనపై సీపీతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.